PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 43 సంచిక : 54 | విజయవాడ, ఆదివారం 24 సెప్టెంబర్ 2023 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7. 00

Vol No | Vijayawada, Sunday 24 September 2023 | Rs

హాంగ్‌జౌ స్పోర్ట్స్ సెంటర్‌లో మార్చ్‌పాస్ట్ నిర్వహిస్తున్న భారత్ బృందం

చైనా సాహిత్య వారసత్వాన్ని, సామరస్యాన్ని రంగుల్లో ప్రతిఫలింపజేస్తున్న కళాకారులు

అబ్బురపరచిన ఆసియా క్రీడల ప్రారంభం

- ముఖ్య అతిథిగా హాజరైన జిన్ పింగ్
- త్రివర్ణ పతకాన్ని చేబూనిన హర్మన్, లవ్లీనా

హాంగ్జౌ(చైనా): ఆసియా ఖండంలో అతి పెద్ద క్రీడా పండుగ ఆసియాడ్ ప్రారంభం అదిరింది. చైనాలోని జెజియాంగ్ ప్రావిన్స్ రాజధాని హాంగ్జౌ నగరంలో కమలం ఆకారంలో ఉన్న ప్రధాన స్పోర్ట్స్ సెంటర్‌లో శనివారం సాయంత్రం 5.30 గంటలకు చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ వీటిని ప్రారంభించారు. కనులు మిరుమిట్లు గొలిపే లేజర్ షో, వర్చువల్ బాణాసంచాలు, అబ్బుర పరిచే సాంస్కృతిక కార్యక్రమాలు ప్రేక్షకులను మంత్రముగ్ధులనుగావించాయి. హాంగ్‌జౌ ఒలింపిక్ స్పోర్ట్స్ సెంటర్ స్టేడియంలో సంప్రదాయ నత్య ప్రదర్శనలు అహూతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ క్రీడలకు చైనా ఆతిథ్యమివ్వడం ఇది మూడోసారి.

పర్యావరణ పరంగా, సాంకేతిక పరంగా అత్యంత అధునాతనమైన పద్ధతిలో వసతులు కల్పించారు. గత ఏడాది ఈ క్రీడలు జరగాల్సి ఉన్నప్పటికీ, కోవిడ్ కారణం ఈ ఏడాదికి వాయిదా పడ్డాయి. రెండు వారాల పాటు కొనసాగే ఈ క్రీడలు వచ్చే నెల8న ముగియనున్నాయి. ప్రారంభోత్సవానికి నాలుగు రోజుల ముందు నుంచే కొన్ని మ్యాచ్‌లు నిర్వహిస్తున్నారు. ఈ క్రీడల్లో 45 దేశాల నుంచి 12,500 మంది అథ్లెట్లు పాల్గొంటున్నారు. హాంగ్‌జౌ, ఆ సమీపంలోని అయిదు నగరాల్లో 54 వేదికలపై పోటీలు నిర్వహిస్తారు. 40 ఈవెంట్లలో 61 విభాగాల్లో 481 బంగారు పతకాల కోసం క్రీడాకారులు పోటీ పడుతున్నారు. ఆతిథ్య చైనానుంచి 886మంది అథ్లెట్లు పతకాలకు పోటీపడుతున్నారు. ఆసియా క్రీడల్లో నాలుగు దశాబ్దాలుగా చైనా తిరుగులేని ఆధిక్యతను ప్రదర్శిస్తోంది. 1982లో మొదటిసారి చైనా ఆసియాడ్‌లో ఓవరాల్ మిగతా 6లో

తొలిరోజు ఆరు గంటలు

- బాబును ప్రశ్నించిన సిఐడి
- నేడూ కొనసాగనున్న విచారణ



ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులోని కాన్ఫరెన్స్ హాలులో మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడి విచారణ ప్రక్రియ ప్రారంభమైంది. తొలిరోజైన శనివారం సిఐడి డిఎస్‌పి ధనుంజయుడు నేతృత్వంలో 12 మంది అధికారుల బృందం చంద్రబాబును సుమారు ఆరు గంటల పాటు ప్రశ్నించింది. స్కిల్ డవలప్‌మెంట్ స్కామ్ కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న చంద్రబాబును రెండు రోజులపాటు విచారించేందుకు సిఐడికి కోర్టు అనుమతి ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో తొలిరోజు విచారణ ఉదయం 9.30 గంటలకు ప్రారంభమై సాయంత్రం ఐదు గంటల వరకూ కొనసాగింది. ఉదయం 9.15 గంటలకే అధికారులు లాప్‌ట్యాప్, ప్రింటర్స్‌లతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులోకి వెళ్లారు. తొలుత జైలులో చంద్రబాబుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. చంద్రబాబు తరుపున లాయర్లు దమ్మాలపాటి శ్రీనివాస్, సుబ్బారావు సమక్షంలో తొలిరోజు విచారణ సాగింది. సీమెన్స్ ఒప్పందం, ఆర్థిక లావాదేవీలపై ప్రధానంగా విచారించినట్లు సమాచారం. మధ్యాహ్న భోజనంతోపాటు మొత్తం ఏడుసార్లు అధికారులు బ్రేక్ ఇచ్చినట్లు తెలిసింది. చంద్రబాబు వయస్సు, ఆరోగ్యం దృష్ట్యా జైలు ఆవరణలోనే వైద్య బృందాన్ని అందుబాటులో ఉంచారు. ఉదయం, సాయంత్రం మొత్తం సుమారు ఆరు గంటలపాటు సుదీర్ఘ విచారణ జరిగింది. కోర్టు ఆదేశానుసారం గంటకోసారి ఐదు నిమిషాలు బ్రేక్ ఇచ్చారు. సిఐడికి చెందిన వీడియోగ్రాఫర్‌తో విచారణను అధికారులు రికార్డింగ్ చేయించారు. విచారణ అనంతరం చంద్రబాబుకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆదివారం కూడా విచారణ కొనసాగనుంది. రెండు రోజుల విచారణ అనంతరం వీడియో మొత్తాన్ని సీల్డ్ కవర్‌లో కోర్టుకు అందించాలని సిఐడి న్యాయమూర్తి ఆదేశించిన సంగతి తెలిసిందే.

తొలి రోజు 50కిపైగా ప్రశ్నలు? (6లో)

ఇ-క్రాప్ డొల్లే!

- ఖరీఫ్‌లో భారీగా నకిలీ నమోదుల గుర్తింపు
- నాలుగు జిల్లాల డిఎఓలకు మెమోలు
- అత్యధిక ఎంట్రీలైన జిల్లాలపై ప్రత్యేక నిఘా
- బోగస్‌లతో రైతులకు నష్టం

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

రైతుల కోసం అమలు చేస్తున్న అన్ని పథకాలకూ ప్రభుత్వం ఇ-క్రాప్‌ను తప్పనిసరి చేయగా, సదరు ఇ-క్రాప్ నమోదుల్లో డొల్లతనం బయట పడుతోంది. అనర్హుల ఏరివేత, అర్హులకే లబ్ధి, పూర్తి పారదర్శకత.. ఇవన్నీ ఉత్తుత్తి కబుర్లేనని తేలిపోతోంది. ఇ-క్రాప్ నమోదుల కోసం ఏటేటా టెక్నాలజీ పరంగా కొత్త ఫీచర్స్‌తో అప్‌డేట్ వెర్షన్లు ప్రవేశపెడుతున్నామంటున్నా నకిలీ ఎంట్రీలు ఆగట్లేదు. నియంత్రణల్లోని లొసుగులను ఇట్టే పసిగట్టి తప్పుడు మార్గాలను అన్వేషించి తమ పని తాము చేసుకుపోతున్నారు. ఈ ఖరీఫ్‌లో ఇ-క్రాప్ బుకింగ్‌ల్లో పెద్ద ఎత్తున తప్పిదాలు జరిగినట్లు వ్యవసాయశాఖ గుర్తించింది. బోగస్ ఎంట్రీలకు పాల్పడ్డ జిల్లాల అధికారులకు మెమోలు జారీ చేసింది. అతి తక్కువ సమయంలోనే వంద శాతం ఎంట్రీలతో ముందున్న నెల్లూరు, తిరుపతి డిఎఓలకు మెమోలిచ్చినట్లు సమాచారం. అన్నమయ్య, కర్నూలు అధికారులకూ తాఖీదులిచ్చినట్లు తెలిసింది. అలాగే 70 శాతానికిపైన ఇ-క్రాప్ అయిందని చెబుతున్న బాపట్ల, కడప, శ్రీకాకుళం, ప్రకాశం, గుంటూరు, నంద్యాల జిల్లాలపై గట్టి నిఘా ఉంచారు.

ప్లేస్టోర్‌లో డౌన్‌లోడ్

ఆర్‌బికె సిబ్బంది రైతుల పొలాలను సందర్శించకుండానే ఇళ్లల్లో, ఆఫీస్‌ల్లో కూర్చొని పంట సాగులను నమోదు చేస్తున్నారన్న ఆరోపణల నేపథ్యంలో ఈ తడవ యాప్ ఫీచర్స్‌లో మార్పులు చేశారు. సిబ్బంది తప్పనిసరిగా పొలాల వద్దకెళ్లి రైతుల ఫొటోలతో సహా వివరాలు నమోదు చేసేలా యాప్‌ను రూపొందించారు. 200 మీటర్ల రేడియస్‌లోకి వెళితేనే యాప్‌లో సర్వేనెంబర్ ఓపెన్ అవుతుందని, సిబ్బంది అనివార్యంగా పొలాల దగ్గరకెళ్లాల్సిందేనని చెప్పారు. సిబ్బంది దీనికీ లొసుగులు కనుక్కొన్నారు. ఎంఎఓల డౌన్‌లోడ్స్‌ను కాకుండా గూగుల్ ప్లేస్టోర్‌లో జియోకోర్డినేట్స్‌ను డౌన్‌లోడ్ చేసుకొని సర్వేనెంబర్లను సెలెక్ట్ చేసి ఎక్కడి నుంచైనా ఎంట్రీ చేసే మెథడ్‌ను అనుసరిస్తున్నారు. ఒక ట్యాబ్, రెండు మూడేసి స్మార్ట్ ఫోన్లు పెట్టుకొని ఇ-క్రాప్ ఎంట్రీలు చేస్తున్నారు. వాస్తవంగా పంటలు సాగు కాకపోయినా ఉజ్జాయింపు గణాంకాల ఆధారంగా ఎంట్రీలు చేశారని గుర్తించారు. నాలుగైదు రోజుల్లోనే నెల్లూరు జిల్లాలో వంద శాతం ఇ-క్రాప్ కావడంతో అనుమానం వచ్చి పరిశీలించగా నకిలీ ఎంట్రీలుగా గుర్తించారు. వ్యవసాయశాఖ మంత్రి జిల్లాలోనే ఈ విధంగా జరగడంతో డిఎఓకు మెమో ఇచ్చినట్లు సమాచారం. తిరుపతిలోనూ 98 శాతంపైన ఎంట్రీలు కావడంపై డిఎఓకు మెమో ఇచ్చారు. అధిక ఎంట్రీలున్న మరికొన్ని జిల్లాలపైనా దృష్టి సారించారు.

సూపర్‌వైజరీ చెక్స్‌లో బట్టబయలు

ఆర్‌బికె సిబ్బంది ఎంట్రీ, విఆర్‌ఒ అథంటికేషన్ తర్వాత రెవెన్యూ, వ్యవసాయశాఖ వివిధ స్థాయి అధికారుల జాయింట్ అజమాయిషీ ఉంది. వ్యవసాయశాఖ దగ్గరకొస్తే వివిఎలు చేసిన నమోదుల్లో నుంచి ర్యాండమ్‌గా 10 శాతం ఎంట్రీలను ఎంఎఒ చెక్ చేయాలి. ఎ.డి.లు 5 శాతం, డిఎఒలు 2 శాతం సూపర్‌వైజరీ చెక్ చేయాలి. ఇప్పటి వరకు డిఎఒలు రాష్ట్ర వ్యాప్తంగా 2,411 ఎంట్రీలను పరిశీలించగా 781 తప్పుగా గుర్తించారు. సుమారు 33 శాతం. నెల్లూరులో 481 మిగతా 6లో

ప్రతిపక్షాన్ని సస్పెండ్ చేసి...

ఏకపక్ష నిర్ణయాలు సరికాదు

- అసెంబ్లీలో తొడలు కొట్టడం, మీసాలు మెలేయడమా?
- దేశంలో నిరంకుశ పాలన : వి శ్రీనివాసరావు
- కలెక్టరేట్ వద్ద ధర్నాతో ముగిసిన పోరుబాట-పాదయాత్ర

ఒంగోలులో సిపిఎం ఆధ్వర్యాన నిర్వహించిన ర్యాలీలో వి.శ్రీనివాసరావు తదితరులు

ప్రజాశక్తి- ఒంగోలు కలెక్టరేట్

ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికైన అసెంబ్లీలో సమస్యలను ఎమ్మెల్యేలు గాలికి వదిలేశారని, తొడలు కొట్టడం, మీసాలు మెలేయడం సరికాదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్షాన్ని సస్పెండ్ చేసి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం సరికాదని తెలిపారు. దేశంలో నిరంకుశ పాలన సాగుతోందని, రాజ్యాంగ వ్యవస్థలు మోడీ కాళ్లకింద నలిగిపోతున్నాయని అన్నారు. ప్రకాశం జిల్లాను వెనుకబడిన జిల్లాగా ప్రకటించాలని, జిల్లా అభివృద్ధికి రూ.10 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన సిపిఎం పోరుబాట-పాదయాత్ర ముగింపు సందర్భంగా ప్రకాశం జిల్లా ఒంగోలులోని కర్నూలు రోడ్డు ఫ్లైఓవర్ వద్ద పాదయాత్ర బృందానికి ఆ పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అక్కడి నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. కలెక్టరేట్ వద్ద జరిగిన ధర్నాలో వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పశ్చిమ ప్రకాశంలో తాగునీటి కోసం జనం అల్లాడుతున్నారని, కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యేలు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాలకు టిడిపి ఎమ్మెల్యేలు హాజరు కావాలన్నారు. కొట్టుకుపోయిన గుండ్లకమ్మ గేటు పెట్టడం వైసిపి ప్రభుత్వానికి చేతకాలేదని విమర్శించారు. ఈ ప్రాజెక్ట్ నుంచి తాగునీరు ఇచ్చే పరిస్థితి లేదని తెలిపారు. ఒంగోలు డెయిరీని గత ప్రభుత్వం మూసివేస్తే, వైసిపి ప్రభుత్వం అమూల్ సంస్థకు మిగతా 6లో

అవయవదాతలకు ప్రభుత్వ లాంఛనాలతో

అంత్యక్రియలు

- తమిళనాడు ప్రభుత్వం

చెన్నై : అవయవ దాతలకు ప్రభుత్వం లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తామని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ శనివారం ప్రకటించారు. రాష్ట్ర అవయవదాన దినం సందర్భంగా తమిళనాడు ప్రభుత్వం ఈ కీలక నిర్ణయం తీసుకుంది. 'అవయవ దానం విషయంలో తమిళనాడు దేశంలోనే అగ్రగామిగా ఉంది. విషాదకర పరిస్థితుల్లో తమ ఆత్మీయుల అవయవాలను దానం చేసేందుకు ముందుకు వచ్చిన కుటుంబాల నిస్వార్థమైన త్యాగాల వల్లే ఈ ఘనత సాధ్యమైంది. మరణానంతర అవయవదానం చేయటం వల్ల ఎంతో మంది ప్రాణాలు నిలబడ్డాయనే విషయాన్ని ప్రతి ఒక్కరూ తమ బంధుమిత్రులకు తెలియజేయాలి. మిగిలిన వాళ్లు కూడా అవయవ దానం చేసేలా ప్రోత్సహించాలి. అవయవ దాతలు, వారి కుటుంబ సభ్యుల త్యాగాన్ని గుర్తించి ఆర్గాన్ డోనర్స్ అంత్యక్రియలకు రాష్ట్రం తరపున గౌరవం ఇవ్వాలనే ఉద్దేశ్యంతో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని సిఎం స్టాలిన్ పేర్కొన్నారు.

జడ్జిపై పోస్టింగులు పెట్టిన వారిపై చర్యలు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడ ఎసిబి కోర్టు అడిషనల్ జడ్జి హిమబిందుపై ఆమెకు వ్యక్తిగతంగా ఇబ్బంది కలిగించేలా సోషల్ మీడియాలో పోస్టింగులు పెట్టే వారిపై చర్యలు తీసుకోవాలని సిఎస్ జవహర్‌రెడ్డికి రాష్ట్రపతి భవన్ కార్యదర్శి పిసి మీనా లేఖ రాశారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో టిడిపి అధినేత చంద్రబాబు నాయుడుపై సిఐడి నమోదు చేసిన కేసులో విజయవాడ ఎసిబి కోర్టు అడిషనల్ జడ్జి హిమబిందు జ్యుడీషియల్ రిమాండ్ విధించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమెను ఇబ్బందిపెట్టేలా పోస్టింగులు, వ్యాఖ్యలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలంటూ పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన అడ్వకేట్ రామానుజరావు ఇ మెయిల్ ద్వారా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్రపతి భవన్ నుంచి చర్యలు తీసుకోవాలంటూ సిఎస్‌కు లేఖ వచ్చింది.



Gmail ramanuja rao <ramu99444@gmail.com>

1 of 2,525 Sub: Complaint against online stalkers, abusers, bullies and revengers who are spreading rumours and hated speech against HON'BLE III ADDL. SESSIONS JUDGE-CUM- SPECIAL JUDGE FOR SPE & ACB CASES, VIJAYAWADA , Hon'ble Judge Hima Bindu

2 messages

ramanuja rao <ramu99444@gmail.com> Tue, Sep 19, 2023 at 10:59 PM

To: us.petitions@rb.nic.in, "supremecourt@nic.in" <supremecourt@nic.in>, regvigtaphc@nic.in, wlm-rb@rb.nic.in, collector_wgd@ap.gov.in, cm@ap.gov.in, collectorwestgodavari@gmail.com, sp_bvrm@gmail.com

E mail

Date: 19-09-2023
Penugonda

From,
I Ramanuja Rao, Advocate
4-13, Gollagudem Street, Penugonda
West Godavari District,
Bhimavaram, Andhra Pradesh.

To,
The Superintendent of Police,
O/o. Superintendent of Police, ,
West Godavari District.
Bhimavaram

Sub: Complaint against online stalkers, abusers, bullies and revengers who are spreading rumours and hate speech against HON'BLE III ADDL. SESSIONS JUDGE-CUM- SPECIAL JUDGE FOR SPE & ACB CASES, VIJAYAWADA , Hon'ble Judge Hima Bindu

Respected Sir,

My name is Ramanuja Rao and I am a practising advocate. With reference to the above caption subject, it is to bring to your kind notice that:

1. Hon'ble Judge Himabindu has delivered a judgement remanding Ex-Chief Minister, Current MLA and President of Telugu Desam Party, Sri Nara Chandrababu Naidu, giving him judicial custody.
2. From the moment she delivered the judgement, without even considering her position, dignity, her privacy and integrity, few online revengers, stalkers and abusers started circulating various posters, memes and other vulgar, sexist and racist literature over her, pelting mud over her dignity and her moral character.
3. It has become a serious threat to her personal life and liberty when these posts stooped down to the extent of publicly bringing the names of various senior police officers and associating her with them of illegal and illicit relations.
4. They have also started posting morphed photographs publicising and attributing her personal life to a particular political orientation and also started posting abusive literature along with words of unspeakable and unprintable language.

విశాఖ ఉక్కులోకి జిందాల్!

- బిఎఫ్ 3ని అడ్డం పెట్టుకుని స్టీల్‌ప్లాంట్‌లో ప్రవేశానికి కుట్ర
- సహకరిస్తున్న ఉక్కు యాజమాన్యం?

2

సస్పెండ్ చేయాల్సిందే!

- బిధూరి వ్యాఖ్యలు సభా హక్కుల ఉల్లంఘనే
- స్పీకర్‌కు ప్రతిపక్షాల లేఖ

న్యూఢిల్లీ : బిఎస్‌పి ఎంపి దనీష్ అలీపై గురువారం రాత్రి లోక్‌సభ వేదికగా దూషణలకు దిగిన బిజెపి ఎంపి రమేష్ బిధూరిని సస్పెండ్ చేయాల్సిందేనని ప్రతిపక్ష పార్టీలు పట్టుబట్టాయి. బిధూరి వ్యవహారం సభా హక్కుల ఉల్లంఘన కిందికి వస్తుందని, కాబట్టి దీనిని సభా హక్కుల కమిటీకి నివేదించాలని నాలుగు ప్రతిపక్ష పార్టీలు స్పీకర్‌కు రాసిన లేఖలో కోరాయి. బిఎస్‌పి అధ్యక్షురాలు మాయావతి ఆలస్యంగా స్పందించారు. బిధూరిపై బిజెపి సముచితమైన చర్య తీసుకోకపోవడం విచారకరమని ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారు.సభా హక్కుల కమిటీ తన దర్యాప్తును పూర్తి చేసేవరకూ ఎంపి బిధూరిని సస్పెండ్ చేయాలని కోరుతూ లోక్‌సభలో కాంగ్రెస్ నేత అధిర్ రంజన్ చౌదరి, డిఎంకె ఎంపి కనిమొళి, ఎన్‌సిపి నేత సుప్రియా సులె, టిఎంసి నేత అపురూప పొద్దార్ స్పీకర్‌కు లేఖ రాశారు. ఇండియా ఫోరమ్‌లోని ఇతర సభ్య పార్టీల నుండి కూడా మరిన్ని లేఖలు రానున్నట్లు సమాచారం.

ఒక మైనారిటీ కమ్యూనిటీకి చెందిన సభ్యునిపై పార్లమెంట్ చరిత్రలోనే ఎన్నడూ ఇలాంటి అనుచిత పదజాలాన్ని ఉపయోగించలేదని అధిర్ రంజన్ చౌదరి తన లేఖలో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు ఇప్పటికే ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాలో వచ్చేసినందున వీటిని రికార్డుల నుంచి తొలగించినా పెద్ద ప్రభావమేమీ వుండదన్నారు. గొడవ జరుగుతున్న సమయంలో... నవ్వుకుంటూ కనిపించిన ఇద్దరు మాజీ కేబినెట్ మంత్రులు రవిశంకర్ ప్రసాద్, హర్ష వర్ధన్ వైఖరి పట్ల కూడా సర్వత్రా నిరసనలు వ్యక్తమయ్యాయి. బిధూరితో సహా వారి వైఖరిని కూడా ఖండించాల్సి వుందని కాంగ్రెస్ నేత జైరాం రమేష్ పోస్ట్ చేశారు. "బిజెపి ఎంపి బిధూరి ప్రసంగం సాగుతున్నపుడు సభలో గందరగోళంగా వుంది. బిధూరి ఏం అంటున్నారో చూడండి అంటూ దనీష్ అలీ నన్ను అప్రమత్తం చేసిన వెంటనే నేను ఆ అన్‌పార్లమెంటరీ పదజాలాన్ని రికార్డుల నుండి తొలగించాలంటూ రూలింగ్ ఇచ్చాను, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కూడా బిధూరి తరపున క్షమాపణ చెప్పారు, కానీ బిధూరిని సస్పెండ్ చేసే అధికారం నా చేతుల్లో లేదు." అని వాగ్వాదం జరిగిన సమయంలో సభాధ్యక్ష స్థానంలో వున్న కాంగ్రెస్ ఎంపి సురేష్ చెప్పారు. ఇలాంటి అసహ్యకరమైన భాషను బిధూరి మాట్లాడడం ఇదే మొదటిసారి కాదని ఆయన అన్నారు. ఆర్‌జెడి ఎంపి మనోజ్ ఝా విలేకరులతో మాట్లాడుతూ, మైనారిటీ ఎంపిపై పార్లమెంట్‌లో ఇటువంటి అసభ్యకర పదజాలాన్ని ఉపయోగించడం బిజెపి నైజాన్ని బయటపెడుతోందని అన్నారు. సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా మాట్లాడుతూ, బిధూరి వ్యాఖ్యలు ఏమాత్రం ఆమోదయోగ్యం కాదన్నారు.

ట్విట్టర్ ఇండియా అధిపతి రాజీనామా

న్యూఢిల్లీ : సోషల్ మీడియా దిగ్గజం ఎక్స్ (ట్విట్టర్) ఇండియా, సౌత్ ఏసియా పాలసీ హెడ్ సమీరన్ గుప్తా అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేశారు. పలు కోర్టు వివాదాలు, వచ్చే ఏడాది దేశంలో ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎక్స్‌లోని ఓ ప్రధాన బాధ్యుడు వైదొలగడం గమనార్హం. కంటెంట్ తొలగింపు విషయంలో ఎక్స్, కేంద్ర ప్రభుత్వం మధ్య న్యాయ వివాదాలు నెలకొన్నాయి. అనేకమార్లు కంటెంట్ తొలగించాలని ప్రభుత్వం ఒత్తిడి తెస్తున్నప్పటికీ ఎక్స్ తొలగించడం లేదన్నది ఆరోపణ. ఈ నేపథ్యంలో వచ్చే ఏడాది ఎన్నికలు వేళ కంటెంట్ విషయంలో మున్ముందు భారీ సవాళ్లు నెలకొన్న నేపథ్యంలో సమీరన్ వైదొలిగి ఉండొచ్చని నిపుణులు భావిస్తున్నారు.

అంగన్‌వాడీలపై ముందే నిర్బంధం

- మహాధర్నాకు వెళ్లవద్దంటూ నోటీసులు
- బస్సులను అడ్డుకుంటున్న పోలీసులు

ఒంగోలు, కృష్ణా జిల్లాలో అంగన్‌వాడీ సిబ్బందికి నోటీసు ఇస్తున్న పోలీసులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీలు తలపెట్టిన మహాధర్నాపై రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధ కాండకు దిగింది. ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు), ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి), ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) పిలుపు మేరకు సోమవారం ధర్నా జరగనుండగా శనివారం ఉదయం నుండే పోలీసులు నిర్బంధ చర్యలను ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు అన్ని జిల్లాల్లో మహాధర్నాకు రావద్దంటూ నోటీసులు ఇస్తున్నారు. అంగన్‌వాడీల ఇళ్ల వద్దకు పోలీసులు వెళ్లి నోటీసుల ఇవ్వడం స్థానికంగా చర్చనీయాంశమవుతోంది. మహాధర్నాకు అనుమతి లేదని, అందువల్ల విజయవాడకు వెళ్లకూడదని నోటీసుల్లో పేర్కొంటున్నారు. ధర్నాకు వెళ్తున్నారా, లేదా అన్న దానితో సంబంధం లేకుండా అంగన్‌వాడీలుగా పనిచేస్తున్న ప్రతి ఒక్కరికీ ఈ నోటీసులు ఇస్తున్నారు. అమలాపురం నుండి విజయవాడకు బస్సులో బయలుదేరడానికి ఏర్పాట్లు చేసుకుంటున్న అంగన్‌వాడీలను అడ్డుకున్నారు. బస్సును వెనక్కి పంపేశారు. ప్రైవేటు బస్సు ఆపరేటర్లకు కూడా వివిధ ప్రాంతాల్లో హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు తెలిసింది. విజయవాడలో విలేకరుల సమావేశం నిర్వహించిన డిసిపి విశాల్ గన్నీ ఎన్‌టిఆర్ జిల్లా మొత్తం 144వ సెక్షన్ అమలులో ఉందని, ఎటువంటి ధర్నాలకు, ర్యాలీలకు అనుమతి లేదని చెప్పారు. బయట ప్రాంతాల వారు విజయవాడకు వచ్చి అల్లర్లు సృష్టించడానికి ప్రణాళిక వేసినట్లు తమ వద్ద సమాచారం ఉందని, అందువల్ల కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడమని అన్నారు. మరోవైపు ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు), ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి), ఎపి ప్రగతిశీల అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (ఐఎఫ్‌టియు) నాయకులు శనివారం విజయవాడలో విలేకరులతో మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఆయా సంఘాల నాయకులు కె సుబ్బరావమ్మ, బేబీరాణి, జె లలిత, కె దుర్గ మాట్లాడుతూ అంగన్‌వాడీను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లతో పాటు ఇతర సమస్యల పరిష్కారం కోసం సోమవారం మిగతా 6లో

కస్టడీ సవాల్ పిటిషన్‌పై అత్యవసర విచారణకు నో

ప్రజాశక్తి-అమరావతి

సిల్ డెవలప్‌మెంట్ స్కాం కేసులో తనను ఈ నెల 23, 24 తేదీల్లో సిఐడి విచారణ చేసేందుకు విజయవాడ ఎసిబి కోర్టు ఇచ్చిన పోలీస్ కస్టడీ అనుమతి ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ సిఎం నారా చంద్రబాబు నాయుడు హైకోర్టును ఆశ్రయించారు. పిటిషన్‌ను అత్యవసరంగా విచారణ చేపట్టాలన్న ఆయన అభ్యర్థనను హైకోర్టు తోసిపుచ్చింది. రెగ్యులర్ విధానంలోనే విచారణ చేపడతామని న్యాయమూర్తి జస్టిస్ కె సురేష్‌రెడ్డి శనివారం ప్రకటించారు. పిటిషన్‌ను విచారణ చేయాలని న్యాయవాది ఎస్ ప్రణతి కోరగా.. అందుకు న్యాయమూర్తి నిరాకరించారు.

గత ప్రభుత్వ నిర్ణయాలపై సిట్ దర్యాప్తు

- కేంద్రానికి హైకోర్టు నోటీసులు

ప్రజాశక్తి-అమరావతి

గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాల్ని పునఃసమీక్ష చేసే వ్యవహారంపై ప్రభుత్వం మంత్రివర్గ ఉప సంఘం, సిట్‌ను ఏర్పాటు చేయడాన్ని సవాల్ చేస్తూ తెలుగుదేశం పార్టీ నేతలు గతంలో దాఖలు చేసిన వ్యాజ్యాన్ని శనివారం హైకోర్టు విచారణ చేపట్టింది. కేంద్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని నోటీసులు జారీ చేసింది. విచారణను అక్టోబరు 20కు వాయిదా వేస్తూ జస్టిస్ గన్నమనేని రామకృష్ణ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. కౌంటర్ దాఖలు చేసేందుకు మూడు వారాల గడువు కావాలని కేంద్ర ప్రభుత్వం కోరింది. అడ్వకేట్ జనరల్ ఎస్ శ్రీరామ్ కల్పించుకుని, సిట్ పరిధిలోనే స్కిల్ డెవలప్‌మెంట్ స్కాం కేసు కూడా ఉందని, ఈ వ్యవహారాన్ని సిబిఐ దర్యాప్తునకు ఇవ్వాలని హైకోర్టులో పిల్ దాఖలైందని గుర్తు చేశారు. ఇది విచారణ జరిగిన తర్వాత ఈ పిల్‌లోనూ కేంద్ర ప్రభుత్వ వైఖరి స్పష్టం చేయాల్సి వుంటుందని చెప్పారు. తమ ముందున్న కేసులో కేంద్రం కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని, దానిపై పిటిషనర్లు రిప్లై కౌంటర్ కూడా దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

త్వరలో డిఇఒల బదిలీ !

- కొంత మందికి ప్రమోషన్లు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

త్వరలో జిల్లా విద్యాశాఖ అధికారుల (డిఇఒ) బదిలీలు జరగనున్నాయి. ఇందుకు సంబంధించిన ఫైల్ ప్రస్తుతం విద్యాశాఖ మంత్రి కార్యాలయంలో ఉంది. డిఇఒల బదిలీలకు సంబంధించిన ఉత్తర్వులు వారంలోపు విడుదలయ్యే అవకాశం ఉందని పాఠశాల విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు. ఎవరిని ఏ జిల్లాకు పంపించాలనే అంశంపై చర్చ జరుగుతోంది. అయితే వీరిలో కొంతమందికి ప్రాంతీయ సంయుక్త సంచాలకులు (ఆర్‌జెడి)గా ఉద్యోగోన్నతులు రానున్నాయి. అదేవిధంగా డిప్యూటీ డిఇఒలుగా ఉన్న కొంత మందికి డిఇఒలుగా ఉద్యోగోన్నతి రానుంది.

సభ్యుల సమాధానంపైనా కోతలే

- గిరిజనశాఖ ఖర్చులపై ప్రభుత్వ దాటవేత ధోరణి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

గిరిజన సంక్షేమశాఖపై శాసన సభ్యులు అడిగిన ప్రశ్నలకు జగన్ ప్రభుత్వం దాటవేత ధోరణితో వ్యవహరించింది. గిరిజన సంక్షేమశాఖలో ఏ కార్యక్రమానికి ఎంత ఖర్చు చేసిందో అనే వివరాలు కూడా సభ్యులు అందజేయలేదు. గిరిజన సంక్షేమం కోసం పథకాల బలోపేతానికి, అమలుకు ప్రభుత్వం తీసుకున్న చర్యలు తెలపాలని, 2019 నుంచి గిరిజన సంక్షేమం, అభివృద్ధి కోసం చేసిన ఖర్చుల వివరాలు, 2014 నుంచి 2019 కాలానికి ఖర్చుల వివరాలు తెలపాలని శాసనసభ సమావేశాల్లో శాసనసభ్యులు తెల్లం బాలరాజు, విశ్వసరాయి కళావతి, చెట్టి పాల్గుణ, కొత్తగుళ్లి భాగ్యలక్ష్మి అడగ్గా ప్రభుత్వం ఏయే పథకాలకు ఎంత ఖర్చు చేశారో అనేది లేకుండా సమాధానం దాటవేసింది. నవరత్నాలు పథకంలో భాగంగా గిరిజన సంక్షేమం చేపట్టినట్లుగా ప్రభుత్వం ప్రకటించినప్పటికీ.. గిరిజనుల కోసం ప్రత్యేకమైన బడ్జెట్ కేటాయించలేదు. జగనన్న అమ్మఒడి, జగనన్న వసతి దీవెన, జగనన్న విద్యా దీవెన, జగనన్న విదేశీ విద్యా, వైఎస్‌ఆర్ రైతు భరోసా, సున్నా వడ్డీ పంట రుణాలు, ఉచిత పంటల బీమా, నేతన్న నేస్తం, వాహన మిత్ర, జగనన్న తోడు వంటి పలు పథకాలు గిరిజన ఖాతాలోకి నెట్టేసింది. గిరిజన సంక్షేమం కోసం 2019 నుంచి ఇప్పటి వరకు రూ.20,169 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. 2014 నుంచి 2019 నాటికి గిరిజన సంక్షేమం కోసం రూ.5,779.21 కోట్లు ఖర్చు చేసినట్లు ప్రభుత్వం సమాధానం ఇచ్చింది.

విశాఖ ఉక్కులోకి జిందాల్ !

• బిఎఫ్ 3ని అడ్డం పెట్టుకుని స్టీల్‌ప్లాంట్‌లో ప్రవేశానికి కుట్ర • సహకరిస్తున్న ఉక్కు యాజమాన్యం?

ప్రజాశక్తి- గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను సమస్యల చక్రబంధంలోకి నెట్టేసే చర్యలను అటు కేంద్రంలోని బిజెపి తీవ్రతరం చేస్తుంటే, తానా తందానా అంటూ స్టీల్ యాజమాన్యం కూడా సహకారం అందిస్తోంది. తాజాగా జెఎస్‌డబ్ల్యు (జిందాల్) కంపెనీ యాజమాన్య ప్రతినిధులను ప్లాంట్‌లో ఓ ఉన్నతాధికారి ప్లాంట్‌కు చెందిన కారులో తిప్పడం వెలుగు చూసింది. విదేశాల్లో కొకింగ్ కోల్‌ను స్టీల్‌ప్లాంట్ కొనుక్కోగా మొన్నటి వరకూ అదానీ గంగవరం పోర్టు యాజమాన్యం తన పోర్టులో అడ్డుకుంది. కార్మికుల పోరాటంతో ఆ తరువాత వెనక్కు తగ్గింది. తాజాగా ఐరన్ ఓర్ విషయంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎన్‌ఎండిసి నాటకాలకు తెరతీసింది. వాస్తవానికి ఎన్‌ఎండిసికి స్టీల్‌ప్లాంట్ రూ.3 వేల కోట్లు అప్పు ఉండగా, రూ.2,500 కోట్లు తీర్చేసింది. అయినప్పటికీ క్వాలిటీ ఐరన్ ఓర్‌ను స్టీల్‌ప్లాంట్‌కు ఇవ్వకుండా ఎన్‌ఎండిసి కొత్త డ్రామాకు తెరతీసింది. సిఐటియు, కార్మికులు ప్రశ్నించగా కిరండోల్ వెళ్లి తెచ్చుకోవాలని చెప్పింది. కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ కూడా కలుగజేసుకోకుండా పబ్బం గడుపుతోంది.

ఇఒఐలో 29 సంస్థలు వచ్చినా జిందాల్‌కే మొగ్గు!

ఇటీవల స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం నిర్వహించిన ఇఒఐ (ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంటరెస్ట్)లో 29 సంస్థలు ఐరన్ ఓర్, కోల్, ఇతర రామెటీరియల్ కోసం బిడ్లను దాఖలు చేయగా, జిందాల్ యాజమాన్యాన్ని స్టీల్ యాజమాన్యం నెత్తినెత్తుకోవడం వెనుక రహస్యమేమిటని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కో-కన్వీనర్ జె.అయోధ్యరామ్ ప్రశ్నిస్తున్నారు. హిల్‌టాప్ గెస్ట్‌హౌస్‌లో జిందాల్ ఎమ్‌డి విమలేంద్ర జాగర్‌ను పెట్టుకుని యాజమాన్యం ఏం మంతనాలు జరిపిందో బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ప్లాంట్‌ను ఏం చేయబోతుందో యాజమాన్యం చెప్పాలని ప్రశ్నించారు.

బ్లాస్ట్ ఫర్నేస్ 3ని అప్పగించే వ్యూహం

బ్లాస్ట్ ఫర్నేస్‌ను జెఎస్‌డబ్ల్యుకు అప్పగించే కుట్ర స్పష్టంగా కనిపిస్తోంది. ఇంతవరకూ ప్లాంట్‌ను లెక్కకట్టేందుకు వచ్చిన వేల్యూయేటర్లను, లీగల్, ఇతర అడ్వైజర్లను కార్మికులు అడ్డుకున్న విషయం తెలిసిందే. ప్లాంట్‌లోకి వారెవరినీ అడుగుపెట్టనివ్వలేదు. తాజాగా బ్లాస్ట్ ఫర్నేస్-3లోకి జిందాల్‌ను దింపేందుకు ఉన్నతస్థాయి సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. పైగా బ్లాస్ట్ ఫర్నేస్‌కు ఆక్సిజన్, ఐరన్ ఓర్‌ను జిందాల్ సమకూర్చడం ద్వారా రెండు లక్షల టన్నుల స్టీల్ ఉత్పత్తి అయితే దానిలో 90 వేల టన్నులు తమకు ఇచ్చేయాలనే షరతు విధించినట్టు వార్తలు వస్తున్నాయి. దీంతో, కార్మికులు మండిపడుతున్నారు. బ్లాస్ట్ ఫర్నేస్‌కు అవసరమైన ఐరన్ ఓర్, కోల్‌ను జిందాల్ ఇస్తే సరిపోదని, మాంగనీస్, లైమ్‌స్టోన్, డోలమైట్, కార్మికుల శ్రమ.. ఇలా అన్నీ ఉండాలని వారు గుర్తుచేస్తున్నారు. ఐరన్‌ఓర్, కోల్ వేసేస్తే ఉత్పత్తి జరిగిపోదని అయోధ్యరామ్ వ్యాఖ్యానించారు.

ఇచ్ఛాపురంలో లోకనాథం తదితరులు

ఉక్కు ప్రయివేటీకరణపై మోడీని నిలదీయండి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు లోకనాథం

ప్రజాశక్తి-యంత్రాంగం

విశాఖ ఉక్కును ప్రయివేటీకరిస్తుంటే వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు మోడీని ఎందుకు ప్రశ్నించడంలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె లోకనాథం అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం సిపిఎం చేపట్టిన ఉక్కు రక్షణ బైక్ యాత్ర శ్రీకాకుళం జిల్లాలో మూడో రోజు ఇచ్ఛాపురం, సోంపేట, కంచిలి, మందస, పాతట్నం, కొత్తూరు ప్రాంతాల మీదుగా సాగింది. ఈ సందర్భంగా ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన సభల్లో లోకనాథం మాట్లాడుతూ విశాఖ ఉక్కు ప్రజల ఆస్తి అని అన్నారు. లక్షల కోట్ల ప్రజల సంపదను కారు చౌకగా అదానీ, అంబానీలకు కట్టబెడుతుంటే రాష్ట్రంలోని అధికార, ప్రతిపక్ష పార్టీలు నోరెత్తకపోవడం సరికాదన్నారు. ఉక్కు ప్రయివేటీకరణపై మోడీని నిలదీయాలన్నారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం సిపిఎం సాగిస్తోన్న పోరాటానికి ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. సోంపేటలో పర్యావరణ పరిరక్షణ సమితి అధ్యక్షులు వై కృష్ణమూర్తి, కంచిలిలో వైసిపి నాయకులు ఇప్పిలి కృష్ణారావు బైక్ యాత్రకు సంఘీభావం తెలిపారు. మందసలో వీరగున్నమ్మ స్థూపానికి నేతలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కొత్తూరులో డప్పు కళాకారులు డప్పు వాయిద్యాలతో యాత్రకు ఆహ్వానం పలికి పూల జల్లు కురిపించారు. కొత్తూరు నుంచి బైక్ యాత్ర పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట మీదుగా పాలకొండకు చేరుకుంది. సీతంపేటలో అల్లూరి సీతారామరాజు విగ్రహానికి లోకనాథంతోపాటు శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లాల కార్యదర్శులు గోవిందరావు, రెడ్డి వేణు పూలమాలు వేసి నివాళులర్పించారు. అనంతరం పాలకొండలో జరిగిన సభలో లోకనాథం మాట్లాడుతూ ప్రపంచంలోనే అగ్రగామిగా స్టీల్‌ను ఉత్పత్తి చేసే సంస్థగా విశాఖ ఉక్కు పరిశ్రమ ఉందని తెలిపారు. అలాంటి ఫ్యాక్టరీని కేంద్ర ప్రభుత్వం ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టేందుకు కుట్రపన్నుతోందన్నారు. స్టీల్ ప్లాంట్‌ను రక్షించుకోవడానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి జగన్, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి డి గోవిందరావు, పార్వతీపురం మన్యం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం.తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంకా సంప్రదింపుల దశలోనే 'దిశ'

- 2019 నుంచి లభించని కేంద్ర ఆమోదం
- మూడేళ్లలో 52,587 కేసులు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

మహిళలపై దాడుల నివారణ, కఠిన శిక్షల అమలు కోసం 2019లో అసెంబ్లీ ఆమోదించిన దిశ చట్టం నాలుగేళ్ల అనంతరం అమలుకు నోచలేదు. ఇప్పటికీ సంప్రదింపుల దశలోనే ఉంది. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా సభ్యులు అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం అసలు విషయాన్ని వెల్లడించింది. హైదరాబాద్‌లో మహిళపై అత్యాచారం జరిగిన అనంతరం రాష్ట్రంలో అటువంటి ఘటనలను నివారించాలనే ఉద్దేశంతో 2019లో ప్రభుత్వం దిశ చట్టాన్ని తీసుకొచ్చింది. దీనికోసం ఆంధ్రప్రదేశ్ దిశ చట్టం క్రిమినల్ లా (ఆంధ్రప్రదేశ్ సవరణ) చట్టం-2019 పేరుతో అసెంబ్లీలో బిల్లు నెంబర్లు 46, 47 ద్వారా చట్టాన్ని తీసుకొచ్చింది. అలాగే 2020లో బిల్లు నెంబరు 31 ద్వారా ఆంధ్రప్రదేశ్ స్త్రీలు, బాలికలపై ప్రత్యేక నేరాల విచారణ కోసం ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక కోర్టుల చట్టాన్ని కూడా తీసుకొచ్చారు. దీని ద్వారా నేరం చేసిన వ్యక్తులకు నెలరోజుల్లోపే విచారణ పూర్తి చేసి మూడు నెలల్లోపు శిక్షపడేలా చూడాలనేది ప్రభుత్వ ఉద్దేశంగా ఉంది. ఈ చట్టాలకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 254(2) ప్రకారం రాష్ట్రపతి ఆమోదముద్ర కావాల్సి ఉంది. 2019లో ఈ బిల్లులను కేంద్రానికి పంపినా నాలుగేళ్ల తరువాత కూడా ఇప్పటికీ అమలుకు నోచలేదు. అయితే రాష్ట్ర ప్రభుత్వం దిశ చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నామని, త్వరితగతిన విచారణ చేస్తున్నామని ప్రకటించింది. దీనిపై రాజకీయంగా అనేక విమర్శలు కూడా వ్యక్తమయ్యాయి. అసలు దిశ చట్టానికి చట్టబద్ధత లేదని గతంలో ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీ నాయకులు విమర్శించారు. అయితే నిరంతరం కేంద్ర హోంమంత్రిత్వశాఖతో సంప్రదింపులు జరుపుతున్నామని, అనుమతి వస్తుందని రాష్ట్రం చెబుతోంది. అయితే బిల్లును 2019లో ఆమోదించినా దీనికి అతికొద్దిముందుగా జరిగిన నేరాలతో కలిపి ఆ ఒక్క సంవత్సరం 17,746 కేసులు నమోదయ్యాయి, 2020లో 17,089 కేసులు, 2021లో 17,752 ఘటనలు నమోదయ్యాయని ప్రభుత్వం అసెంబ్లీలో సమాధానం ఇచ్చింది. ఇందులో 2022వ సంవత్సరం ఘటనలను నమోదు చేయలేదు. రాష్ట్రంలో అనేక ఘటనలు జరిగిన సమయంలో దిశ చట్టం కింద కేసులు నమోదు చేశామని చెబుతూ వస్తోంది. మూడేళ్ల నుండి ఇదే మాట చెబుతోంది. ఇప్పుడు ఇంకా అనుమతి రాలేదని చెబుతోంది. ఇదెలా సాధ్యమనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అనుమతిలేని చట్టం కింద కేసులు నమోదు చేయడం, దాన్ని అమలు చేస్తున్నామని బయట ప్రకటనలు ఇవ్వడం ఎంత వరకు చట్టబద్ధత ఉందనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

వెనకబడిన ప్రాంతాల ప్రాజెక్టులపై నిర్లక్ష్యం

- ఇప్పటికీ సగం నిధులే ఖర్చు
- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం పట్ల కృషి చేస్తున్నట్లు చెప్పుకోవడం తగదని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వి కృష్ణయ్య, కె ప్రభాకరరెడ్డి విమర్శించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. మంత్రి అంబటి రాంబాబు సాగునీటి రంగానికి బడ్జెట్లో రూ.61,573.15 కోట్లు కేటాయించి అందులో రూ.32,059.61 కోట్లు అంటే 52 శాతం నిధులు ఖర్చు చేసినట్లు శాసనసభకు చెప్పిన మాటల్లో వాస్తవం లేదని అన్నారు. గత ఐదేళ్లలో సాగునీటి రంగానికి కేటాయింపులే తక్కువని, వాటిల్లోనూ 52 శాతం మాత్రమే ఖర్చు చేసిన ఈ ప్రభుత్వానికి వెనకబడిన ప్రాంతాల అభివృద్ధి పట్ల ఏమాత్రమూ చిత్తశుద్ధి లేదని తెలిపారు. జలవనరుల శాఖ మంత్రి సొంత జిల్లాలో రూ.1,200 కోట్లు ఖర్చు పెడితే లక్ష ఎకరాలకు నీరు అందిచగలిగిన వరికెపూడిసెల ఎత్తిపోతల పథకానికి కూడా నిధులు కేటాయించలేదని విమర్శించారు. గుంటూరు ఛానల్‌ను పొడిగించేందుకు నిధులు కేటాయించలేదని, బాపట్ల జిల్లాలో కొరిశెపాడు పోలారెడ్డి ఎత్తిపోతల పథకానికి రూ.200 కోట్లు కేటాయించి పనులు పూర్తి చేస్తే 20 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వొచ్చని, కానీ పనులు నిలిపేశారని తెలిపారు. రాయలసీమ ఎత్తిపోతల పథకం గురించి గొప్పలు చెప్పే ప్రభుత్వం ప్రచారానికి ఇచ్చిన ప్రాధాన్యత ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ఇవ్వడం లేదని విమర్శించారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో అన్నమయ్య ప్రాజెక్టు వరదలకు కొట్టుకుపోయి మూడేళ్లు అవుతున్నా మరమ్మతులు చేపట్టలేదని, వెయ్యి కోట్లు ఖర్చు పెడితే పూర్తయ్యే వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందని వివరించారు. రాయలసీమ జీవనాడులైన హంద్రీనీవా, గాలేరు నగరి ప్రాజెక్టులు, కర్నూలు జిల్లాలో వేదవతి నదిపై ఎత్తిపోతల ద్వారా చేపట్టిన రిజర్వాయర్ల నిర్మాణం, ఆర్‌డిఎస్ కుడికాలువ నిర్మాణం పునాదులు కూడా దాటలేదని తెలిపారు. వెనకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాల సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం ముందుకు పోవడం లేదన్నారు. కనీసం ఈ సంవత్సరం కేటాయించిన నిధులైనా పూర్తిగా ఖర్చుచేసి చిత్తశుద్ధిని రుజువు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.

ఉచిత పంటల బీమాపై మంత్రి కాకాని కబుర్లు

రాష్ట్రంలో వ్యవసాయ పంటల బీమా అమలుకు సంబంధించి ఉచిత పంటల బీమా కోసం ఇన్సూరెన్స్ కంపెనీని ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధనరెడ్డి శాసనమండలిలో చేసిన ప్రకటన ఒట్టి కాకమ్మ కబుర్లు తప్ప రైతులకు ఎలాంటి ప్రయోజనమూ కలిగించేలా లేదని మరో ప్రకటనలో కృష్ణయ్య, ప్రభాకరరెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిఒ 117 ద్వారా 2020 నుంచి సొంత ఇన్సూరెన్స్ కంపెనీని ప్రారంభిస్తున్నట్లు, దానికి రూ.101 కోట్లు విడుదల చేస్తున్నట్లు ప్రకటించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా వ్యవసాయ ఇన్సూరెన్స్ కంపెనీ పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అభ్యంతరం చెప్పిందని పేర్కొన్నారు. వ్యవసాయ ఇన్సూరెన్స్ కంపెనీ పెడితే తమ వాటాగా ఇచ్చే నిధులను ఇవ్వబోమని మొండికేయడంతో రాష్ట్ర ప్రభుత్వం సొంత ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతిపాదనను విరమించుకుందని వివరించారు. అందులో భాగంగానే 2022-23వ సంవత్సరం పంటల బీమా అమలులో రైతులకు నష్టం కలిగేలా ప్రధాన మంత్రి ఫసల్ బీమాను అమలు చేశారని తెలిపారు. ఫలితంగా రైతాంగం పంటల బీమా కింద రూ.1,117 కోట్లు మాత్రమే పరిహారం పొందారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సొంతంగా పంటల బీమా అమలు చేసిన 2020-21వ సంవత్సరంలో రూ.1,739 కోట్లు, 2021-22లో రూ.2,977 కోట్లు పరిహారం రాగా, 2022-23లో రూ.1,117 కోట్లు మాత్రమే పరిహారం రైతులకు దక్కిందని వివరించారు. మళ్లీ ఇప్పుడు వ్యవసాయశాఖ మంత్రి సొంతంగా ఇన్సూరెన్స్ కంపెనీ కబుర్లు చెప్పడం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేయడం చేతగాని కాకమ్మ కబుర్లుగా వర్ణించారు. దీనివల్ల రైతులకు ఎలాంటి ప్రయోజనమూ ఉండదని వివరించారు. నిజంగా ఈ ప్రభుత్వానికి రైతుల పంటల బీమా పట్ల చిత్తశుద్ధి ఉంటే సీరియస్‌గా బీమా కంపెనీ ఏర్పాటుకు కృషి చేయాలని వారు కోరారు.

చంద్రబాబు అరెస్టుపై కెసిఆర్ స్పందించాలి

- బిఆర్‌ఎస్ నేత మోత్కుపల్లి నర్సింహులు

ప్రజాశక్తి- హైదరాబాద్ బ్యూరో

టిడిపి అధ్యక్షుడు చంద్రబాబు అరెస్టుపై ముఖ్యమంత్రి కెసిఆర్ స్పందించాలని మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ నేత మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. రాజకీయాలు పక్కనపెట్టి కెసిఆర్ స్పందిస్తే ప్రజాస్వామ్యానికి మంచిదని పేర్కొన్నారు. శనివారం ఆయన హైదరాబాద్‌లో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబును అరెస్టు చేసినందుకు సిఎం జగన్‌కి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని అన్నారు. జైలులో చంద్రబాబుకు ఏదైనా జరిగితే జగన్‌దే బాధ్యతని తెలిపారు. జగన్‌ను నమ్మి ఆంధ్రప్రదేశ్ ప్రజలు పూర్తిగా మోసపోయారని, దళితులపై ఇన్ని ఘోరాలు గతంలో ఎప్పుడూ జరగలేదని అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ఎన్‌టిఆర్ ఘాట్‌లో ఆదివారం నిరసన దీక్ష చేపడతానని మోత్కుపల్లి ప్రకటించారు.

పంట రుణాల కోసం 27, 28 తేదీల్లో ధర్నాలు

- ఎపి కౌలురైతు సంఘం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కౌలు రైతుల పంట రుణాల కోసం ఈ నెల 27, 28 తేదీల్లో లీడ్ బ్యాంకుల వద్ద చేపట్టనున్న ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఎపి కౌలురైతు సంఘం ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు శనివారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వై రాధాకృష్ణ, ఎం హరిబాబు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కౌలురైతులకు రూ.4 వేలకోట్లు పంటరుణాలిస్తామని ప్రకటించిందని, ఖరీఫ్ సీజన్ పూర్తి కావస్తున్నా.. కౌలురైతుల రుణాలు రూ.700 కోట్లు కూడా ఇవ్వలేదన్నారు. గతంలో రుణాలు తీసుకుని సకాలంలో చెల్లించిన రైతులకు తిరిగి రుణాలు ఇవ్వడానికి బ్యాంకులు అభ్యంతరం పెడుతున్నాయని, కౌలు కార్డు ఉన్నా.. మళ్లీ భూ యజమాని సంతకాలు కావాలని, ఆధార్ కావాలని అడుగుతున్నారని తెలిపారు. భూ యజమానికి పంటతో సంబంధం లేకుండా ముందుగానే రుణాలిచ్చి భూ యజమాని రుణాలు తీసుకుంటున్నారని, దీంతో డబుల్ ఫైనాన్స్ అవుతుందని కౌలురైతులకు పంట రుణాలివ్వడం సాధ్యం కాదని బ్యాంకర్లు తిరస్కరిస్తున్నారన్నారు. ఆలయ భూముల సాగు రైతులందరికీ పంట రుణాలివ్వడానికి ఎలాంటి ఆటంకాలు లేకపోయినా వారికీ పంట రుణాలివ్వడం లేదని పేర్కొన్నారు. కౌలు రైతుల పంట రుణ మేళాలను నిర్వహించాలని, మండల స్థాయిలో రెవెన్యూ, వ్యవసాయశాఖ, బ్యాంకు అధికారులు, రైతు సంఘాల ప్రతినిధులతో ఉమ్మడి సమావేశాలు నిర్వహించి కౌలు రైతులందరికీ పంట రుణాలిచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు విజయవాడ- చెన్నై వందేభారత్ ప్రారంభం

- మరో ఎనిమిదింటికి వర్చువల్ విధానంలో జెండా ఊపనున్న మోడీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మూడో వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్‌ను నేడు (24వ తేది) ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రారంభించనున్నారు. దీనితో పాటు మరో ఎనిమిది రైళ్లకు కూడా వర్చువల్ పద్ధతిలో జెండాఊపనున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్‌తో పాటు, ముఖ్యమంత్రి కూడా పాల్గొననున్నారు. 25వ తేది (సోమవారం) నుండి ఈ రైలు ప్రజలకు అందుబాటులోకి రానుంది. ఈ రైలు తెనాలి, ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట స్టేషన్లలో మాత్రమే నిలుస్తుంది. విజయవాడ - చెన్నై మధ్య ప్రయాణ సమయం 6.40 గంటలుగా రైల్వేవర్గాలు తెలిపాయి. వారంలో ఆరు రోజులు ప్రయాణీకులకు ఈ రైలు అందుబాటులో ఉంటుంది. మంగళవారం నాడు నడవదు. ఈ రైలులో 8 కోచ్‌లు (7 ఎసి చైర్ కోచ్‌లు , 1 ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ కోచ్) ఉంటాయి. 530 మంది ప్రయాణీకులు ప్రయాణించవచ్చు. ఐఆర్‌సిటిసి వెబ్‌సైట్ ద్వారా లేదా రిజర్వేషన్ కౌంటర్ల వద్ద టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చు. ఎమ్‌జిఆర్ చెన్నై సెంట్రల్ నుంచి విజయవాడకు (రైలు నెంబరు 20677) ప్రతి రోజు ఉదయం 5.30 గంటలకు ఈ రైలు బయలుదేరుతుంది. రేణిగుంట జంక్షన్ ఉదయం 7.05/7.10 గంటలుకు చేరుతుంది. 8.39/8.40 గంటల మధ్యలో నెల్లూరు, 10.09/10.10కి ఒంగోలు, 11.21/11.22గంటలకు తెనాలి జంక్షన్, మధ్యాహ్నం12.10 గంటలకు విజయవాడకు వందేభారత్ ట్రైన్ చేరుకుంటుంది. విజయవాడ రైల్వే జంక్షన్ నుంచి మధ్యాహ్నం 3.20 గంటలకు ట్రైన్ నెంబరు (20678) బయలుదేరుతుంది. రాత్రి 10 గంటలకు చెన్నై సెంట్రల్‌కు వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ట్రైన్ చేరుకుంటుంది.

టిక్కెట్ ధరలు ఇలా:

విజయవాడ నుంచి ఎమ్‌జిఆర్ చెన్నై సెంట్రల్‌కు క్యాటరింగ్ చార్జీతో సహా ఎసి చైర్ కార్ చార్జీ రూ.1420లు కాగా ఎగ్జిక్యూటివ్ క్లాస్ ధర రూ.2,630లు. చెన్నై సెంట్రల్ నుంచి విజయవాడకు క్యాటరింగ్ చార్జీతో సహా ఎసి చైర్ కార్ చార్జీ రూ.1320లు, ఎగ్జిక్యూటివ్ తరగతి ధర రూ.2540లుగా రైల్వే శాఖ నిర్ణయించింది. విజయవాడ నుంచి చైన్నై సెంట్రల్‌కు క్యాటరింగ్ చార్జీని మినహాయిస్తే ఎసిచైర్‌కార్‌చార్జీరూ.1135లుగా, ఎగ్జిక్యూటివ్ క్లాస్ ధర రూ.2280లుగా రైల్వే శాఖ ప్రకటించింది. చెన్నై సెంట్రల్ నుంచి విజయవాడకు క్యాటరింగ్ చార్జీని మినహాయిస్తే ఎసిచైర్ కార్ చార్జీ రూ.1135లు, ఎగ్జిక్యూటివ్ క్లాస్ ధర రూ.2280గా పేర్కొన్నారు.

కాచిగూడ- యశ్వంతపూర్ మధ్య

కాచిగూడ - యశ్వంతపూర్ మధ్య ప్రారంభం కానున్న మరో వందేభారత్ రైలు కూడా రాష్ట్రం మీదుగా ప్రయాణం చేస్తుంది.

ఈ రైలు రాష్ట్రంలో కర్నూలు సిటీ, అనంతపురం, ధర్మవరం జంక్షన్‌లలో ఆగుతుంది. ఉదయం 5.30 కు కాచిగూడలో బయలుదేరే ఈ రైలు కర్నూలు సిటీకి ఉదయం 8.24గంటలకు, అనంతపురానికి 10.44, ధర్మవరం జంక్షన్‌కు 11.14కు, యశ్వంత్‌పూర్‌కు మధ్యాహ్నం 2 గంటలకు చేరకుంటుంది. తిరుగు ప్రయాణంలో మధ్యాహ్నం 2.45 గంటలకు యశ్వంత్‌పూర్‌లో ప్రారంభమై ధర్మవరం జంక్షన్ (4.59) అనంతపురం (5.29) కర్నూలు (రాత్రి 7.50) కాచిగూడ(రాత్రి 11.45)కు చేరుకుంటుంది.

ఒపిఎస్, సిపిఎస్ ముగిసిన అధ్యాయాలు

- రాష్ట్రంలో ఖాళీగా ఉన్నవి 8,366 టీచర్ పోస్టులే
- విద్యాశాఖమంత్రి బొత్స సత్యనారాయణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాత పెన్షన్ విధానం(ఒపిఎస్),కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం(సిపిఎస్) రెండూ ముగిసిపోయిన అధ్యాయాలు అని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. ఇప్పుడు ఉన్నది గ్యారంటీ పెన్షన్ స్కీం(జిపిఎస్) మాత్రమే అని చెప్పారు. విజయవాడలోనిక్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఒపిఎస్ అమలుకు కేంద్రం కూడా ఒప్పుకోవడం లేదన్నారు. మధ్యస్తంగా జిపిఎస్ రూపొందించామని తెలిపారు. తమకు అవకాశం ఉన్నంత వరకు ఉద్యోగులకు మేలు జరిగేలా చూశామన్నారు. కొన్ని రాష్ట్రాల్లో ఒపిఎస్ అమలు చేసేందుకు అంగీకరిస్తున్న కేంద్రప్రభుత్వం రాష్ట్రంలో మాత్రం ఎందుకు ఒప్పుకోవడం లేదో బిజెపి నాయకులను అడగాలని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. రాష్ట్రంలో 8366 పోస్టులే ఖాళీగా ఉన్నాయని అన్నారు.

డిఎస్సి నోటిఫికేషన్ విడుదలపై అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. . 8,9,10వ తరగతుల్లో మ్యాథ్స్, సైన్స్ పాఠ్యాంశ పుస్తకాల మార్పుపై ఆలోచన చేస్తున్నామని చెప్పారు. పదో తరగతి ఫలితాల్లో టాపర్స్‌గా నిలిచిన ప్రభుత్వ విద్యార్థులు ఐక్యరాజ్యసమితికి వెళ్లడం జరిగిందని, ఇది రాష్ట్రానికే గర్వకారణమని అన్నారు. స్కిల్ స్కామ్‌ను ప్రస్తావిస్తూ టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు దొరికిన దొంగ అని అన్నారు.చంద్రబాబు అరెస్టుపై తెలంగాణ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి మాటలను ఖండిస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు తప్పు చేయలేదని అనుకుంటే తెలంగాణ సిఎంతో మాట్లాడాలని సూచించారు. స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంలో అధికారుల ప్రమేయం, బాధ్యులై ఉంటే వారిపై కూడా చర్యలు ఉంటాయని చెప్పారు. ఉనికి చాటుకోవడం కోసమే బిజెపి అధ్యక్షురాలు పురంధేశ్వరి మాట్లాడుతున్నారని అన్నారు.

విద్యుదాఘాతంతో ముగ్గురి మృతి

ప్రజాశక్తి - గండేపల్లి

సూరిబాబు, నాగేశ్వరరావు, బాబీ (ఫైల్)

పామాయిల్ తోటలో బోరు మరమ్మత్తు చేస్తుండగా 11 కెవి విద్యుత్ వైర్ తగిలి ముగ్గురు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన కాకినాడ జిల్లా గండేపల్లిలో శనివారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. జగ్గంపేట మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన గళ్ల నాగరాజుకు గండేపల్లి మండలం ఉప్పలపాడులో పామాయిల్ తోట ఉంది. ఆ తోటలో బోరు మరమ్మతు చేసేందుకు కిర్లంపూడి మండలం బూరుగుపూడికి చెందిన బొదిరెడ్డి సూరిబాబు (45), జగ్గంపేటకు చెందిన కిల్లి నాగేశ్వరరావు (45) వెళ్లారు. నాగరాజు మనవడు గళ్ల బాబీ (25)తో కలిసి ఐరన్ గొట్టాలు పైకి ఎత్తే క్రమంలో పైన ఉన్న 11 కెవి విద్యుత్ వైర్లు తగలడంతో ముగ్గురూ విద్యాదాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించారు. కిల్లి నాగేశ్వరరావుకు భార్య ఇద్దరు పిల్లలు, బొదిరెడ్డి సూరిబాబుకు భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. గళ్ల బాబీ అవివాహితుడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను పెద్దాపురం తరలించారు.

విద్యార్థులను జాతీయ క్రీడాకారులుగా తీర్చిదిద్దాలి

- పాఠశాల విద్య కమిషనరు సురేష్‌కుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను జాతీయస్థాయి క్రీడాకారులుగా తీర్చిదిద్దాలని పాఠశాల విద్యాశాఖ కమిషనరు, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అధ్యక్షులు ఎస్ సురేష్‌కుమార్ అన్నారు. ప్రతి పాఠశాల నుంచి కనీసం ప్రతిభ గల ఇద్దరు విద్యార్థులను గుర్తించాలని చెప్పారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల స్కూల్ గేమ్స్ సెక్రటరీలతో వర్క్‌షాపుతోపాటు కార్యవర్గ సమావేశాన్ని శనివారం సమగ్ర శిక్షా కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లాడుతూ.. పాఠశాలలకు క్రీడా సామగ్రి అందిస్తున్నామని తెలిపారు. ప్రతినెలా నిర్వహించే స్కూల్ కాంప్లెక్సులో క్రీడా సామగ్రి వినియోగంపై అవగాహన కల్పించాలని చెప్పారు. స్కూల్ కాంప్లెక్సు పరిధిలో పిఇటిలు లేని పాఠశాలల్లో స్థానిక ఉపాధ్యాయుల్ని గుర్తించి క్రీడలను ప్రోత్సహించేలా బాధ్యతలు అప్పగించాలని తెలిపారు. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ యాజమాన్య పాఠశాలలు ఫిట్ ఇండియా యాప్‌లో రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. ఇప్పటి వరకు 12 జిల్లాల్లోని పాఠశాలలకు క్రీడా సామగ్రి అందించామని, మిగిలిన జిల్లాలకు అక్టోబరు 16లోపు ప్రణాళిక ప్రకారం అందిస్తామని సమ్రగ శిక్ష ఎస్‌పిడి కెవి శ్రీనివాసులు రెడ్డి చెప్పారు. సీనియర్ సెకండరీ పాఠశాలలకు 17 వస్తువులు, ప్రాథమికోన్నత పాఠశాలలకు 14, ప్రాథమిక పాఠశాలలకు 9, ఉన్నత పాఠశాలకు 17 వస్తువుల చొప్పున క్రీడా సామగ్రి అందిస్తున్నామని వివరించారు. ఈ సమావేశంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు పి పార్వతి, కార్యదర్శి జి భానుమూర్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

రజతోత్సవ సభలో మాట్లాడుతున్న సూర్యప్రభ

మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సమాజం మార్పులో స్త్రీ పాత్ర ఎంతో కీలకమని, కానీ పాలకులు మహిళలకు రక్షణ కల్పించడంలో పూర్తిగా వైఫల్యం చెందారని ఎల్ఐసి వర్కింగ్ మహిళా కో-ఆర్డినేషన్ కమిటీ పేర్కొంది. శ్రీకాకుళంలోని హోటల్ గ్రాండ్‌లో ఎల్ఐసి ఉత్తరాంధ్రాలోని విశాఖ డివిజన్ మహిళా ఉద్యోగుల కో-ఆర్డినేషన్ కమిటీ రజతోత్సవ సభ శనివారం నిర్వహించారు. ఈ సభకు ఉభయ తెలుగురాష్ట్రాల ఎల్ఐసి మహిళా ఉద్యోగుల కన్వీనర్లు జి.సూర్యప్రభ, మైథిలి పాల్గొని మాట్లాడారు. ఆర్థిక సరళీకరణ విధానాల వల్ల మహిళలు ఉపాధికి దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా ప్రారంభమైన నాటి నుంచి ఇది మరింత తీవ్రమైందన్నారు. మతోన్మాద బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలపై దాడులు, అణచివేత, లైంగిక వేధింపులు, అత్యాచార ఘటనలు పెచ్చు మీరిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. సిఐటియు రాష్ట్ర నాయకులు పి.మణి మాట్లాడుతూ.. మహిళలపై అత్యాచారాలు దాడులు పెరుగుతున్నాయన్నారు. రాష్ట్రపతికి తగిన ప్రాధాన్యత, గౌరవం ఇవ్వకుండా మోడీ ప్రభుత్వం అవమానిస్తోందని తెలిపారు. పని ప్రదేశాల్లో సైతం మహిళా ఉద్యోగులపై వేధింపులు ఎక్కువవుతున్నాయని పేర్కొన్నారు. అనంతరం కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో జిల్లా శ్రామిక మహిళా సమన్వయ కమిటీ కన్వీనర్ కె.నాగమణి, ఎల్ఐసి విశాఖ డివిజన్ ఉద్యోగుల యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.వరప్రసాద్, ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన 200 మంది మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు సఫాయి కార్మికులకు సత్కారం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పారిశుధ్య నిర్వహణలో కీలకపాత్ర పోషిస్తున్న కార్మికుల సేవలకు గానూ ఈ నెల 25న సత్కారం ఏర్పాటు చేస్తున్నట్లు స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డి గంధం చంద్రుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తాడేపల్లిలోని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనరు కార్యాలయంలో ఈ కార్యక్రమం జరుగనుందన్నారు. ప్రతి జిల్లా నుంచి ఎంపిక చేసిన పలువురి సఫాయి కార్మికులకు, 32 పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థల నుంచి ఒక్కొక్కరికి చొప్పున సన్మానిస్తారని పేర్కొన్నారు.

దళిత హక్కులను కాలరాస్తున్న పాలకులు

- సామాజిక న్యాయం కోసం 29న మహాధర్నా
- వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-కడప అర్బన్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల హక్కులను కాలరాస్తున్నాయని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు అన్నారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులను, ఎస్సి, ఎస్‌టి సబ్ ప్లాన్ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, అసైన్డ్ చట్ట సవరణను ఉపసంహరించుకోవాలని కోరుతూ ఈ నెల 29న విజయవాడలో నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని కోరారు. 'దళితుల హక్కులు - సామాజిక న్యాయం కోసం' అనే అంశంపై కడపలోని వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో శనివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షులు జి.శివకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. అనేక సంవత్సరాలుగా సామాజిక న్యాయం కోసం దళితులు రోడ్డెక్కుతున్నా ఫలితంలేదన్నారు. ప్రజల మధ్య ఆర్థిక అసమానతలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం సామాజిక న్యాయానికి పాతరేసిందనడానికి మణిపూర్ ఘటనే నిదర్శనమని పేర్కొన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తోన్న మోడీ సర్కారుపై రాష్ట్రంలో వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు నోరెత్తకపోవడం సరికాదన్నారు. కొత్త పార్లమెంటు భవనం ప్రారంభానికి రాష్ట్రపతిని పిలవకపోవడం తగదన్నారు. దళిత, గిరిజనులకు 200 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను 300 యూనిట్లకు పెంచాలని, డప్పు చర్మకారుల పెన్షన్ రూ.5 వేలకు పెంచాలని, శ్మశానాలలో పనిచేస్తున్న కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రభుత్వ రంగాన్ని కాపాడి, ప్రయివేటు రంగంలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో భూపోరాట సాధన కమిటీ జిల్లా కన్వీనర్ బి.నారాయణ, సిపిఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్, నగర కార్యదర్శి రామమోహన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి వి.అన్వేష్, సిపిఐ (ఎంఎల్) నాయకులు డబ్ల్యు రాము, బిఎస్‌పి జిల్లా అధ్యక్షులు గుర్రప్ప, హేతువాద సంఘం జిల్లా కన్వీనర్ సి.ఆర్.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

తాడేపల్లిగూడెం మండలం కొత్తూరులో యాత్ర బృందానికి వినతి పత్రం అందిస్తున్న స్థానికులు

సబ్‌ప్లాన్‌ను పకడ్బందీగా అమలు చేయాలి

- మూడో రోజు కొనసాగిన దళిత రక్షణ చైతన్య యాత్ర

ప్రజాశక్తి - పశ్చిమగోదావరి యంత్రాంగం

దళితులకు రక్షణగా ఉన్న ఎస్సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయాలని కెవిపిఎస్ పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పశ్చిమగోదావరి జిల్లాలో చేపట్టిన దళిత రక్షణ యాత్ర మూడో రోజు శనివారం ఆచంట, పెనుగొండ, ఇరగవరం, తణుకు, తాడేపల్లిగూడెం మండలాల మీదుగా పెంటపాడు వరకు సాగింది. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజాసంఘాల నేతలు, దళితులు, కార్మికులు యాత్రకు ఘనస్వాగతం పలికారు. తమ సమస్యలతో కూడిన వినతిపత్రాలు యాత్ర బృందానికి అందించారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న ఎస్సి, ఎస్‌టి సబ్‌ప్లాన్ చట్టాన్ని పాలకులు నీరుగారుస్తున్నారని మండిపడ్డారు. దళితులపై దాడులు గతంలో ఎన్నడూ లేనంతగా పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను అంబానీ, అదానీ వంటి కార్పొరేట్లకు కట్టబెట్టి దేశ సంపదను కొల్లగొడుతున్నారని విమర్శించారు. అంబేద్కర్ ఇచ్చిన రాజ్యాంగ హక్కులను ఐక్య ఉద్యమాలతోనే కాపాడుకుంటామన్నారు. రాష్ట్రంలో ఉన్న మిగులు భూములను దళితులకు తక్షణమే పంచాలని డిమాండ్ చేశారు. యాత్రలో కెవిపిఎస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బత్తుల విజయకుమార్, బాతిరెడ్డి జార్జి, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి.చైతన్య ప్రసాద్, షేక్ వలీ, సిఐటియు జిల్లా కార్యదర్శి డి.కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై ప్రవీణ్ ప్రకాష్ ఫైర్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయులపై విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ మరోసారి ఫైర్ అయ్యారు. విద్యార్థులు వర్క్‌బుక్స్ రాయకపోవడం, ఉపాధ్యాయులు కరెక్షన్ చేయకపోవడాన్ని సాకుగా చూపి ఉపాధ్యాయులపై మండిపడ్డారు. విజయనగరం జిల్లాలోని విజయనగరం కస్పా హైస్కూల్, ఆర్‌కె ప్రాథమిక పాఠశాల, 15వ నంబరు సచివాలయం, డెంకాడ మండలం మోపాడ కెజిబివి పాఠశాలను శనివారం ఆయన పరిశీలించారు. ముందుగా కస్పా హైస్కూలులో ఏడవ తరగతి విద్యార్థుల అకడమిక్ స్థాయిని, వారి వర్క్‌బుక్స్‌ను పరిశీలించారు. ఎవరూ సరిగ్గా రాయకపోవడం, ఉపాధ్యాయులు వర్క్ బుక్స్ కరెక్షన్స్ చేయకపోవడాన్ని సాకుగా చూపి ఆగ్రహం వ్యక్తం చేశారు. 38 మంది ఉన్న ఈ తరగతి విద్యార్థుల వర్క్‌బుక్స్ సరిచేయలేకపోతే మీరేమి చేస్తున్నారని డిప్యూటీ డిఇఒ, ఎంఇఒ, హెచ్‌ఎంను ప్రశ్నించారు. అనంతరం ఆర్‌కె మున్సిపల్ ప్రాథమిక పాఠశాల, ఇప్పిలివీధిలోని సచివాలయాన్ని పరిశీలించారు. బడిమానేసిన విద్యార్థి ఇంటికి వెళ్లి ఓపెన్ స్కూలు ద్వారా అక్కడికక్కడే అడ్మిషన్ ఇప్పించారు. అనంతరం డెంకాడ మండలం కెజిబివి పాఠశాలను పరిశీలించారు. ఆయన వెంట డిఇఒ లింగేశ్వరరెడ్డి, డిప్యూటీ డిఇఒ వాసుదేవరావు, ఎంఇఒలు ఉన్నారు.

సదస్సులో మాట్లాడుతున్న గేయానంద్

పాలకుల విధానాలతో విద్య ప్రయివేటీకరణ

- ఎస్ఎఫ్ఐ ప్లీనరీలో మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

ప్రజాశక్తి-ఆలూరు

కేంద్ర ప్రభుత్వం నూతన విద్యావిధానం (ఎన్ఇపి)తీసుకువచ్చి పేద, మధ్య తరగతి విద్యార్థులకు విద్యను దూరం చేస్తోందని, ఈ విధానం విద్యను ప్రయివేట్ పరం చేస్తోందని మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్ విమర్శించారు. ఎస్ఎఫ్ఐ 46వ ప్లీనరీ సమావేశాలను కర్నూలులోని ఆలూరు ఇబ్రహీం ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 'ప్రస్తుత విద్యావ్యవస్థ-విద్యార్థులపై ప్రభావం' అనే అంశంపై జరిగిన రాష్ట్ర సదస్సులో గేయానంద్ మాట్లాడారు. గడిచిన 25 ఏళ్లుగా దేశంలో అమలవుతున్న విధానాలతో విద్య, సామాజిక బాధ్యత నుంచి ప్రభుత్వాలు నెమ్మదిగా తప్పుకుని ప్రయివేటీకరణ, కార్పొరేటీకరణను ప్రోత్సహిస్తున్నాయని విమర్శించారు. ఎన్ఇపిని అమలు చేయడం ద్వారా మతతత్వం జోడించి విద్యను ప్రమాదంలోకి నెట్టారని, విద్యలో అసమానతలు పెరుగుతూ పేదల చదువులపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. ఎన్ఇపిలో ఉన్న అంశాలన్నింటినీ ఆంధ్రప్రదేశ్ వేగంగా అమలు చేస్తోందని తెలిపారు. గత ఏడాదిలో ప్రారంభమైన ఆన్‌లైన్ శిక్షణా కార్యక్రమాల నుంచి ఒక్కో అంశాన్ని పరిశీలిస్తే పబ్లిక్, ప్రైవేటు భాగస్వామ్యం, డిజిటల్ బోధన, వర్క్ సర్దుబాటు లాంటివి ప్రవేశపెట్టి ఒకే మీడియానికి పరిమితం చేశారని వివరించారు. డిజిటల్ క్లాసురూముల పేరిట ఉపాధ్యాయుల అవసరం లేకుండా ఎన్ఇపి ప్రధాన భూమిక పోషించనుందన్నారు. దేశమంతా ఒకే పరీక్షా విధానాన్ని ప్రాథమిక పాఠశాల స్థాయిలో కూడా అమలు చేయనుందని తెలిపారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ప్రసన్న కుమార్ మాట్లాడుతూ.. ఎన్ఇపిలో భాగంగా గడిచిన విద్యాసంవత్సరంలో విలీన ప్రక్రియలో భాగంగా 3.50 లక్షల మంది విద్యార్థులు ప్రయివేటు పాఠశాలలకు వెళ్లిపోయారని తెలిపారు. 37 వేల ప్రాథమిక పాఠశాలల నుంచి 3, 4, 5 తరగతుల విద్యార్థులను ఒక కిలోమీటరు దూరంలోని ఉన్నత పాఠశాలలకు తరలించారని అన్నారు. దీనివల్ల ప్రాథమిక పాఠశాలలు బలహీనపడ్డాయని తెలిపారు. ఎస్ఎఫ్ఐ కర్నూలు జిల్లా కార్యదర్శి అబ్దుల్లా అధ్యక్షత వహించారు. జిల్లా అధ్యక్షులు రంగప్ప, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు మైన, గోవర్ధన్, వినోద్, గిరి, జిల్లాలోని ఆయా మండల నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంయమనంతో వ్యవహరిస్తున్నాం

- టిడిపి ఎమ్మెల్సీ అశోక్‌బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

వివేకా హత్యకేసులో భాగంగా ఎంపి అవినాష్‌రెడ్డిని అరెస్టు చేస్తే రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్య వస్తే? ఏ తప్పూ చేయని చంద్రబాబును జైల్లో పెట్టినా సంయమనంతో వ్యవహరిస్తున్నామని టిడిపి ఎమ్మెల్సీ అశోక్‌బాబు అన్నారు. మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్‌తో కలిసి టిడిపి కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. స్కిల్‌డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో ముడిపడిన అనేక ప్రధాన అంశాలను పక్కనపెట్టి కేవలం ఎవరో ఒక అధికారి నోట్‌ఫైల్లో రాసిన దానిని పట్టుకుని చంద్రబాబును అరెస్టు చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుకు అప్పటి విద్యాశాఖ కార్యదర్శిగా ఉన్న నీలం సహాని, నిధులు విడుదల చేసిన ప్రేమచంద్రారెడ్డి, అజయ్ కల్లంను విచారించకుండా చంద్రబాబే బాధ్యులని చెప్పడం ముమ్మాటికీ కక్షసాధింపే అని విమర్శించారు. వోక్స్‌వ్యాగన్ వ్యవహారంలో రూ.13 కోట్ల ప్రజల సొమ్ము దుర్వినియోగం చేసిన బొత్స సత్యనారాయణ... చంద్రబాబు గురించి మాట్లాడటం సిగ్గుచేటని జగదీష్ విమర్శించారు. చంద్రబాబును శాశ్వతంగా జైల్లోనే ఉంచాలని పాలకుల కుట్రలు నెరవేరవని మాజీ మంత్రి కెఎస్ జవహర్ అన్నారు. దేశంలోనే అత్యధిక కాలం కోర్టు బెయిల్‌పై జీవిస్తున్న వ్యక్తిగా సిఎం జగన్ సరికొత్త రికార్డు నెలకొల్పారని టిడిపి అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరాం అన్నారు. హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం వేసిన ఉండవల్లి అరుణ్‌కుమార్ జగన్ ప్రభుత్వ దోపిడీని ప్రశ్నించగలరా? అని టిడిపి నేత బుచ్చి రామ్‌ప్రసాద్ ప్రశ్నించారు.

హనుమంతసేవలో ఆకట్టుకున్న కేరళ కళాబృందాలు

ప్రజాశక్తి - తిరుమల

శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాల్లో ఆరో రోజైన శనివారం ఉదయం హనుమంత వాహనసేవలో టిటిడి హిందూ ధార్మిక ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహించిన కళా బృందాల ప్రదర్శనలు యాత్రికులను ఆకట్టుకున్నాయి. ఆంధ్ర, తమిళనాడు, కేరళ ప్రాంతాలకు చెందిన పది కళాబృందాలలో 275 మంది కళాకారులు ప్రదర్శనలిచ్చారు. కేరళ రాష్ట్రం పాలక్కాడ్‌కు చెందిన చెన్నమేళం (కేరళ డ్రమ్స్) బృందంలో 25 మంది కళాకారులు డ్రమ్స్, తాళాలు లయబద్ధంగా వాయిస్తూ అందుకు అనుగుణంగా అడుగులు వేస్తూ నృత్యం చేశారు. అదేవిధంగా 25 మంది మహిళలు కేరళ సంప్రదాయ వస్త్రధారణతో తిరువాతరకలై నృత్యం చేస్తూ విశేషంగా ఆకట్టుకున్నారు. తమిళనాడు రాష్ట్రం చెన్నైకి చెందిన శ్రీ భరత కళా అకాడమికి చెందిన 30 మంది యువతులు శ్రీకృష్ణవైభవం నృత్యం ప్రదర్శించారు. రాజమండ్రికి చెందిన శ్రీ లక్ష్మి గణేశ భజన మండలికి చెందిన 25 మంది యువతుల జానపద నృత్యం, తిరుమల శేష భజన మండలికి చెందిన 25 మంది కళాకారులు నవ దుర్గల వేషధారణలో దేవిస్తోత్రానికి అనుగుణంగా నత్యం ప్రదర్శించారు. అనంతపురానికి చెందిన 15 మంది అన్నమయ్య కీర్తనలకు భరతనాట్యం ప్రదర్శించారు.

కేరళ బృందం

అన్నప్రసాదాల వితరణ

అలిపిరి నుంచి తిరుమలకు నడిచివెళ్లే యాత్రికులకు ఆంధ్రా బ్యాంకు రిటైర్డ్ ఉద్యోగులు శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రా బ్యాంకు ప్రారంభించి వంద సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆ బ్యాంకులో పదవీ విరమణ పొంది తిరుపతి పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న రిటైర్డ్ ఉద్యోగులు తిరుమలకు కాలిబాట మార్గంలో వెళ్లే యాత్రికులకు అన్నప్రసాదం అందజేశారు.

ఈ కార్యక్రమంలో నడింపల్లి కష్ణ, మునుగోటి కష్ణ మూర్తి, మునిరత్నం నాయుడు, శ్రీకాంత్ పాల్గొన్నారు. అదేవిధంగా గోవింద సేవా మండలి సభ్యులు అలిపిరి వద్ద యాత్రికులు అన్నప్రసాదాలను వితరణ చేశారు.

విశాఖలోకి ప్రవేశించిన యుటిఎఫ్ స్వర్ణోత్సవ సంబరాల జాతాలో ప్రసాద్, తదితరులు

ఐక్య పోరాటాలకు సిద్ధం!

- యుటిఎఫ్ జాతాలో నాయకులు

ప్రజాశక్తి- యంత్రాంగం

విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం ఐక్య పోరాటాలకు ఉపాధ్యాయులు సిద్ధంగా ఉండాలని యుటిఎఫ్ నాయకులు కోరారు. అనంతపురం జిల్లాల్లో ప్రారంభమైన జాతా అన్నమయ్య జిల్లాకు, ఇచ్ఛాపురంలో ప్రారంభమైన మరోజాతా అల్లూరి సీతారామరాజు, విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో శనివారం కొనసాగింది. కడప జిల్లాలో మైదుకూరు, బద్వేల్ మీదుగా కడప, అన్నమయ్య జిల్లా రాయచోటి, పీలేరు మీదుగా మదనపల్లెకి చేరుకుంది. ఆయా ప్రాంతాల్లో నిర్వహించిన సభల్లో యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. విద్యారంగాన్ని కాపాడుకుందాం పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించుకుందాం అన్న నినాదంతో రాష్ట్ర వ్యాప్తంగా రెండు జాతాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ప్రజా సంకల్ప యాత్రలో ఉపాధ్యాయులకు ఇచ్చిన మాటను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తప్పారన్నారు. జిపిఎస్ రద్దుచేసి ఒపిఎస్ అమలు చేస్తామని హామీ ఇచ్చి నేడు మోసం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒపిఎస్ సాధనకు ఉద్యమ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు.

విశాఖ జిల్లా పెందుర్తి, ఎన్ఎడి జంక్షన్, కూర్మన్నపాలెంల్లోనూ, అనకాపల్లి జిల్లాలోని అనకాపల్లి, చోడవరం, మాడుగులలోనూ, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరులో కొనసాగింది. ఎక్కడికక్కడ సంఘం పతాకాలను నాయకులు ఆవిష్కరించారు. పలుచోట్ల జరిగిన సభల్లో యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కెఎస్ఎస్.ప్రసాద్ మాట్లాడుతూ.. జిపిఎస్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని తేల్చి చెప్పారు. జిఒ నంబర్ 117ను తీసుకొచ్చి 3, 4, 5 తరగతులను హైస్కూల్‌లో విలీనం చేసి ప్రాథమిక విద్యను ఛిన్నాభిన్నం చేశారని మండిపడ్డారు. యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్ కుమార్, రాష్ట్ర కార్యదర్శులు కె.లక్ష్మీపతిరాజా, రెడ్డి మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ఇవి త్రీ వీలర్ కార్గో విభాగంలోకి 'గోదావరి'

హైదరాబాద్ : గోదావరి ఎలక్ట్రిక్ మోటార్స్ కొత్తగా విద్యుత్ త్రీ వీలర్ కార్గో విభాగంలోకి ప్రవేశించినట్లు ప్రకటించింది. ఇందులో ఇ-లోడర్, ఎబ్లూ రెనోను విడుదల చేసినట్లు పేర్కొంది. కార్గో విభాగంలో కంపెనీ నుండి వచ్చిన మొదటి ఉత్పత్తి అని పేర్కొంది. ఎబ్లూ రెనో కోసం ప్రీ బుకింగ్‌లు తెరిచినట్లు తెలిపింది. కంపెనీ ఎక్స్‌షోరూం ధరను రూ.3,34,999గా నిర్ణయించింది. ప్రస్తుతం ఈ సంస్థ ఎబ్లూ రోజీ త్రీ వీలర్, ఎబ్లూ స్పిన్, ఎబ్లూ థ్రిల్ ఇ-సైకిళ్లను, ఎబ్లూ ఫియో ఇవి స్కూటర్లను విక్రయిస్తోంది. కొత్త కార్గో త్రీ వీలర్ వాహనాలతో కార్గో విభాగంలోకి ప్రవేశించామని గోదావరి ఎలక్ట్రిక్ మోటార్స్ సిఇఒ హైదర్ ఖాన్ తెలిపారు. దేశంలో ప్రస్తుతం 50డీలర్ షిప్‌లను కలిగి ఉన్నామని.. వచ్చే మార్చి ముగింపు నాటికి 100కు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

అఖిల ప్రియను ఆస్పత్రికి తరలిస్తున్న పోలీసులు

మాజీ మంత్రి అఖిలప్రియ దీక్ష భగ్నం

- బలవంతంగా ఆళ్లగడ్డకు తరలించిన పోలీసులు

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ మాజీ మంత్రి భూమా అఖిలప్రియ, ఆమె సోదరుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షను పోలీసులు భగ్నం చేశారు. మూడు రోజుల నుంచి వారు నంద్యాలలోని ఆర్‌కె ఫంక్షన్ హాల్ వద్ద దీక్ష చేస్తున్న విషయం విదితమే. శనివారం తెల్లవారుజామున పోలీసులు దీక్షాస్థలికి చేరుకున్నారు. అఖిల ప్రియ, విఖ్యాత్‌రెడ్డి దీక్షను భగ్నం చేసి బలవంతంగా వారిని ఆళ్లగడ్డ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారి ఆరోగ్యం క్షీణించిన నేపథ్యంలో సెలైన్ బాటిళ్లు ఎక్కించేందుకు వైద్యులు ప్రయత్నించగా అందుకు వారు నిరాకరించారు. దీంతో అఖిల ప్రియ, విఖ్యాత్‌రెడ్డిని ఆళ్లగడ్డలోని తమ నివాసాలకు తరలించారు. ఈ సందర్భంగా అఖిలప్రియ మాట్లాడుతూ.. ఇంటిలోనే దీక్ష చేపడుతామని ప్రకటించారు. దీక్షా శిబిరంలో కూర్చున్న తమ వారిపై పోలీసులు దాడి చేశారని ఆరోపించారు.

రాష్ట్రంలో హానికర మద్యం సరఫరా : పురంధేశ్వరి

ప్రజాశక్తి - కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

రాష్ట్రంలో నాణ్యతలేని, ఆరోగ్యానికి తీవ్ర హాని కలిగించే మద్యాన్ని సరఫరా చేస్తున్నారని, తక్కువ ధర కలిగిన సరుకునే ఎక్కువ ధరకు విక్రయిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు డి.పురంధరేశ్వరి విమర్శించారు. విశాఖపట్నం జిల్లా కెజిహెచ్‌లోని గ్యాస్ట్రో ఎంట్రాలజీ వార్డును ఆమె శనివారం సందర్శించారు. అక్కడ లివర్ సిరోసిస్ వ్యాధితో బాధపడుతున్న రోగులను పరామర్శించారు. రోగుల పరిస్థితి విషమంగా ఉందని, వారిలో 39 మంది ఆల్కహాల్ సంబంధిత ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొంతమంది రోగులు చీప్ లిక్కర్ వల్ల తమ ఆరోగ్యం దెబ్బతిందని తన ఎదుట వాపోయారని తెలిపారు. ఈ విషయాలన్నింటినీ కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రికి వివరించి, మద్యం నాణ్యతను ధ్రువీకరించాలని కోరుతానన్నారు. అనంతరం బిజెపి కార్యాలయంలో నిర్వహిస్తున్న రక్తదాన శిబిరంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం చంద్రబాబుపై కేసు పెట్టిందని, ఆ కేసు విచారణ రాష్ట్రానికి సంబంధించిన సిఐడి చూస్తుందని, కేంద్రానికి ఎటువంటి సంబంధమూ లేదని స్పష్టం చేశారు. టిడిపి, బిజెపి కలిస్తే బాగుంటుందని జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలపై ఆమె స్పందిస్తూ.. 'మాది జాతీయ పార్టీ అని, పొత్తులపై నిర్ణయం అధిష్టానమే తీసుకుంటుంది' అని తెలిపారు.

పోలీసులకు పట్టుబడిన మావోయిస్టు డిప్యూటీ కమాండర్ ఉంగాల్

ప్రజాశక్తి - చింతూరు

అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని లంకపల్లి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో మావోయిస్ట్ పార్టీకి చెందిన 'బి' ప్లాటూన్ డిప్యూటీ కమాండర్ మడకం ఉంగతి ఉంగాల్ పోలీసులకు పట్టుబడ్డారు. ఆ వివరాలను అల్లూరి జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా శనివారం చింతూరులో మీడియాకు వెల్లడించారు.

మడకం ఉంగాల్ తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ ప్రాంతాల్లో తిరుగుతూ 37 చట్ట వ్యతిరేక కార్యకలాపాల్లో పాలుపంచుకున్నారు. ఆయన 2014 డిసెంబర్‌లో ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుక్మా జిల్లా చింతగుప్ప పోలీస్ స్టేషన్ సమీపంలోని కసాల్పాడు గ్రామంలో జరిపిన దాడిలో 14 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లు మరణించారు. 2017 మార్చిలో బుర్కాపాల్ గ్రామంలో జరిపిన దాడిలో 25 మంది పోలీసులు మృతి చెందారు. ఇలా పలుమార్లు పోలీసులను లక్ష్యంగా చేసుకుని దాడులు నిర్వహించారు. ఆయనను ఎలాగైనా పట్టుకోవాలని పోలీసులు కొంతకాలంగా వ్యూహాలతో ముందుకెళ్తున్నారు. ఈ క్రమంలోనే ముందస్తు సమాచారం మేరకు లంకపల్లి గ్రామ శివారు అటవీ ప్రాంతంలో ఉంగాల్ కదలికలపై నిఘా పెంచారు. మందు పాతర అమర్చి పోలీసులను హతమార్చే పనిలో ఉండగా పట్టుకున్నారు. ఆయనతో ఉన్న మావోయిస్టు పార్టీ నాయకులు, సభ్యులు, మిలీషియా సభ్యులు తప్పించుకున్నారు. ఉంగాల్ నుంచి రెండు డిటోనేటర్లు, రెండు గ్రెనేడ్లు, కార్డెక్స్ వైరు, ఐరన్ ముక్కలు, కుక్కర్ స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌పి తెలిపారు. సమావేశంలో పోలీసు అధికారులు కెవి.మహేశ్వరరెడ్డి, ధర్మ ప్రకాష్ పాల్గొన్నారు.

ఫోన్ పే యాప్ స్టోర్ ఆవిష్కరణ

- ఇండస్ పేరుతో విడుదల
- తొలి ఏడాది డెవలపర్లకు ఉచితం
- గూగుల్ ప్లే, ఆపిల్‌లకు పోటీగా అభివృద్ధి

న్యూఢిల్లీ : యాప్ స్టోర్లలో గుత్తాదిపత్యం కలిగిన గూగుల్ ప్లే స్టోర్, ఆపిల్ యాప్ స్టోర్లకు పోటీని ఇవ్వడానికి ప్రముఖ చెల్లింపుల వేదిక సంస్థ ఫోన్ పే రంగంలోకి దిగింది. కొత్తగా యాప్ స్టోర్‌ను అభివృద్ధి చేసింది. తన సేవల విస్తరణలో భాగంగా యాప్ సేవల కోసం సొంతంగా 'ఇండస్ యాప్ స్టోర్' పేరుతో అందుబాటులోకి తెచ్చింది. ఈ స్టోర్‌లో భారత్ యాప్ డెవలపర్లు తమ యాప్స్‌ను రిజిస్టర్ చేసుకుని ఉచితంగా అప్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పిస్తుంది. 13 భాషల్లో యాప్ స్టోర్ సేవలు అందుబాటులో ఉంటాయి.

2015లో ఆకాశ్ డోంగ్రె, సుధీర్ బి, రాకేశ్ దేశ్‌ముఖ్ అనే ఐటియన్ల ఆలోచనలతో 'ఇండస్ యాప్' స్టోర్ రూపుదిద్దుకుంది. భారతీయ స్మార్ట్ ఫోన్ వినియోగదారులకు చేయూత ఇవ్వడానికి.. వారి చాయిస్‌కు అనుగుణంగా కంటెంట్ అందించేందుకు 'ఇండస్ ఒఎస్' అనే యాప్ కంటెంట్ డిస్కవరీ ప్లాట్‌ఫామ్ ఏర్పాటు చేశారు.

అమెరికా కేంద్రంగా పని చేస్తున్న ఇ-కామర్స్ సంస్థ వాల్‌మార్ట్ అనుబంధ సంస్థగా ఉన్న ఫోన్‌పే రూపొందించిన 'ఇండస్ యాప్' స్టోర్‌కు సాంసంగ్ వెంచర్ క్యాపిటల్ ఆర్మ్ మద్దతు అందిస్తోంది. యాప్ డెలవపర్లు ఏడాది తర్వాత స్వల్ప ఫీజు చెల్లించాల్సి ఉంటుందని.. యాప్స్ డెవలపర్స్ నుంచి ప్లాట్‌ఫామ్ ఫీజు లేదా చార్జీ వసూలు చేయబోవడం లేదని ఫోన్ పే తెలిపింది. యాప్ డెవలపర్లు తమకు నచ్చిన పేమెంట్ గేట్‌వేను ఉచితంగా ఇంటిగ్రేట్ చేసుకోవచ్చని పేర్కొంది. గూగుల్ ప్లే స్టోర్ గానీ, ఆపిల్ యాప్ స్టోర్ గానీ అన్ని యాప్‌లను అనుమతించడం లేదు. యాప్‌లు రూపొందించిన డెవలపర్ల నుంచి ప్రతియేటా 15-25 శాతం ఫీజు వసూలు చేస్తున్నాయి. గూగుల్, ఆపిల్ సంస్థలు పేమెంట్ ప్రాసెసింగ్ సిస్టమ్ ఎంచుకోకుండా డెవలపర్లను నియంత్రిస్తున్నాయి. దీంతో వీటిపై యాప్ డెవలపర్ల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ సమస్యకు తమ ఇండస్ యాప్‌స్టోర్ ప్రత్యామ్నాయం కాగలదని ఫోన్ పే పేర్కొంది. 'వచ్చే మూడేళ్లలో భారత్‌లో 100 కోట్ల మందికిపైగా స్మార్ట్ ఫోన్ వినియోగదారులు ఉంటారు. ఈ నేపథ్యంలో న్యూ జనరేషన్ అండ్ స్థానిక ఆండ్రాయిడ్ యాప్ స్టోర్ నిర్మాణానికి మంచి అవకాశం ఉంది. భారీ మార్కెట్, యాప్ డెవలపర్లు ఉన్నా.. వారు తయారు చేసే యాప్స్ పంపిణీ చేయాలంటే ఏకైక మార్గం 'గూగుల్ ప్లే స్టోర్'పైనే ఆధార పడాల్సి వస్తుంది. ఈ పరిస్థితుల్లో భారతీయుల యాప్ డెవలపర్ల కోసం విశ్వసనీయమైన ప్రత్యామ్నాయ ప్లాట్‌ఫామ్ అందించగలమన్న ఆశాభావంతో ఉన్నాం.' అని ఇండస్ యాప్ స్టోర్ సహ వ్యవస్థాపకుడు, సిపిఒ ఆకాశ్ డోంగ్రె పేర్కొన్నారు. ఈ యాప్‌స్టోర్‌తో ప్రస్తుత గూగుల్ ప్లే స్టోర్, యాపిల్ యాప్ స్టోర్ గుత్తాధిపత్యం కొనసాగుతోన్న వేళ ఫోన్‌పే వాటికి సవాల్ విసరనుంది.



సంపాదకీయం

సైలెంట్ కిల్లర్

రేపటి నీ ఆరోగ్యం...ఇవాళ్టి నీ అలవాట్లను బట్టి వుంటుంది. 'ప్రజ్ఞాపరాధొ మూలం సర్వరోగాణాం-సువిచారో పరమౌషధం' అంటారు. అంటే- 'అన్ని రోగాలకు మూలం అన్నీ తెలిసి పాటించకపోవుట, అన్నిటికన్నా గొప్ప ఔషధం మంచి ఆలోచనలు చేయుట. ఉరుకులు పరుగుల జీవితం... మారిన ఆహారపు అలవాట్లు, అధిక బరువు, పని ఒత్తిడి, కాలుష్యం... వెరసి మనిషి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఆధునిక సాంకేతికత మనిషి కదిలే పనిలేకుండా చేసింది. దీంతో మనిషి జీవనశైలి మారింది. ఆహారపు అలవాట్లలో తేడా వచ్చింది. ఇంటికీ, ఒంటికి, పనికి- సరిపడని పాశ్చాత్య సంస్కృతిని దిగుమతి చేసుకుంటున్నారు. దీంతో ఒకప్పటి గట్టితనం లేకుండా పోయింది. కావాలని చేసినా...ఎవరో చేస్తున్నారని చేసినా... మనం చేసే పనులన్నింటికీ ప్రతిచర్య వుంటుంది. చర్యకు ప్రతిచర్య సమాధానం అన్నట్లుగా...ఒత్తిడి, జీవనశైలి-రెండూ ఒకదానిపై మరొకటి ప్రభావం చూపుతాయి. అందుకే 'ఒత్తిడి వంద రోగాల పెట్టు' అంటారు పెద్దలు. మారిన జీవనశైలి, ఆహారపు అలవాట్లు, ప్రపంచీకరణ తెచ్చిపెట్టిన ఒత్తిళ్లతో హైపర్‌టెన్షన్ కేసులు రోజురోజుకీ పెరుగుతున్నాయి. అయితే, ఈ కేసులు చాలా ఆలస్యంగా వెలుగులోకి వస్తాయి. అందుకే దీనిని సైలెంట్ కిల్లర్ అంటారు వైద్యులు.

హైపర్ టెన్షన్ యువత గుండెను సైలెంట్‌గా పట్టేస్తోంది. మూత్రపిండాల పనితీరును దెబ్బతీస్తోంది. పక్షవాతంతో పాటు జ్ఞాపకశక్తి సన్నగిల్లేలా చేస్తోంది. గుండెజబ్బు, క్యాన్సర్‌లకూ కారణమౌతోంది. చిన్న వయస్సులోనే హైపర్ టెన్షన్ బారిన పడుతున్న వారి సంఖ్య అధికమౌతోంది. ఒకప్పుడు హైబీపీ సమస్యలు వయసు పైబడినవారిలో అధికంగా వుండేవి. ప్రస్తుతం 30ఏళ్ల లోపు వారిని కూడా ఈ సమస్యలు వెంటాడుతున్నాయి. కొందరిలో జన్యుపరమైన కారణాలు కావొచ్చు... కానీ ఇటీవల జీవనశైలిలో వచ్చిన మార్పుల కారణంగా యువత దీని బారిన పడుతున్నట్లు అనేక అధ్యయనాలు చెబుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా ప్రతి ముగ్గురిలో ఒకరిని హైపర్‌టెన్షన్ ప్రభావితం చేస్తోంది. 30-79 సంవత్సరాల వయస్సు గల 18.8 కోట్లమంది భారతీయులకు రక్తపోటు వున్నట్లు డబ్ల్యుహెచ్‌ఓ ఒక నివేదికలో వెల్లడించింది. 2023 జూన్ నాటికి దేశంలోని 5.8 మిలియన్ల మంది అధిక రక్తపోటు చికిత్స కోసం 'ఇండియా హైపర్‌టెన్షన్ కంట్రోల్ ఇనీషియేటివ్ (ఐహెచ్‌సిఐ)' నమోదు చేసుకుంది. అధిక రక్తపోటు వల్ల గుండెజబ్బులు, ఇతర తీవ్రమైన అనారోగ్య సమస్యలు ఇటీవల పెరుగుతున్నాయి. ముఖ్యంగా మారుతున్న శైలి, శారీరక శ్రమ తగ్గిపోవడం, జంక్ ఫుడ్స్ ఎక్కువగా తీసుకోవడం, శారీరక శ్రమ లేకపోవడం, దీర్ఘకాలిక ఒత్తిడి, ఆహారంలో ఉప్పు అధికంగా తీసుకోవడం అధిక రక్తపోటుకు దోహదం చేస్తాయి. రోజుకు 5గ్రాముల కంటే ఎక్కువ ఉప్పు వినియోగం 17-30శాతం వరకు కారణమని అధ్యయనాలు చెబుతున్నాయి. 2025 నాటికి సగటు జనాభాలో ఉప్పు తీసుకోవడం 30శాతం తగ్గించాల్సి వుండగా, డబ్ల్యుహెచ్‌ఓ సూచించిన ప్రిస్క్రిప్షన్‌లోని అనేక భాగాలను భారత్ ఇంకా అమలు చేయలేదు. అంతేకాదు... 2021లో దేశంలోని నాలుగు రాష్ట్రాలలో జరిగిన ఒక అధ్యయనంలో ప్యాక్ చేసిన ఆహార పదార్థాలలో ఉప్పు, చక్కెర అధికంగా వున్నట్లు కనుగొన్నారు.

కార్పొరేట్ కంపెనీలు విచ్చలవిడిగా ప్రమోట్ చేస్తున్న ఆహార పానీయాలకు దూరంగా వుండాలి. ఆరోగ్యకరమైన. ఆహారాన్ని తీసుకోవడం, ఉప్పును తగ్గించడంపై అవగాహన పెంచాలి. పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు, తృణధాన్యాలు దేశీయ పంటలను, ఇంటి వంటలను తీసుకోవడంతో పాటు తగినంత వ్యాయామం చేయడం వల్ల ఈ హైపర్ టెన్షన్ నుంచి బయటపడొచ్చు. అధిక రక్తపోటు వున్నవారు చికిత్స చేయించుకునేలా ప్రోత్సహించడం, రక్తపోటును అదుపులో వుంచుకోవడం చాలా ముఖ్యం. 'నీవు ఎలా మలుచుకుంటే... అలా తయారవుతుంది జీవితం' అంటాడు షేక్స్పియర్. జీవితంలో సమతుల్యత దెబ్బతినకుండా ఆనందాన్ని, విజయాన్ని సాధించటమెలాగో నేర్చుకుంటే... చాలావరకు ఈ సమస్యలన్నిటికీ దూరంగా వుండొచ్చు. ఎంతటి కార్యమైనా ప్రయత్నం వల్లే సిద్ధిస్తుంది. 'అజ్ఞానం కన్నా నిర్లక్ష్యం చేసే కీడే ఎక్కువ' అంటాడు ఫ్రాంక్లిన్. ఎంత శక్తి సామర్థ్యాలున్నా నిర్లక్ష్యం వహిస్తే... కోరి అనారోగ్యం తెచ్చుకున్నట్లే.

మహనీయుల మాట



ఎప్పుడైతే మనిషి భ్రాంతికి గురవుతాడో అతన్ని పిచ్చివాడు అంటారు! అయితే అదే భ్రాంతికి అనేక మంది గురైతే అదే మతం అవుతుంది!!

- రిచర్డ్ డాకిన్స్, ప్రఖ్యాత పరిణామ శాస్త్రవేత్త

నివాళి

తరాల వారధి కొరటాల

వి. శ్రీనివాసరావు

'ఏరా బాబూ..ఎలా ఉన్నావ్..?' అంటూ అందరినీ ఆప్యాయంగా పలకరించే గొంతు మూగబోయి 17 సంవత్సరాలయింది. కొరటాలగా అందరూ ప్రేమగా పిలుచుకునే కా|| కొరటాల సత్యనారాయణ జన్మించి నేటికి 100 సంవత్సరాలు పూర్తయింది. 1923 సెప్టెంబర్ 24వ తేదీన గుంటూరు జిల్లా అమృతలూరు మండలం ప్యాపర్రు గ్రామంలో బుచ్చయ్య, శేషమ్మ దంపతులకు జన్మించారు. పుట్టింది భూస్వామ్య కుటుంబంలోనైనా పెరిగింది ప్రజల మధ్య. పని చేసింది శ్రామిక జనం కోసం. హైస్కూలులోనే డిటెన్షన్ విధానానికి వ్యతిరేకంగా 11 రోజుల విద్యార్థుల సమ్మెకు నాయకత్వం వహించారు. గుంటూరు ఎ.సి కాలేజీలో ఇంటర్మీడియట్‌లో చేరి మధ్యలోనే చదువు ఆపేసి ప్రజా ఉద్యమాలకు తన యావత్ జీవితాన్ని అంకితం చేశారు. నాటి నుండి ఆఖరి శ్వాస వరకు మార్క్సిస్టు, లెనినిస్టు సిద్ధాంతంపై అత్యంత విశ్వాసంతో ఉంటూ కమ్యూనిస్టు పార్టీలో-తొలుత ఉమ్మడి సిపిఐ తరువాత సిపిఐ(యం)లో పనిచేశారు. 1946-48 మధ్య తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం సాగుతున్న రోజుల్లో ఆంధ్ర ప్రాంతంలో దానికి మద్దతుగా నిలబడి జైలుపాలయ్యారు. 1948లో అరెస్టయి కడలూరు జైలులో గడిపారు. గుంటూరు జిల్లాలో బంజరు భూములు, లంక భూముల కోసం పేదలను కదిలించి పోరాటాలు నిర్వహించారు. వ్యవసాయ కూలీల వేతనాల పెంపు కోసం పోరాడారు. పాలేర్ల పోరాటానికి అండగా నిలబడ్డారు. రేపల్లె ప్రాంతంలో చేనేత కార్మిక సంఘాన్ని నిర్మించారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఆ తరువాత రైతుసంఘం కార్యదర్శిగా పలు ఉద్యమాలకు నాయకత్వం వహించారు. ప్రకాశం, గుంటూరు జిల్లాల్లో పత్తి రైతుల ఆత్మహత్యల్ని వెలికితీసి వాటిపై ఆనాటి ఎన్‌టి రామారావు ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకునేందుకు కారణమయ్యారు. ప్రజాశక్తి సాహితీ సంస్థ వ్యవస్థాపక చైర్మన్‌గా దాని అభివృద్ధికి విశేష కృషి చేశారు. 1952 తొలి పార్లమెంటు ఎన్నికలలో అతి చిన్న వయస్సులోనే తెనాలి లోక్‌సభ నుండి పోటీ చేసి కేవలం 1100 ఓట్ల తేడాతో ఓడిపోయారు. 1962లో మొదటిసారి వేమూరు నియోజకవర్గం నుండి ఎమ్మెల్యేగా గెలిచారు. విశాఖ ఉక్కు ఉద్యమానికి మద్దతుగా రాజీనామా చేసిన ఎమ్మెల్యేల్లో ఆయన కూడా ఉన్నారు. రెండవసారి 1978లో రేపల్లె నుండి శాసనసభకు ఎన్నికయ్యారు. తెనాలి- రేపల్లె ప్రాంతంలో ఆయన సాగించిన ప్రజా ఉద్యమాలు, ఆయన ప్రజా ప్రతినిధిగా ఎన్నికవ్వడానికి తోడ్పడ్డాయి. పార్టీ గుంటూరు జిల్లా కార్యదర్శిగా సుదీర్ఘకాలం పనిచేశారు. 1991-97 మధ్య పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా, 2002-05 మధ్య పొలిట్‌బ్యూరో సభ్యుడిగా బాధ్యతలు నిర్వహించారు.

నాకు ఆయనతో 1984 నుండి ప్రత్యక్ష పరిచయం. అంతకు ముందు ఆయన గురించి వినడం, దూరం నుండి చూడడం తప్ప ప్రత్యక్షంగా తెలియదు. 1983 శాసనసభ ఎన్నికలు అయిపోగానే నేను డివైఎఫ్ఐ రాష్ట్ర బాధ్యతల్లోకి వచ్చాను. యువజన, విద్యార్థి ఉద్యమాన్ని ఆయనే పార్టీ నుండి గైడ్ చేసేవారు. ఆ తరువాత నేను రైతు సంఘంలోకి మారినప్పటి నుండి కూడా ఆ బంధం అలాగే కొనసాగుతూ వచ్చింది. ఆయన పార్టీ కార్యదర్శిగా ఎన్నికయ్యాక ఆయన స్థానంలో రైతుసంఘం బాధ్యతలు నేను తీసుకున్నాను. ఆ తరువాత ప్రజాశక్తి సంపాదకునిగా బాధ్యతల్లో చేరాక ఆయనే ఆ సంస్థకు చైర్మన్‌గా ఉండేవారు. నేను ఢిల్లీ అఖిల భారత కేంద్రానికి వెళ్లడానికి కూడా ఆయన ప్రోత్సాహమే కారణం. ఆ రకంగా రెండు దశాబ్దాలకు పైగా ఆయనతో ప్రత్యక్షంగా ఆయన గైడెన్సులో పనిచేశాను. ఎన్నో అపూర్వమైన అనుభవాలను, మంచి జ్ఞాపకాలను మిగిల్చి వెళ్ళిపోయారు.

కా|| కొరటాల శత జయంతి సందర్భంగా ఆయన నుండి ఎన్నో అనుభవాలు నేర్చుకోవచ్చు. ఆయన నిరంతర అధ్యయనశీలి. యువజన సంఘంలో రాష్ట్ర యువజనోత్సవాలు నిర్వహించేందుకు అనుభవం లేని మానెత్తిమీద పెద్ద భారాన్ని వేసుకున్నాము. ఆయన యువకుడిగా ఉన్నప్పుడు నిర్వహించిన కార్యకలాపాలను విడమరిచి చెప్పి మీరు ఖచ్చితంగా నిర్వహించగలరు అన్న ధైర్యాన్ని ఇచ్చారు. యువజనోత్సవాల నిర్వహణకు ప్రతి సూక్ష్మమైన వివరాన్ని ఆయనతో చర్చించాకే తుది రూపం ఇచ్చేవాణ్ణి. ఈ అనుభవంతో రెండో యువజనోత్సవాలను వరంగల్‌లో నిర్వహించాం. యువజన సంఘం స్వతంత్రంగా నిధులు పోగేసుకొని నడపడానికి ఆయనిచ్చిన ప్రోత్సాహమే కారణం. అఖిల భారత కిసాన్ మహాసభ ఖమ్మంలో జరిగినప్పుడు రాష్ట్రం మొత్తం మీద వేలాదిమంది ఎర్ర చొక్కా వలంటీర్లకు శిక్షణనిచ్చి కవాతు నిర్వహించాం. అందులో 3,500 మందికి 10 రోజులపాటు క్యాంపు నిర్వహించి వివిధ జిల్లాల్లో శిక్షణ ఇచ్చాము. యువ నాయకత్వాన్ని అభివృద్ధి చేయడానికి అనకాపల్లిలో 10 రోజులపాటు రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహించాము. యువజన సంఘం జిల్లా నాయకత్వాన్ని అభివృద్ధి చేయడానికి ఈ క్యాంపు ఎంతగానో తోడ్పడింది. వీటన్నింటి వెనక ఉన్నది కొరటాల మార్గదర్శకత్వం.

నేడు కా|| కొరటాల శత జయంతి

నేను యువజన సంఘం నుండి పాక్షికంగా రిలీవ్ అయి రెండు సంవత్సరాలపాటు రైతు రంగంలో ప్రత్యక్షంగా పనిచేశాను. ఈ కాలంలో వ్యవసాయ రంగంలో అనేక క్లిష్టమైన సమస్యలను అధ్యయనం చేయడానికి కా|| కొరటాల నన్ను వెంటబెట్టుకొని తిప్పారు. అప్పుడప్పుడే మొదలువుతున్న రొయ్యల సాగులో అనేక మెళకువలు నేర్చుకోవడానికి రొయ్యల సాగు వలన వచ్చే పరిణామాలను అర్థం చేసుకోవడానికి ఆయనతో జరిపిన చర్చలు తోడ్పడ్డాయి. పేద రైతుల పునాదిగా రైతు ఉద్యమాన్ని నిర్వహించాలన్న పార్టీ డైరెక్షన్‌కు అనుగుణంగా రైతు సంఘాన్ని కొత్త ఒరవడిలో నడపాలని నిర్ణయించుకున్నాం. రేపల్లె-తెనాలి ప్రాంతాలను సందర్శించి పేద రైతుల సమస్యలను ప్రత్యేకంగా అధ్యయనం చేయడానికి ఆయన తోడ్పడ్డారు. వస్తున్న మార్పులను ఆయన నిశితంగా పరిశీలించేవారు. ఆ చర్చల్లో నుండే కౌలు రైతులను ప్రత్యేకంగా ఆర్గనైజ్ చేయాలన్న ఆలోచన వచ్చింది. రైతు సంఘంలో అంతర్భాగంగానే కౌలు సంఘాన్ని ప్రారంభించాము. ఆ తరువాత అది స్వతంత్ర సంఘంగా మారి తన కాళ్ళపై తను నిలబడి పని చేస్తున్నది. వ్యవసాయ రంగంలో అత్యంత క్లిష్టమైన సమస్య నీటిపారుదల రంగం. సుందరయ్య రాసిన 'ఆంధ్రప్రదేశములో సమగ్ర నీటి పథకం' పుస్తకం చదివినా అర్థమైందని చెప్పలేను. నేను చదివిన ప్రతి అంశాన్ని కొరటాలతో చర్చించిన తరువాతే నాకు బోధపడేది. కొల్లేరు సమస్య ఆరోజు వివాదాస్పదంగా ఉండేది. సుందరయ్య గారు కొన్ని శాస్త్రీయ పరిష్కారాలు చూపారు. వాటిని భూస్వాములు ఆమోదించలేదు. కొరటాలతో కలిసి పడవల మీద కొల్లేరు సందర్శించి పరిశీలించాము. ఆ తరువాత పశ్చిమ గోదావరి జిల్లా కమిటీ దీన్నొక ముఖ్య సమస్యగా స్వీకరించి ప్రజల్ని సమీకరించి ఉద్యమాన్ని నడిపింది. పేద రైతులు, వృత్తిదారుల సంరక్షణను మేము ప్రధానంగా ముందుకు తీసుకొచ్చాము. నూతన ఆర్థిక విధానాలు అమలయ్యాక తొలి దశలో ఆత్మహత్యలు మొదలయ్యాయి. ఆత్మహత్యలు చేసుకున్న కుటుంబాలను కా|| కొరటాల పరామర్శించి దానికి కారణాలను శోధించారు. కొంతమంది జడ్జిలు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ప్రత్యేకంగా కమిటీ నియమించి అధ్యయన నివేదికను వెల్లడించారు. ప్రత్యామ్నాయ నినాదాలతో మన రైతుసంఘం, పార్టీ దీన్నొక ఎజెండాగా మార్చగలిగాయి. నాటి కాంగ్రెస్, తెలుగుదేశం రెండు పార్టీలు రైతు ఆత్మహత్యలను గుర్తించడానికి నిరాకరించాయి. అప్పటికే చేనేత కార్మికుల ఆకలి చావుల మీద, మహబూబ్‌నగర్ జిల్లా కరువు చావుల మీద ఆయన లోతుగా అధ్యయనం చేసి ఉద్యమాలు నడిపి ఉన్నారు. ఈ ఆత్మహత్యలకు నూతన ఆర్థిక విధానాలకు మధ్య ఉన్న సంబంధాన్ని మేము రైతుల్లో ప్రచారం చేయడానికి రైతు రక్షణ యాత్రను చేపట్టాం. హైదరాబాద్‌లో పెద్ద సభ కూడా జరిగింది. రైతు రంగంలో ఉద్యమ కార్యకర్తలను పెంచుకోడానికి, ఉన్నవారిని చురుగ్గా పని చేయించడానికి ఉయ్యూరులో ప్రత్యేకంగా నిర్వహించిన శిక్షణా శిబిరానికి ఆయన సలహామీదే సిలబస్ రూపొందించాం. పంటలవారీ సమస్యలు, సహకార రంగంలో చక్కెర ఫ్యాక్టరీలు, చెరకు ధర నిర్ణయించే తీరు ఇవన్నీ ఆయన దగ్గర నేర్చుకున్నవే. ఈ క్రమంలోనే గొర్రెల మేకల పెంపకందార్ల సమస్య మా ముందుకొచ్చింది. కొరటాల సలహాతో రైతుసంఘం చొరవ తీసుకొని మేమే దానికి ఆర్థిక సహకారం కూడా అందించి సంఘాన్ని నిర్మించాము. అది కూడా ఇప్పుడు స్వతంత్ర సంఘంగా పని చేస్తున్నది.

కార్యకర్తల పట్ల ఆయన అభిమానం ఎనలేనిది. ఆయన వయస్సు పెద్దదీ. సీనియర్ కమ్యూనిస్టు. ఆయినా జూనియర్లతోనూ, యువతీ యువకులతోనూ కలిసి పోయేవారు. ఆయనతో మాట్లాడేటప్పుడు ఏమాత్రం జంకు ఉండేది కాదు. స్వేచ్ఛగా చర్చించడానికి అవకాశం ఇచ్చేవారు. విడమరిచి చెప్పేవారు. సమస్య వస్తే పరిష్కారానికి తోడ్పడేవారు. క్షేత్రస్థాయి వరకు శాఖా సమావేశాలకు వెళ్ళమని ప్రోత్సహించేవారు. ఆయన క్షేత్రస్థాయి నుండి పైకి ఎదిగివచ్చిన నాయకుడు. మాలాంటి వాళ్ళను క్షేత్రస్థాయికి పంపి పై నాయకత్వానికి అవసరమైన అర్హతలు సాధించేందుకు తోడ్పడ్డారు. ఏదైనా ఒక కార్యక్రమం తీసుకున్నప్పుడు అతి అంచనాలకు పోకుండా వాస్తవిక దృక్పథంతో వ్యవహరించేందుకు, ఆచరణాత్మక సమస్యలను ఎదుర్కొని పరిష్కరించేందుకు, అన్నిటినీ మించి వైఫల్యాలు ఎదురైనప్పుడు ధైర్యం చెప్పేందుకు ఆయన ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. సోవియట్ యూనియన్ కూలిపోయినప్పుడు ఆయనతో రోజులతరబడి జరిపిన సుదీర్ఘ చర్చలు ఇప్పటికీ జ్ఞాపకమున్నాయి. కేంద్ర కమిటీ తీర్మానాలను విడమరిచి చెప్పేవారు. పార్టీపై విశ్వాసాన్ని పునరుద్ధరించుకునే ఒక చారిత్రక మూల మలుపులో ఈ అధ్యయనం, చర్చలు నన్ను నేను నిలబెట్టుకునేందుకు ఎంతగానో తోడ్పడ్డాయి.

నేను ప్రజాశక్తికి మారడానికి కూడా ఆయన ప్రోత్సాహమే కారణం. అప్పటి వరకు నాకు పత్రికా రంగంలో ఎటువంటి అనుభవం లేదు. యువజన, రైతు సంఘాలలో మాస పత్రికలు నేనే నడిపేవాణ్ణి. అవి లాభదాయకంగా కూడా నడిచాయి. రైతు ఉద్యమ పోషణకు కూడా రైతువాణి తోడ్పడేది. కొరటాల రైతుసంఘం కార్యదర్శిగా రిలీవ్ అయి నేను రైతుసంఘం బాధ్యతలు తీసుకునే మధ్యకాలంలో రైతువాణి బాధ్యతలు చేపట్టాను. ఇది మినహా నాకు వేరే అనుభవం లేదు. అయినా ఆనాడున్నటువంటి పరిస్థితుల్లో కా|| మోటూరు హనుమంతరావు వృద్ధాప్యం దృష్ట్యా మరో ప్రత్యామ్నాయం కోసం పార్టీ పరిశీలిస్తున్న సమయంలో కొరటాల నా పేరు సూచించారు. మొదట్లో నాకు ఇష్టం లేకపోయినా ఆయనిచ్చిన విశ్వాసంతోనే బాధ్యతలు స్వీకరించాను. సంపాదకుడిగా పనిచేసిన ఐదేళ్ళ కాలంలోనే ఎన్నో ప్రయోగాలు చేశాము. వాటన్నింటి వెనక కా|| కొరటాల ప్రోత్సాహం, మద్దతు ప్రధానమైన కారణం. 2005 చివర్లో నేను ఢిల్లీకి మకాం మార్చిన తరువాత కూడా ఆయనతో వ్యక్తిగత సంబంధాలు కొనసాగాయి. తర్వాత అనతికాలంలోనే ఆయన చనిపోవడం అత్యంత బాధాకరం. ఆయన శతజయంతి సందర్భంగా జ్ఞాపకాలు నెమరువేసుకొని విప్లవోద్యమానికి అంకితమై పని చేసేందుకు ఆయన స్ఫూర్తి ఈ తరానికి ఎంతగానో తోడ్పడుతుంది.

/ వ్యాసకర్త సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి /

★

న్యాయమూర్తులు - రాజకీయ ఎంపికల ప్రభావం



తెలకపల్లి రవి

శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ మూడు విభాగాలనీ, వీటి మధ్య స్పష్టమైన పని విభజన వుంటుందని మనం నిరంతరం వింటాం. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలు పాలన చేస్తాయి. వారు నియమించిన అధికారులు యంత్రాంగాన్ని నడిపిస్తారు. వీటి పని తీరును, చేసే శాసనాలనూ నిర్ణయాలను అవసరమైనప్పుడు సమస్య వచ్చినపుడు కోర్టులు సమీక్షిస్తాయి. ప్రైవేటు రంగంలోని మీడియాను ఫోర్త్ ఎస్టేట్ (నాలుగో స్తంభం) అని అందుకే అంటుంటారు గాని అది వ్యవహారంలోనే. ఎందుకంటే మిగిలిన మూడు వ్యవస్థలూ రాజ్యాంగ నిబంధనల పరిధిలోనే పని చేయవలసి వుంటుంది. ఆ రాజ్యాంగం ప్రకారం ఏది సరైంది, ఏది కాదు అని భాష్యం చెప్పేది మాత్రం అంతిమంగా న్యాయస్థానాలే. అంటే హైకోర్టు, సుప్రీం కోర్టులే. వీటినే ఉన్నత అత్యున్నత న్యాయస్థానాలంటారందుకే. మిగిలిన విభాగాలు రాజకీయాలతో నడుస్తుంటాయనీ, న్యాయవ్యవస్థ అందుకు అతీతంగా వుంటుందని ఒక భావన నిరంతరం ప్రచారం చేస్తుంటారు. నిజానికి న్యాయవ్యవస్థ కూడా అప్పుడున్న రాజకీయార్థిక వ్యవస్థ పరిధిలోనే నడుస్తుందనేది సత్యం, చట్టం వ్యవస్థపై ఆధారపడి వుంటుంది గాని వ్యవస్థ చట్టంపై ఆధారపడి వుండదనేది కారల్‌మార్క్స్ స్పష్టీకరించిన సత్యం. అందుకే మన కోర్టులలో ప్రైవేటీకరణనూ, కార్మికుల హక్కులనూ గాక యజమానుల, పెట్టుబడిదారుల ప్రయోజనాలకే ఎక్కువ రక్షణ లభిస్తుంటుంది. ప్రాథమిక హక్కులపై పాలకుల దాడి జరిగితే భిన్నమైన తీర్పులు వస్తుంటాయి. ఇదేగాక కీలక సమస్యలపై వాటి నిర్ణయాలు, నిర్దేశాలు పరిణామాలను ప్రభావితం చేస్తుంటాయి. ఈ సమయంలోనే మన దేశంలో చూస్తే ఆర్టికల్ 370 రద్దు, మణిపూర్ మంటలు, మందిరాల సమస్యలు, పౌరసత్వ సవరణ చట్టం, ఫిరాయింపు నిరోధక చట్టం, సనాతన వివాదం నుంచి కొందరు నాయకులపైన కేసుల దాకా సుప్రీంకోర్టు ముందే వున్నాయి. వివిధ హైకోర్టుల ముందు కూడా చాలా కేసులు నడుస్తున్నాయి. తెలంగాణలో ముగ్గురు శాసనసభ్యుల సభ్యత్వం చెల్లదని దిగువ కోర్టులు తీర్పులు ఇస్తే సుప్రీం కోర్టు కొట్టివేసింది. ఎ.పి లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు-అవినీతి ఆరోపణల కేసు కూడా అక్కడే వుంది. రాజధాని విషయం కూడా తేలవలసి వుంది. తెలంగాణ ముఖ్యమంత్రి కెసిఆర్ కుమార్తె ఎంఎల్‌సి కవితపై ఇడి విచారణ కేసు వంటివి కూడా సుప్రీం ముందే వున్నాయి. ఈ కేసులలో తీర్పులు, ఆదేశాలు దేశ పరిణామాలను ఎంతగానో ప్రభావితం చేస్తాయి. కనుక కోర్టుల నిర్ణయాలు ఇంతగా దేశాన్ని ప్రభావితం చేస్తుంటే న్యాయవ్యవస్థకూ రాజకీయాలను సంబంధం లేదని చెప్పడం సరైందేనా?

> 'రాజకీయాలు న్యాయవ్యవస్థ పని తీరు ఒకదానితో ఒకటి అంతకంతకూ కలగాపులగమవుతోంది. చాలా సందర్భాల్లో రాజకీయ సమస్యలే న్యాయ సమస్యలుగా కోర్టుల ముందుకు వస్తున్నాయి. జడ్జిలు రాజకీయ ఎంపికలు చేసుకోవలసి వస్తుంది. వారు తాము తటస్థులమని అనుకోవచ్చు. కాని ఈ రెండు వ్యవస్థల పని కోరుకున్నంత విడివిడిగా వుండదు. మనం, ఏ బట్టలు ధరించాలి, ఏ ఆహారం తినాలి, ఏం మాట్లాడాలి, ఇవన్నీ ఇప్పుడు రాజ్యాంగ సమస్యలైపోతున్నాయి. దాంతో జడ్జిలు కూడా ఏదో ఒక దాన్ని ఎంచుకోవలసి వస్తుంది. ఆ ఎంపిక బహిరంగంగానే జరుగుతుంది. జడ్జిలు ఎక్కడి నుంచి వస్తారు? వారు ఖచ్చితమైన అభిప్రాయాలతోనే వుంటారు. చాలా రాజకీయ సమస్యలు లీగల్ ముసుగు వేసుకుని కోర్టుల ముందుకు వస్తాయి.
>
> **- జస్టిస్ మురళీధర్**



లీగల్ ముసుగులో రాజకీయాలు

న్యాయమూర్తులు రాజకీయాలకూ ప్రజా జీవితానికి దూరంగా వుంటారు. మీడియాతో మాట్లాడరు. కోర్టులో తప్ప మరెక్కడా వ్యాఖ్యానాలు చేయరు. న్యాయస్థానంలో వారు చేసే వ్యాఖ్యలకు రాజ్యాంగ రక్షణ వుంటుంది. ఇక అప్పుడప్పుడూ కొందరు నోరు జారి లేదా భావాలు దాచుకోలేక చేసే తిరోగామి వ్యాఖ్యలు, వ్యక్తిగత పొగడ్తలు వివాదాలకు కూడా దారి తీస్తుంటాయి. అన్నిటినీ మించి వారి తీర్పులు మాత్రం ఈ విషయాలపై దిశా నిర్దేశం చేస్తాయి. మంచి చెడ్డలు నిర్దేశిస్తాయి. అలాంటి కీలకపాత్ర వహించే వ్యవస్థ సారథులైన న్యాయమూర్తులు రాజకీయ అవగాహన లేదా అంచనా లేకుండా పని చేయగలరా? కేవలం నిర్జీవమైన నిబంధనలే వారిని నడిపిస్తాయా? ఈ ప్రశ్న సామాన్యులను వేధిస్తూనే వుంటుంది.

దేశ వ్యాపితంగానే కొందరు న్యాయమూర్తుల గురించి బహిరంగ విమర్శలు, వ్యాఖ్యలు వినిపిస్తుంటాయి. స్వయంగా అత్యున్నత న్యాయస్థానంలో ప్రధాన న్యాయమూర్తులుగా వ్యవహరించిన వారే పదవీ విరమణ వెంటనే రాజకీయ పదవులు తీసుకోవడం కూడా విమర్శలకు కారణమవుతుంటుంది. వ్యక్తిగతంగా మరికొందరు ఆరోపణలు మూటగట్టుకుంటారు. ఇవన్నీ ఇప్పుడు సర్వసాధారణమైపోయాయి. ఇవన్నీ ఒక ఎత్తు అయితే అసలు వృత్తిగతంగానే న్యాయమూర్తులు రాజకీయాలకు అతీతంగా వ్యవహరిస్తారా? పరిగణనలోకి తీసుకోరా? ఈ ప్రశ్నలపై ఈ మధ్య ఆసక్తికరమైన చర్చ జరిగింది. ప్రఖ్యాత లీగల్ పాత్రికేయుడైన గౌతం భాటియా రాసిన 'అన్ సీల్డ్ కవర్స్' (అతికించని వర్తమానాలు) పుస్తకం విడుదల అందుకు వేదికైంది. తర్వాత వచ్చిన సమీక్షలూ అదే అంశాన్ని స్పృశించాయి. ఒరిస్సా హైకోర్టు మాజీ సి.జె జస్టిస్ మురళీధర్ ఈ సభలో కీలకోపన్యాసం చేస్తూ న్యాయమూర్తుల నిర్ణయాలను రాజకీయాలు కూడా ప్రభావితం చేస్తుంటాయని స్పష్టం చేశారు. రాజకీయాలు న్యాయవ్యవస్థ పని తీరు ఒకదానితో ఒకటి అంతకంతకూ కలగాపులగమవుతోందని వ్యాఖ్యానించారు. "చాలా సందర్భాల్లో రాజకీయ సమస్యలే న్యాయ సమస్యలుగా కోర్టుల ముందుకు వస్తున్నాయి. జడ్జిలు రాజకీయ ఎంపికలు చేసుకోవలసి వస్తుంది. వారు తాము తటస్థులమని అనుకోవచ్చు. కాని ఈ రెండు వ్యవస్థల పని కోరుకున్నంత విడివిడిగా వుండదు. మనం, ఏ బట్టలు ధరించాలి, ఏ ఆహారం తినాలి, ఏం మాట్లాడాలి, ఇవన్నీ ఇప్పుడు రాజ్యాంగ సమస్యలైపోతున్నాయి. దాంతో జడ్జిలు కూడా ఏదో ఒక దాన్ని ఎంచుకోవలసి వస్తుంది. ఆ ఎంపిక బహిరంగంగానే జరుగుతుంది" అని ఆయన స్పష్టం చేశారు. "జడ్జిలు ఎక్కడి ఎక్కడ నుంచి వస్తారు? వారు ఖచ్చితమైన అభిప్రాయాలతోనే వుంటారని గౌతం భాటియా పుస్తకం మనకు చెబుతుంది. చాలా రాజకీయ సమస్యలు లీగల్ ముసుగు వేసుకుని కోర్టుల ముందుకు వస్తాయి. ఉదాహరణకు హిజాబ్ సమస్య వుంది. ఈ రోజు (సెప్టెంబర్14) రెండు వార్తాకథనాలున్నాయి. ఒకటి లక్ష ద్వీప్‌లో ఆహార స్వేచ్ఛకు సంబంధించింది, మరొకటి కేరళలోని ఒక దేవాలయంలో పతంగులు ఎగరేయడానికి సంబంధించింది" అని ఆయన అన్నారు.

న్యాయస్థానాల వార్తలకు కత్తెర

నిజానికి జస్టిస్ మురళీధర్ సీనియారిటీ చాలా ఎక్కువైనప్పటికీ సుప్రీం కోర్టు న్యాయ మూర్తిగా నియమించబడకుండా నరేంద్ర మోడీ ప్రభుత్వమే అడ్డుపడిందని దేశమంతటికీ తెలుసు. పరస్పరామోదంతో స్వలింగ సంపర్కాన్ని నేరంగా చూడరాదని ఆయన తీర్పునిచ్చారు. కాంగ్రెస్ నాయకుడు సజ్జన్ కుమార్‌ను 1984 సిక్కు హత్యాకాండ కేసులో శిక్ష విధించడం, యుపి లోని హష్మీపూర్‌లో 38 మంది ముస్లిముల హత్యకు కారణమైన 16 మంది పోలీసులకు శిక్ష విధింపు, ఎల్గార్ పరిషత్ కేసులో గౌతం నౌలఖాకు బెయిలు మంజూరు వంటి ఆయన తీర్పులు ఆయన సంచలనాల్లో కొన్ని. ఆయన ఆగస్టు 7న పదవీ విరమణ చేసినప్పుడు మాజీ సీనియర్ న్యాయమూర్తులు చాలామంది సంయుక్త ప్రకటనలో ఆవేదన వెలిబుచ్చారు కూడా. ఈ విధమైన నేపథ్యం వున్న న్యాయమూర్తి గనకనే ఇంత నిష్కర్షగా మాట్లాడగలిగారు. ఇప్పుడు మీడియా న్యాయవార్తల రిపోర్టింగు సమస్యల గురించి కూడా ఆయన మాట్లాడింది చూస్తే మరింత ఆశ్చర్యం కలిగిస్తుంది. చాలా వార్తలు మీడియా యాజమాన్యాలు ముందే ఆపేస్తుంటాయి. మరోవైపు ఎంపిక చేసిన వారికే అనుకున్నవి లీక్ చేస్తుంటారు. ఆపేసిన వార్తలతో ఒక సంపుటం గనక ప్రచురిస్తే ఎంత సమాచారం నిలిపివేయబడుతుందో అర్థమవుతుంది. ఇన్ని మల్లగుల్లాల మధ్య మన పత్రికలు లేదా ఛానళ్ల వార్తలలో వాస్తవికత ఎంత మిగులుతుందనేది ఆలోచించుకోవలసిందే! నిజానికి కోర్టు గదులలో జరిగే తతంగంపై గౌతం భాటియా చాలా సమాచారం ఇచ్చారు.

2013-2022 మధ్య కాలంలో న్యాయ వ్యవస్థ తీరుపైన ఈ పుస్తకంలో వ్యాసాలుంటాయి. ఈ కాలంలో ఎన్ని కేసులు ఏ స్థితిని ఎదుర్కొన్నాయో ఆయన రాశారు. వ్యక్తిగత గోప్యత (ప్రైవసీ), స్వలింగ వివాహాలు, జాతీయ బయోమెట్రిక్ గుర్తింపు వ్యవస్థ, హిజాబ్ నిషేధం, రిజర్వేషన్లతో సహా ఎన్నో సమస్యలు పతాక శీర్షికలకు వచ్చాయి. తీవ్ర ప్రభావం చూపే కేసులను సకాలంలో విచారించేందుకు సుప్రీం కోర్టు నిరాకరించింది. ప్రధాన న్యాయమూర్తి అధికారాలు, కీలకమైన ప్రాథమిక హక్కుల రక్షణలో అధికార వర్గానికి నిర్దేశం చేసేందుకు సిద్ధపడక పోవడం వంటివన్నీ న్యాయవ్యవస్థ స్వాతంత్ర్యం గురించి క్లిష్టమైన ప్రశ్నలు లేవనెత్తాయి. వేళ్లూనుకుపోతున్న పాలక వర్గం, న్యాయవ్యవస్థ మధ్య సంబంధాల గురించి తీవ్ర సందేహాలు కలిగించాయి అని ఆయనంటారు. హక్కులకు సంబంధించిన మొదటి భాగంలోనే భాటియా సామాజిక న్యాయం రిజర్వేషన్లు శరణార్థులు, 370వ అధికరణం వంటి అంశాలు చర్చించారు. రెండో భాగంలో ఫెడరలిజం, ఫిరాయింపుల నిరోధ చట్టం అన్వయం వంటివి తీసుకున్నారు.

ప్రధాన న్యాయమూర్తుల తీరు

మూడో భాగంలో న్యాయవవస్థ, ప్రత్యేకించి తను చూసిన కొందరు ప్రధాన న్యాయమూర్తుల తీరుతెన్నులను విశ్లేషించారు. ప్రధాన న్యాయమూర్తులుగా పనిచేసిన జెఎస్. ఖెహర్, దీపక్ మిశ్రా, రంజన్ గొగోయ్, శరద్ బాబ్డే, ఎన్‌వి రమణ, యుయు లలిత్‌ల కాలాన్ని పరిశీలించారు. జస్టిస్ ఖాన్ విల్కర్ మానవ హక్కుల విషయంలో వ్యవహరించిన తీరును విమర్శనాపాత్రంగా తెలిపారు. ఉపా చట్టం కింద ఎవరినైనా చట్ట వ్యతిరేకిగా ముద్ర వేసి ప్రాసిక్యూషన్ మోపిన కేసులో నిర్దోషిత్వం నిరూపించుకునే బాధ్యత వారిపైనే మోపడం దారుణమైన విషయం. జహూర్ వతాలి కేసులో ఢిల్లీ హైకోర్టు అందుకే కేసు మూలాల్లోకి వెళ్లి అది లోపభూయిష్టంగా వుందని తేల్చింది. కాని జస్టిస్ ఖాన్‌విల్కర్ దీన్ని తప్పుపట్టారు. అంత లోతుల్లోకి వెళ్లవలసింది కాదని తీర్పునిచ్చారు. మనీ లాండరింగ్ కేసులో తప్పుగా వున్న ప్రతి అంశాన్ని ఆయన సమర్థించారు. పోలీసుల హత్యాకాండపై నిరసన తెల్పినందుకు ఆదివాసులకు శిక్ష వేశారు. గుజరాత్ మత మారణకాండపై సిట్ నివేదికను సవాలు చేసినందుకు గాను తీస్తా సెతల్వాద్ పైకి పోలీసులు విరుచుకుపడటానికి కారకులైనారు. ఇన్ని కారణాల వల్ల ఖాన్ విల్కర్‌ను భాటియా అతి తీవ్రంగా విమర్శించారు. 'మీరు కోర్టుకు రావడానికి స్వాతంత్ర్యం ఇవ్వగలను గాని వచ్చిన తర్వాత స్వతంత్రం వుంటుందా లేదా గ్యారంటీ ఇవ్వలేను...'అన్న ఆయన వాక్యాన్ని 32వ అధికరణానికి ఎసరు పెట్టడం వంటిదిగానే పరిగణించారు. జస్టిస్ లలిత్ హయాంలో జిఎన్ సాయిబాబాకు ముంబయి హైకోర్టు ఉపశమనం కలిగిస్తే జస్టిస్ లలిత్ రాత్రికి రాత్రే దాన్ని తిరగదోడారు. ఇక జస్టిస్ జిఎం షా విషయానికి వస్తే ఆయన సాయిబాబాను మళ్లీ జైలుకే పంపేందుకు హడావుడిగా ఆదేశాలిచ్చారు. మొత్తం మీద ఈ పుస్తకం చదివితే న్యాయవ్యవస్థ వాస్తవ రూపం, దాని అంతర్గత రాజకీయాలు, అధినేతల ఒత్తిళ్లు అనేకం ప్రజల దృష్టికి రాకుండా పోతున్నాయనే పరమ సత్యం అవగతమవుతుంది.

★

కాంగ్రెస్ ఎంపీపై అస్సాం సిఎం భార్య పరువు నష్టం దావా

డిస్పూర్(అస్సాం) : ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్ట్‌లో అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మపై ఆరోపణలు చేసిన కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్‌పై.. హిమంత భార్య రినికి భూయాన్ శర్మ రూ.10 కోట్ల పరువునష్టం దావా వేశారు. ఈ కేసుపై సీనియర్ అడ్వకేట్ దేవజిత్ సైకియా పిటిఐకు తెలిపిన వివరాల మేరకు.. కామరూప్ సివిల్ జడ్జి కోర్టులో ఈ శుక్రవారం కేసు దాఖలైందని, ఈ నెల 26వ తేదీకి ఈ కేసు విచారణకు వస్తుందని తెలిపారు. ఎంపీ గౌరవ్ గొగొయ్ వరుస ట్వీట్ల ఆధారంగా ఈ పరువునష్టం దావా వేసినట్లు సైకియా పేర్కొన్నారు. తన క్లయింట్ శర్మకు చెందిన ప్రైడ్ ఈస్ట్ ఎంటర్టైన్‌మెంట్స్‌కు సంబంధించి సోషల్ మీడియాతో ఎంపీ గొగోయ్ చెప్పిన విషయాలు వాస్తవాలు కాదన్నారు. గువాహటి డిజిటల్ మీడియాలో ఒకటైన ది క్రాస్ కరెంట్ రాసిన కథనం ప్రకారం... నగౌన్ జిల్లాలోని దరిగజి గ్రామంలో .. 50 భిగాలకు పైగా.. అంటే సుమారు 17 ఎకరాల సాగుభూములు ప్రైడ్ ఈస్ట్ ఎంటర్టైన్ మెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అయిన సీఎం హిమంత బిశ్వ శర్మ భార్య రినికి భూయాన్ కంపెనీ అవసరాల నిమిత్తం కొనుగోలు చేశారని ఆ వార్తలో రాశారు. దాని ఆధారంగానే ఎంపీ గొగోయ్ ఫుడ్ ప్రాసెసింగ్ ప్రాజెక్టులో అవినీతిపై వరుస ట్వీట్లు చేస్తూ వస్తున్నారు.

హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలులో భారీగా మంటలు

అహ్మదాబాద్ : గుజరాత్‌లోని తిరుచిరాపల్లి-శ్రీ గంగానగర్ మధ్య నడిచే హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ రైలులో శనివారం మంటలు చెలరేగాయి. ఈ ఘటనకు సంబంధించిన వీడియో బయటకు వచ్చింది. ఈ ఘటన గుజరాత్‌లోని వల్సాద్ జిల్లాలో జరిగిందని, ప్రాణ నష్టం జరగలేదని అధికారులు తెలిపారు. రైలు ప్రమాద ఘటనపై పశ్చిమ రైల్వేకు చెందిన సిపిఆర్ఒ సుమిత్ ఠాకూర్ మాట్లాడుతూ.. రైల్ నంబర్ 22498 యొక్క పవర్ కార్/బ్రేక్ వ్యాన్ కోచ్‌లో మంటలు కనిపించాయని తెలిపారు. దీంతో వెంటనే పక్కనే ఉన్న కోచ్‌లోని ప్రయాణికులందరినీ సురక్షితంగా దించేశారని పేర్కొన్నారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం చోటుచేసుకున్నట్టుగా అధికారులు అనుమానిస్తున్నారు.

థాయి మూవ్ ఫార్వర్డ్ పార్టీ నేతగా చైతావత్ ఎన్నిక

బ్యాంకాక్ : ఈ ఏడాది ఎన్నికల్లో అత్యధిక సీట్లు గెలుచుకున్న థాయి రిఫార్మిస్ట్ రాజకీయ పార్టీ శనివారం తాత్కాలిక నేతను నియమించింది. ప్రధాన మంత్రి అభ్యర్థి పీటా లిమ్‌జారోనెట్ పార్టీ అధినేతగా రాజీనామా చేసిన వారం తర్వాత ఈ తాత్కాలిక నేత నియామకం జరిగింది. దాదాపు దశాబ్ద కాలంగా మిలటరీ సంబంధిత పార్టీల పాలనతో విసిగిపోయిన థాయి ఓటర్లు మేలో జరిగిన ఎన్నికల్లో మూవ్ ఫార్వర్డ్ పార్టీకి మద్దతునిచ్చారు. పీటా ప్రధాన మంత్రి పదవిని చేపట్టే ప్రయత్నాన్ని కన్జర్వేటివ్‌లు భగ్నం చేయడం, ఎంపీగా ఆయనను సస్పెండ్ చేయడంతో సుదీర్ఘ రాజకీయ ప్రతిష్టంభన నెలకొంది. ఆ తర్వాత మూవ్ ఫార్వర్డ్ పార్టీ ప్రతిపక్షంలో కూర్చోగా, ఎన్నికల్లో రెండో స్థానంలో వచ్చిన ఫెయూ థాయి కొన్ని మిలటరీ అనుకూల పార్టీలతో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ప్రస్తుత నిబంధనల ప్రకారం ప్రతిపక్షనేత ఎంపిగా వుండాలి.

కెజిపూడి ప్రాంతంలో పులి సంచారం

ప్రజాశక్తి-వేపాడ (విజయనగరం జిల్లా)

మండలంలోని కెజి పూడి రెవెన్యూ పరిధిలో శనివారం సాయంత్రం పులి రావాడ దేముడు అను రైతుపాకలో దూడను హతమార్చింది. రైతు సమాచారం ఇవ్వడంతో అటవీ శాఖ అధికారి డిఆర్ఒ రవికుమార్, ఫారెస్టు గార్డు సూర్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. పరిసర ప్రాంతంలోనే పులి సంచరిస్తున్నట్లు అధికారులు గుర్తించి గ్రామస్తులతో సమాచారం ఇచ్చారు. పరిసర ప్రాంతాలలో జాగ్రత్తగా ఉండాలని సాయంత్రం వేళల్లో ఆరు బయట తిరగడం గాని. తోటల వైపు వెళ్లడం గాని చేయకూడదని తెలిపారు. పులి సంచారం సమాచారం తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

IKF FINANCE

ఐకెఎఫ్ ఫైనాన్స్ లిమిటెడ్

హెడ్ ఆఫీసు: 40-1-144, కార్పొరేట్ సెంటర్, ఎం.జి.రోడ్, విజయవాడ-520 010. ఫోన్ నం: 0866-2474644.

డిమాండ్ నోటీసు

ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, రుణగ్రహీతలు/హామీదారులు **మెసర్స్ అమరావతి ఆటో ఫైనాన్స్ ప్రతినిధియైన దీని మేనేజింగ్ పార్టనర్ శ్రీ కుర్ర గంగాధర రావు, మరియు శ్రీ జక్కంపూడి రవీంద్ర కుమార్ తండ్రి వెంకయ్య చౌదరి, పార్టనర్ మెసర్స్ అమరావతి ఆటో ఫైనాన్స్** అనువారు ఐకెఎఫ్ ఫైనాన్స్ లిమిటెడ్ నుండి పొందిన రుణాల సదుపాయాలను అసలు మరియు వడ్డీని తిరిగి చెల్లించుటలో డిఫాల్టిచెందారు మరియు రుణాలు **నాన్-పెర్ఫామింగ్ అసెట్ (ఎన్‌పిఏ)**గా వర్గీకరించబడినవి. సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13(2) క్రింద వారికి వారి గతంలో తెలిసిన చిరునామా పై నోటీసులు జారీచేయబడినవి, కాని అవి వారికి బట్వాడా కాకుండానే వెనుదిరిగినవి అట్టి పరిస్థితుల్లో ఈ బహిరంగ ప్రకటన రూపేనా వారికి తెలియజేయబడుచున్నది.

రుణగ్రహీతల/ హామీదారుల పేరు: (1) మెసర్స్ అమరావతి ఆటో ఫైనాన్స్, ప్రతినిధియైన దీని మేనేజింగ్ పార్టనర్ శ్రీ కుర్ర గంగాధర రావు, డోర్ నం.33-12-9, గ్రౌండ్ ఫ్లోర్, బోయపాటివారి స్ట్రీట్, సీతారాంపురం, విజయవాడ, నివాసం: డోర్ నం.2-78, పెద్ద బజార్, కంచికచర్ల పోస్టు& మండలం, ఎన్‌టిఆర్ జిల్లా-521180. **(2) శ్రీ జక్కంపూడి రవీంద్ర కుమార్ తండ్రి వెంకయ్య చౌదరి,** పార్టనర్ మెసర్స్ అమరావతి ఆటో ఫైనాన్స్, డోర్ నం.26-5-14, 2వ అంతస్తు, జి.ఎస్. రాజు రోడ్, గాంధీనగర్, విజయవాడ-520003.

బకాయి మొత్తాలు (31.08.2023 నాటికి): రూ.27,66,939/- (రూపాయలు ఇరువై ఏడు లక్షల అరవై ఆరు వేల తొమ్మిది వందల ముప్పై తొమ్మిది మాత్రమే)

నోటీసు తేది: 08.09.2023	ఖాతాలు ఎన్‌పిఏ గా వర్గీకరించబడినవి

స్వాధీనంచేసుకొను ఆస్తుల వివరాలు/ సెక్యూర్డ్ అసెట్ చిరునామా:

జిల్లా రిజిస్ట్రార్ ఏరియా విజయవాడ, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఏరియా, విజయవాడ టౌన్, విద్యాధరపురం గ్రామం భాగం వద్దగల ఆర్.ఎస్.నం.4/2, బ్లాక్ నం.7, ఎన్.టి.ఎస్.నం.1/1, రెవెన్యూ వార్డు నం.1 లోని పూర్తి విస్తీర్ణం 250చ.గ.లకుగాను 125చ.గ.లు లేదా 104.51చ.మీ.ల ఖాళీ సైటు యొక్క మొత్తం భాగం. సరిహద్దులు: **తూర్పు:** శ్రీ సుందరెషన్ యొక్క ఆస్తి, **దక్షిణం:** షర్ఫొద్దిన్ స్ట్రీట్, **పడమర:** రోడ్డు, **ఉత్తరం:** రాజ గోపాల్ యొక్క ఆస్తి.

నోటీసు మీకు అందే విధంగా చర్యలు తీసుకోబడుచున్నవి. పై రుణగ్రహీతలు మరియు/ లేదా వారి హామీదారులును ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజుల్లోగా బకాయి మొత్తాలను చెల్లించవలసిందిగా కోరబడుచున్నది, విఫలం చెందిన ఏదైతే, సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (4) క్రింద ఈ నోటీసు తేది నుండి 60 రోజులు ముగిసిన తరువాత తదుపరి చర్యలు తీసుకొనుట జరుగుతుంది. సెక్యూర్డ్ అసెట్స్‌ను విడిపించుకొనుటకు అందుబాటులోగల సమయంకు సంబంధించి, చట్టం యొక్క సెక్షన్ 13 యొక్క సబ్-సెక్షన్ (8) యొక్క నియమాలపై రుణగ్రహీతలు శ్రద్దవహించవలసిందిగా కోరబడుచున్నది.

ప్రదేశం: విజయవాడ, తేది: 23.09.2023 సం/- అధీకృత అధికారి, ఐకెఎఫ్ ఫైనాన్స్ లిమిటెడ్

CanFinHomes Ltd (Sponsor: CANARA BANK) HOME LOANS ◆ DEPOSITS Translating Dreams into Reality

కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్

బ్రాంచి చిరునామా : 40-5-19/17, 1వ అంతస్తు, సిద్ధార్థ కాలేజి బస్టాప్ దగ్గర, మొగల్‌రాజపురం, విజయవాడ - 520010. సెల్ : 7625079119

Email: vijaywada@canfinhomes.com. CIN:L8511OKA1987PLC008699

స్థిరాస్థి అమ్మకం కొరకు ప్రకటన

అనుబంధం IV-A రూల్ 9(1) కి సంబంధించిన నిబంధనలను చూడండి (సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 మరియు సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని రూల్ 9 (1) సదుపాయము క్రింద స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకపు నోటీసు

ఇందుమూలంగా సాధారణ ప్రజానీకానికి మరియు ముఖ్యంగా ఋణగ్రహీత (లు) మరియు హామీదారు (లు) ఈ దిగువ తెలిపిన స్థిరాస్తులు తనఖా /కుదువ పెట్టిన క్రింద తెలిపిన స్థిరాస్తిని కేన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్, విజయవాడ బ్రాంచి యొక్క అధీకృత అధికారి భౌతికంగా స్వాధీనం చేసుకొని కేన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్ కు చెందిన బకాయి మొత్తమును **ఋణగ్రహీత : 1) శ్రీ మంగపతి రావు సనక (దరఖాస్తుదారు), 2) శ్రీ విటల్ రంగారావు సనక (సహ దరఖాస్తుదారు), 3) శ్రీ సనక పవన్ కుమార్ (హామీదారు)** ల నుండి తేది : 02-08-2022 నాటికి భవిష్య వడ్డీ మరియు ఇతర ఛార్జీలతో కలుపుకొని **రూ. 22,03,624 (అక్షరాలా ఇరవై రెండు లక్షల మూడు వేల ఆరు వందల ఇరవై నాలుగు రూపాయలు మాత్రమే)** వసూలు చేసుకొనుటకు క్రింది తెలిపిన ఆస్తిని **"ఎక్కడ ఎలా ఉన్నదో, ఏది ఎలా ఉన్నదో మరియు ఏదైతే ఎలా ఉన్నదో అది అలానే", "అక్కడ** అనే ప్రాతిపదికన **తేది 18-10-2023న అమ్ముటకు** నిర్ణయించడమైనది. సదరు ఆస్తి యొక్క **రిజర్వు ధర రూ. 19,00,000/- (అక్షరాలా పంథొమ్మిది లక్షల రూపాయలు మాత్రమే) మరియు ధరావత్తు సొమ్ము రూ. 1,90,000/- (అక్షరాలా ఒక లక్ష తొంభైవేల రూపాయలు మాత్రమే)** గా నిర్ణయించడమైనది.

స్థిరాస్తి వివరములు :

కృష్ణా జిల్లా, గుణదల సబ్ రిజిస్ట్రీ, విజయవాడ రూరల్, ప్రసాదంపాడు యొక్క సర్వే నెం. 77/1 లోని 295.16 చ।7గ॥లు విస్తీర్ణంలోని అవిభాజ్యమైన వాటాతో ఉన్న 27.50 చ।7గ॥లు విస్తీర్ణంలోని **"విజయదుర్గ రెసిడెన్సీ"** నందు ఫ్లాట్ నెం. ఎస్.3 తో గల రెండవ అంతస్తులోని ప్లింత్ ఏరియా 764 చ॥అ॥లు, కామన్ ఏరియా 95 చ॥అ॥లు మరియు కార్ పార్కింగ్ ఏరియా 80 చ॥అ॥లుతో గల నివాసయోగ్యమైన ఫ్లాట్ కలదు. **స్థలమునకు హద్దులు : తూర్పు :** పంచాయితీ బజారు - 33 అ॥, **దక్షిణం :** పంచాయితీ బజారు - 80.6 అ॥, **పడమర :** ఇతరుల ఆస్తి - 33అ॥, **ఉత్తరం :** చింతా సత్యనారాయణగారి ఆస్తి - 80 అ॥. **ఫ్లాట్ హద్దులు : తూర్పు :** కామన్ కారిడార్, **పడమర :** ఓపెన్ టు స్కై, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **ఉత్తరం :** ఓపెన్ టు స్కై,

ఋణభారములు : లేవు

అమ్మకం పూర్తి నియమములు మరియు నిబంధనలు కేన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్ వారి అధికారిక వెబ్‌సైట్ : (www.canfinhomes.com) నందు ఇవ్వబడినవి. దయచేసి ఈ క్రింది లింక్‌ను దర్శించండి http://www.canfinhomes.com/searchauction.aspx.

తేది : 23-09-2023 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : విజయవాడ కెన్‌ఫిన్ హోమ్స్ లిమిటెడ్

విద్యా బిల్లుకు వ్యతిరేకంగా నేపాల్‌లో టీచర్ల ఆందోళన

- మూతపడ్డ 29వేల ప్రభుత్వ పాఠశాలలు

ఖాట్మండులో టీచర్ల ఆందోళన

ఖాట్మండు : విద్యా సంస్కరణ బిల్లును వ్యతిరేకిస్తూ నేపాల్‌లో వేలాదిమంది ఉపాధ్యాయులు బుధవారం నుండి సమ్మెకు దిగారు. రాజధాని ఖాట్మండులో ప్రదర్శనలు నిర్వహించారు. మొత్తం పాఠశాలలు మూతపడ్డాయి. పార్లమెంట్ భవనం నుండి కీలక మంత్రిత్వ శాఖల కార్యాలయాలకు దారి తీసే ప్రధాన వీధిని దిగ్బంధిస్తూ టీచర్లు ప్రదర్శన నిర్వహించారు. పోలీసులు ముళ్ళ కంచె వేసి రోడ్డును ఎక్కడికక్కడ బ్లాక్ చేశారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలలను స్థానిక సంస్థల నియంత్రణ కిందకు తీసుకురావాలన్నది బిల్లులో ఒక నిబంధనగా వుంది. దీనిని టీచర్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రభుత్వం దిగిరాకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగానే టీచర్లు కూడా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోనే వుండాలి, వారిని స్థానిక నియంత్రణ కిందకు తీసుకురావద్దని బద్రి దుంగెల్ అనే నిరసనకారుడు పేర్కొన్నారు. ఇతర ఉద్యోగుల మాదిరిగానే తమకు కూడా సమాన వేతనం, హోదా, ఇతర సౌకర్యాలు, ప్రయోజనాలు అందాలన్నారు. టీచర్ల ఆందోళనతో మొత్తంగా 29వేల ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయి.

మూడో రోజుకు బక్సర్ పవర్ ప్లాంట్ నిరవధిక సమ్మె

- వేతనాల పెంపు, ఎనిమిది గంటల పనికి కార్మికుల డిమాండ్

పాట్నా: బీహార్‌లోని చౌసా గ్రామంలో నిర్మాణంలో ఉన్న బక్సర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్‌కు సంబంధించిన దాదాపు 3,000 మంది కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె మూడో రోజుకు చేరుకుంది. వేతనాలు పెంచాలనీ, ఎనిమిది గంటల పని మాత్రమే ఉండాలని కార్మికులు డిమాండ్ చేశారు. ఇక్కడ తక్కువ వేతనాలు, 12 గంటల పనిని నిరసిస్తూ కార్మికులు ఈనెల 21న ఆకస్మికంగా సమ్మెకు దిగారు. కార్మికులు శనివారం తమ నివాస కాలనీల్లో నిరసనకు దిగారు. "విద్యుత్ ప్లాంట్ అధికారులు, ఎల్ అండ్ టి, కాంట్రాక్టర్లు మా డిమాండ్లను నెరవేర్చడం గురించి మాకు రాతపూర్వక హామీ ఇస్తే తప్ప సమ్మెను, నిరసనను విరమించం' అని వర్కర్ లీడర్ గౌరవ్ రాయ్ తెలిపారు. 12 గంటలు పనిచేస్తున్నా కార్మికులకు 8 గంటలకే జీతాలు ఇస్తున్నారని, రిజిస్ట్రేషన్ చేయించుకోలేదని రాయ్ విమర్శించారు. "తాము ఎల్ అండ్ టి, దాని కాంట్రాక్టర్లచే నియమించబడిన కాంట్రాక్టు కార్మికులు" అని నిరసన తెలిపిన కార్మికుడు రాజు సింగ్ చెప్పారు.

ఈ ఏడాది ప్రారంభంలో వందలాది మంది రైతులు తమకు పరిహారం చెల్లించాలంటూ రోజుల తరబడి నిరసనలు చేపట్టారు. 660 మెగావాట్ల రెండు యూనిట్లను కలిగి ఉన్న 1,320 మెగావాట్ల ప్లాంట్‌ను 1,283 ఎకరాల్లో సట్లుజ్ జల్ విద్యుత్ నిగమ్‌కు చెందిన పూర్తి అనుబంధ సంస్థ అయిన ఎస్‌జెవీఎన్ థర్మల్ ప్రయివేటు లిమిటెడ్ నిర్మిస్తున్నది. రాష్ట్ర ఇంధన శాఖ అధికారుల సమాచారం ప్రకారం.. రెండో యూనిట్ నిర్మాణం కేంద్రం యొక్క అతిపెద్ద ప్రాజెక్ట్. అయితే, బక్సర్ ప్లాంటులోని కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలని యూనియన్లు సైతం మద్దతు తెలిపాయి.

ఎస్‌సి వర్గీకరణకు మద్దతివ్వొద్దు

- సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజాకు మాలమహానాడు విజ్ఞప్తి

న్యూఢిల్లీ : ఓటు బ్యాంక్ రాజకీయాల కోసమే ఎస్‌సి వర్గీకరణ చేయాలని చూస్తున్నారనీ, అలాంటి నిర్ణయాలకు మద్దతివ్వొద్దని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు జి. చెన్నయ్య జాతీయ పార్టీలకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం నాడిక్కడ సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజాను కలిసి వినతి పత్రం సమర్పించారు. అనంతరం చెన్నయ్య మాట్లాడుతూ ఉషా మెహ్రా కమిషన్ పేర్కొన్నట్టు తెలంగాణలో మాల, మాదిగల్లో ఎవరు అభివృద్ధి చెందారో శాస్త్రీయంగా అధ్యయనం చేసేందుకు జ్యూడిషియల్ కమిషన్ వేయాలని డిమాండ్ చేశారు.

డ్రైవింగ్ స్కూళ్లకు నోటీసులు : డిటిసి

ప్రజాశక్తి- విజయనగరం కోట

జిల్లాలో ఉన్న అన్ని డ్రైవింగ్ స్కూల్స్‌కు నోటీసులు జారీ చేసినట్లు డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ జిఆర్ రవీంద్రనాథ్ తెలిపారు. శనివారం తనను కలిసి ప్రజాశక్తితో మాట్లాడారు. జారీ చేసిన నోటీసుల ప్రకారం ఈ నెలాఖరులోగా ఆయా డ్రైవింగ్ స్కూల్స్‌లో నాన్ ట్రాన్స్‌పోర్టుగా తిప్పుతున్న వాహనాలను ట్రాన్స్‌పోర్టు వెహికల్స్‌గా మార్చుకోవాలని తెలిపారు. ప్రతి వెహికల్ పైన కచ్చితంగా ఆయా డ్రైవింగ్ స్కూల్స్ పేరు కచ్చితంగా పెట్టుకోవాలన్నారు. ఈ నోటీసులకు వారం రోజుల్లోగా కచ్చితంగా సమాధానం చెప్పాలని, లేదంటే డ్రైవింగ్ స్కూల్స్ లైసెన్సులను చెక్ చేసి రద్దుచేసేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. డ్రైవింగ్ స్కూల్స్ లైసెన్స్‌లు కూడా కచ్చితంగా పాటించాలని, లేదంటే వాటిని సీజ్ చేస్తామని తెలిపారు. విజయనగరం జిల్లా పరిధిలో 15స్కూల్స్‌కు గాను విజయనగరంలో 9, విజయనగరం మండల పరిధిలో చెల్లూరులో ఒకటి, బొబ్బిలిలో మూడు, నెల్లిమర్ల ఒకటి, గంట్యాడలో ఒకటి ఉన్నాయని తెలిపారు. ఆయనతో పాటు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎవి రమణ ఉన్నారు.

ఏలూరులో భారీ వర్షం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరులో శనివారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం చల్లబడి కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ, ఉక్కపోతగా ఉన్న వాతావ రణంలో ఒక్కసారిగా మార్పులు చోటుచేసుకుని పిడుగులతో భారీ వర్షం కురిసింది. దీంతో జనజీవనం స్తంభించింది. పాఠశాలలు, కళాశాలలు వదిలే సమయం కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఉద్యోగులు, వ్యాపారులు అవస్థలు పడ్డారు. ముఖ్యంగా రోడ్డు పక్కన వ్యాపారం చేసుకునే వాళ్లు కనీసం వారి సామగ్రిని సర్దుకునే అవకాశం కూడా లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

ఆళ్లగడ్డల్లో భారీ వర్షం

- పొంగి ప్రవహించిన వాగులు, వంకలు
- నీట మునిగిన పంటలు - దెబ్బతిన్న రహదారులు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ/రుద్రవరం

ఆళ్లగడ్డ, రుద్రవరం మండలాల్లో శనివారం తెల్లవారుజామున ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో పల్లపు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ఆళ్లగడ్డ పట్టణంలోని ఎద్దుల పాపమ్మ కళాశాల మైదానం, ఆర్‌టిసి గ్యారేజ్ వద్ద నీరు చేరాయి. రైతులు సాగు చేసిన మిరప, వరి, మినుము, పత్తి, జొన్న పంటలు నీట మునిగాయి. రైతులు కోత కోసి ఆరబోసుకున్న మొక్కజొన్న ధాన్యం తడిచిపోయింది. ఉయ్యాలవాడలో 6.5 సె.మీ, ఆళ్లగడ్డలో 6 సె.మీ వర్షపాతం నమోదయింది. ఆళ్లగడ్డ ప్రాంతంలోని వక్కిలేరు, కుందు, భవనాసి నదులకు భారీగా నీరు వచ్చి చేరింది. అలాగే గండ్లేరు రిజర్వాయర్ నీటితో కళకళలాడుతుంది. అహోబిలం నల్లమల అటవీ ప్రాంతంలో వర్షపు నీరు రోడ్లపై ప్రవహించాయి. రుద్రవరం మండలంలోని పలు గ్రామాలలో కురిసిన భారీ వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. దాదాపు 40.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. తెల్లవారుజాము నుండి ఉదయం వరకు రుద్రవరం నుండి ఆలమూరు పరిధిలోని పలు గ్రామాలలో భారీ వర్షం కురవడంతో వాగులు వంకలు పొంగిపొర్లాయి. ఆలమూరు గ్రామ సమీపంలోని అట్టెడ వాగు పొంగి ప్రవహించింది. ఆర్ నాగులవరం వద్ద వాగు ఉధృతంగా ప్రవహించి రోడ్డుపై వర్షపు నీరు ప్రవహించడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. తిప్పారెడ్డిపల్లె గ్రామం వద్ద రోడ్డుపై నీరు ఉధృతంగా ప్రవహించింది. దీంతో ఉదయం నుండి మధ్యాహ్నం వరకు వాహన రాకపోకులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఆలమూరు, చిత్రేణిపల్లె, ముకుందాపురం, హరినగరం, తండా, తిమ్మనపల్లె, నరసాపురం, ముత్తలూరు, తిప్పారెడ్డిపల్లె, లింగందిన్నె, ఆర్ నాగులవరం, రెడ్డి పల్లె, రుద్రవరం గ్రామాల పరిధిలో రైతులు సాగుచేసిన మిరప, పత్తి ,మినుము ,వరి జొన్న పంటలు నీటిమునిగాయి. మొక్కజొన్న పంట నేల వాలింది. భారీ వర్షం కారణంగా రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో రుద్రవరం నుండి దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

సనాతన ధర్మంపై మాట్లాడినందుకే... ఉదయనిధి స్టాలిన్‌ను టార్గెట్ చేశారు

- కమల్‌హాసన్

కోయంబత్తూర్ : సనాతన ధర్మంపై మాట్లాడినందుకే తమిళనాడు క్రీడా శాఖ మంత్రి ఉదయనిధి స్టాలిన్‌ను బిజెపి టార్గెట్ చేసిందని ప్రముఖ నటుడు, మక్కల్ నీది మయ్యమ్ పార్టీ అధినేత కమల్‌హాసన్ అన్నారు. కోయంబత్తూరులో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'సనాతన ధర్మంపై మాట్లాడినందుకే బిజెపికి ఇప్పుడు ఉదయనిధి స్టాలిన్ టార్గెట్ అయ్యారు. సనాతన ధర్మం గురించి గతంలో ఉదయనిధి తాత, డిఎంకె నేత ఎం.కరుణానిధి, తమిళ దిగ్గజ నేత పెరియార్ వి.రామస్వామితోపాటు పలువురు నేతలు మాట్లాడారు' అని గుర్తుచేశారు. సామాజిక రుగ్మతలపై వి.రామస్వామికి ఎంత కోపం ఉండేదో ఆయన జీవితం నుండే మనం అర్థంచేసుకోవచ్చునని అన్నారు. పెరియార్ లాంటి నాయకుడి వల్లనే తనలాంటి వారు సనాతన అనే పదాన్ని అర్థం చేసుకున్నారని చెప్పారు. తమిళనాడు రాష్ట్ర ప్రజలందరూ పెరియార్‌ను తమ నాయకుడిగా చూస్తారని, గౌరవిస్తారని.. తాను కూడా వ్యక్తిగతంగా పెరియార్‌ని గౌరవిస్తానని కమల్ అన్నారు.

మహారాష్ట్రలో భారీ పేలుడు

- ఇద్దరు మృతి

థానే (మహారాష్ట్ర) : మహారాష్ట్ర థానే ఇండస్ట్రియల్ ఏరియాలోని ఓ ఫ్యాక్టరీలో శనివారం మధ్యాహ్నం భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మరో ఐదుగురు గాయాల పాలయ్యారు. గ్యాస్ కంటైనర్‌ని నింపే సమయంలో పేలుడు సంభవించిందని థానే మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు వెల్లడించారు. సిఎస్2 (కార్బన్ డైసల్ఫైడ్)తో నింపాల్సిన నైట్రోజన్ గ్యాస్ ట్యాంకర్ కంపెనీకి వచ్చింది. ట్యాంకర్‌ని తనిఖీ చేసే సమయంలో పేలుడు సంభవించిందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన వారిని వివిధ ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు. వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉందని, ఐసియుకు తరలించాల్సి ఉందని చెప్పారు.

ICICI Home Finance

కార్పొరేట్ కార్యాలయం: ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ఐసిఐసిఐ హెచ్‌ఎఫ్‌సి టవర్, అందేరి -కుర్లా రోడ్, అందేరి (ఈస్ట్), ముంబాయి-400059, ఇండియా
శాఖ కార్యాలయం: సుప్రియ టవర్స్, అప్పర్ గ్రౌండ్ ఫ్లోర్, డో.నం.5-37-155, 4/15 బ్రాడీపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002

[రూల్ 8(6)కు నిబంధన చూచుట]

స్థిరాస్తుల విక్రయం కొరకు నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క రూల్ 8(6)కు నిబంధనతో చదువుతూ సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 క్రింద స్థిరాస్తుల విక్రయం కొరకు ఇ-వేలం విక్రయం నోటీసు.

సెక్యూర్డ్ క్రెడిటార్‌కు దిగువ వివరించిన తనాఖపెట్టిన/చార్జ్‌చేసిన స్థిరాస్తిని, ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి ద్వారా భౌతికంగా స్వాధీనం చేసుకొని "ఏది ఎక్కడ ఉందో", "ఆ పద్దతిన" మరియు "ఏదిఏమైనా ఆవిధంగా" విక్రయించబడునని సాధారణ ప్రజానీకం మరియు ప్రత్యేకంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు ఇక్కడ నోటీసు ఇవ్వడమైనది, సంక్షిప్త వివరాల ప్రకారం దిగువ ఇవ్వబడినాయి;

క్ర. సం	రుణగ్రహీత(లు)/సహ రుణగ్రహీతలు/ హామీదారులు/చట్టబద్ద వారసుల పేరు లోను ఖాతా నం.	ఏవైనా తెలిసిన రుణభారాలతో సెక్యూర్డ్ అస్సెట్(ల) వివరాలు	మొత్తం బకాయిలు	రిజర్వ్ ధర / బయానా మొత్తం	ఆస్తి తనిఖీ తేది మరియు సమయం	వేలం తేది మరియు సమయం
(A)	(B)	(C)	(D)	(E)	(F)	(G)
1.	బోరుగడ్డ విజయ కుమార్ (రుణగ్రహీత), నలిగల అనూష (సహ రుణగ్రహీత) లోను ఖాతా నం. LHGTR00001480072 & LHGTR00001479705	డో.నెం.1019, క్రిస్టియన్ పేట, గుంటూరు గ్రామ పాత గుంటూరు-522001	Rs. 28,79,985/- September 20, 2023	Rs. 29,82, 875/- / Rs. 2,98, 290/-	October 24, 2023 11:00 AM- 03:00 PM	October 31, 2023 02:00 PM- 03:00 PM

మా వేలం ఏజెన్సీ గ్లోబ్‌టెక్ వెబ్‌సైట్ (URL Link-https://BestAuctionDeal.com) మీద ఆన్‌లైన్ వేలం నిర్వహించబడును. అక్టోబర్ 30, 2023 సా.5.00 గం.లలోపు వరకు తదుపరి వడ్డీతో మొత్తం బకాయిలు చెల్లించుటకు తనాఖదారులు/నోటీసు ఇవ్వడమైనది లేకపోతే ఈ సెక్యూర్డ్ అస్సెట్స్ పైన షెడ్యూల్ ప్రకారం విక్రయించబడును.

కాగోరు బిడ్డర్(లు) బయానా (ఇఎండి) ఆర్‌టిజిఎస్/డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) (కాలమ్ ఇ చూచుట) ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, సుప్రియ టవర్స్, అప్పర్ గ్రౌండ్ ఫ్లోర్, డో.నం.5-37-155, 4/15 బ్రాడీపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002 లేదా అక్టోబర్ 30, 2023న సా.04:00 గం.లలోపు దాఖలు చేయాలి. దయచేసి గమనించండి, కాగోరు బిడ్డర్(లు) ఒకవేళ పైన పేర్కొన్న సమయం ప్రకారం వారి ఆఫర్ దాఖలు చేయనట్లయితే ఆప్పుడు టెండర్ డాక్యుమెంట్‌ల యొక్క సంతకంచేసిన కాపీ ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్, సుప్రియ టవర్స్, అప్పర్ గ్రౌండ్ ఫ్లోర్, డో.నం.5-37-155, 4/15 బ్రాడీపేట, గుంటూరు, ఆంధ్రప్రదేశ్-522002 లేదా అక్టోబర్ 30, 2023న సా.05:00 గం.లలోపు దాఖలు చేయాలి. బయానా డిమాండ్ డ్రాఫ్ట్ (డిడి) "ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్-ఆక్షన్" పేరిట ఏదైనా జాతీయ/షెడ్యూల్డ్ బ్యాంక్ నుండి గుంటూరు వద్ద చెల్లించాలి.

తనిఖీకి సంబంధించిన ఏదైనా తదుపరి వివరణలకు, వేలం నియమాలు మరియు షరతులు లేదా టెండర్ల దాఖలు, 7021072869 మీద ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌ను లేదా మా సేల్స్ అండ్ మార్కెటింగ్ పాట్నర్ నెక్సెన్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌ను దయచేసి సంప్రదించండి.

అధీకృత అధికారి ఎలాంటి కారణం చూపకుండా అన్ని బిడ్‌లు లేదా ఏదైనా తిరస్కారం చేసే హక్కు కలదు. విక్రయం వివరాణత్మక నియమాలు మరియు షరతులు, https://www.icicihfc.com/ దయచేసి చూడండి..

తేది: సెప్టెంబర్ 24, 2023 అధీకృత అధికారి
ప్రదేశం: గుంటూరు ఐసిఐసిఐ హోమ్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్

सत्यमेव जयते
MINISTRY OF
SOCIAL JUSTICE & EMPOWERMENT
GOVERNMENT OF INDIA

సామాజిక న్యాయం మరియు సాధికారత విభాగం

ప్రకటనలు

69 లక్షల షెడ్యూల్డ్ కులాలకు స్కాలర్‌షిప్‌లు

కింద ఉన్నత విద్యను అభ్యసించడానికి విద్యార్థులు

2023-24 సం॥రానికి ఎస్‌సి విద్యార్థుల కొరకు

పోస్ట్- మాట్రిక్ స్కాలర్‌షిప్‌ల పథకం

అర్హత
- తల్లిదండ్రులు/సంరక్షకుల వార్షిక ఆదాయం రూ.2.50 లక్షలకు మించకూడదు
- గుర్తింపు పొందిన కళాశాలలు/పాఠశాలల్లో కోర్సులు అభ్యసిస్తున్న విద్యార్థులు

అవకాశం
- 11వ తరగతి నుండి అన్ని గుర్తింపు పొందిన కోర్సులు
- దరఖాస్తులు రాష్ట్ర ప్రభుత్వం/ యూనియన్ టెర్రిటరీ ద్వారా ఆమోదించబడతాయి మరియు ధృవీకరించబడతాయి
- పేద కుటుంబాల కవరేజ్

హక్కు
- తిరిగి ఇవ్వబడని ఫీజు (ట్యూషన్ ఫీ తో సహా) తప్పనిసరి
- సంవత్సరానికి రూ.2500 నుండి రూ.13500 వరకు విద్యా భత్యం
- దివ్యాంగుల (ప్రత్యేక సామర్థ్యం గల) విద్యార్థులకు 10% అదనపు భత్యం

- విద్యార్థులు వారి సంబంధిత రాష్ట్రాల స్కాలర్‌షిప్ పోర్టల్‌లలో దరఖాస్తు చేసుకోవాలి
- విద్యార్థులు చెల్లుబాటు అయ్యే మొబైల్ నంబర్, ఆధార్ నంబర్ (యుఐడి), ఆధార్ సీడెడ్ బ్యాంక్ ఖాతా, ఆదాయ ధృవీకరణ పత్రం మరియు కుల ధృవీకరణ పత్రాన్ని కలిగి ఉండాలి.

- పథకం మార్గదర్శకాలు మరియు వివరణాత్మక అర్హత ప్రమాణాలు

http://socialjustice.gov.in/schemes/25 అందుబాటులో ఉన్నాయి.

cbc 38101/11/0031/2324

'జమిలి ఎన్నికల కమిటీ' తొలి భేటీ..

- పార్టీల అభిప్రాయాల సేకరణకు నిర్ణయం

న్యూఢిల్లీ: 'ఒకే దేశం – ఒకే ఎన్నికల' నిర్వహణ సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నాయకత్వంలో ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ శనివారం ఢిల్లీలో తొలిసారి సమావేశమైంది. జమిలి ఎన్నికలపై సూచనలు, అభిప్రాయాలను సేకరించేందుకు గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీలను ఆహ్వానించాలని కమిటీ నిర్ణయించింది. 'జమిలి ఎన్నికలపై సూచనలు, అభిప్రాయాల సేకరణకు.. గుర్తింపు పొందిన జాతీయ పార్టీలు, రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న పార్టీలు, పార్లమెంటులో తమ ప్రతినిధులు ఉన్న పార్టీలు, గుర్తింపు పొందిన ఇతర రాష్ట్ర పార్టీలను ఆహ్వానించాలని కమిటీ నిర్ణయించింది. దీంతోపాటు భారత న్యాయ కమిషన్‌ను కూడా కమిటీ ఆహ్వానించింది' అని ఒక ప్రకటన విడుదలైంది. అవసరమైన దస్త్రాల సన్నద్ధత, సంబంధిత పక్షాలతో సంప్రదింపులు ఎలా నిర్వహించాలి? జమిలి ఎన్నికలపై పరిశోధన.. తదితర అంశాలు సమావేశ అజెండాలో భాగమైనట్లు సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి.

'ఆధార్' ఆధారిత చెల్లింపు వద్దు

- ఆర్‌బిఐ గవర్నర్‌కు బ్యాంక్ బచావో ఫోరమ్ లేఖ

న్యూఢిల్లీ : ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్‌ను వ్యతిరేకిస్తూ 'బ్యాంక్ బచావో దేశ్ బచావో మంచ్' స్పందించింది. ఈ మేరకు ఆర్‌బిఐ గవర్నర్ శక్తికాంత దాస్‌కు లేఖ రాసింది. ఈ చెల్లింపు వ్యవస్థ ద్వారా జరిగే బ్యాంకు మోసాలపై మంచ్ ఆందోళన వ్యక్తం చేసింది. 'బ్యాంక్ బచావో దేశ్ బచావో మంచ్' ఖాతాదారులకు ఆధార్ కార్డ్ మోసం నుంచి రక్షణ కల్పించాలని లేఖలో అభ్యర్థించింది. తగు చర్యలు తీసుకోవాలని ఆర్‌బిఐ గవర్నర్‌ను కోరింది. ఆధార్ కార్డును ఉపయోగించి వినియోగదారుల వేలిముద్రలను అనుకరిస్తూ మోసగాళ్లు ఇప్పుడు బ్యాంకుల నుంచి డబ్బును దోచుకుంటున్నారు అని వివరించింది. అసోసియేషన్ జాయింట్ కన్వీనర్లు బిశ్వ రంజన్ రాయ్, సౌమ్య దత్తాలు లేఖ రాసినవారిలో ఉన్నారు.

ఖలిస్థానీ ఉగ్రవాది పన్నూన్ ఆస్తులు జప్తు

చండీగఢ్ : ఖలిస్థానీ ఉగ్రవాది, నిషేధిత సిక్స్ ఫర్ జస్టిస్ (ఎస్ఎఫ్‌జె) సంస్థ అధినేత గురుపత్వంత్ సింగ్ పన్నూన్‌కు చెందిన ఆస్తులను నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఎ) జప్తు చేసింది. చట్టవిరుద్ధ కార్యకలాపాల (నివారణ) చట్టం కింద పంజాబ్‌లోని చండీగఢ్, అమృత్‌సర్‌లో ఆయనకు చెందిన ఆస్తుల వద్ద జప్తు నోటీసులు ఉంచింది. చండీగఢ్‌లోని నివాసంతోపాటు అమత్‌సర్‌లోని పూర్వీకుల గ్రామమైన ఖాన్‌కోట్‌లో గురుపత్వంత్ సింగ్‌కు చెందిన వ్యవసాయ భూమిని కూడా ఎన్ఐఎ జప్తు చేసింది.

ఇ-క్రాప్ డొల్లే!

(మొదటి పేజీ తరువాయి)

ఎంట్రీలను తనిఖీ చేస్తే 287 తప్పు ఎంట్రీలుగా తేలింది. తిరుపతిలో 224 ఎంట్రీలను చెక్ చేస్తే 108 తప్పులు, అన్నమయ్యలో 58 చెక్ చేస్తే 20 తప్పులు, శ్రీకాకుళంలో 94 చెక్ చేస్తే 92 తప్పులు, గుంటూరులో 102 చెక్ చేస్తే 22 తప్పులు గుర్తించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఎ.డి.లు చేసిన తనిఖీలలో 15 శాతం, ఎంఎఓలు చేసిన తనిఖీలలో దాదాపు 3 శాతం తప్పుల తడకలు. ఎంఎఒ, ఎ.డి, డిఎఒల మొత్తం చెకింగ్‌లలో 5.6 శాతం తప్పులని తేలింది. మచ్చుకు చేసిన తనిఖీల్లోనే ఇన్నేసి తప్పులుంటే అన్ని ఎంట్రీలనూ తనిఖీ చేస్తే ఇంకెన్ని తప్పులుంటాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. నమోదుల్లో లోపాల కారణంగా అర్హులైన రైతులు ప్రభుత్వ పథకాలను, సబ్సిడీలను కోల్పోతున్నారు. కౌలు రైతులు మరింతగా నష్టపోతున్నారు.

అంగన్‌వాడీలపై ముందే నిర్బంధం

(మొదటి పేజీ తరువాయి)

మహాధర్నాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. దీనికోసం విజయవాడ పోలీసు కమిషనర్, డిజిపిని అనుమతి కోరామన్నారు. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా ప్రజాప్రతినిధుల దృష్టికి తమ సమస్యలను తీసుకువెళ్లడానికి ఈ ధర్నా కార్యక్రమాన్ని చేపట్టినట్లు వివరించాచు. అంగన్‌వాడీ వర్కర్లు, మినీవర్కర్లు, హెల్పర్లకు కనీస వేతనాలు చెల్లించేందుకు బడ్జెట్ కేటాయించాలని కోరారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వారికి గ్రాట్యూటీని అమలు చేయాలన్నారు. రాష్ట్రంలోని మినీ సెంటర్లను తక్షణమే మెయిన్ సెంటర్లుగా మార్చాలని, టీచర్లకు ఇచ్చేంత వేతనాలు ఇవ్వాలని, మినీ వర్కర్లకు ప్రమోషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఎఫ్‌ఆర్ఎస్‌తోపాటు వివిధ రకాల యాప్‌లను రద్దుచేసి ఒకే యాప్ ద్వారా విధులు నిర్వహించేలా చూడాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల మాదిరి రిటైర్మెంటు వయసును 62 ఏళ్లకు పెంచాలని, ఆఖరి వేతనంలో 50 శాతం పెన్షన్ ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు. వైఎస్ఆర్ సంపూర్ణ పోషణ మెనూఛార్జీలు పెంచాలని, గ్రాస్‌ను ప్రభుత్వమే ఇవ్వాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న సెంటర్ల అద్దెలు, 2017 నుండి ఇప్పటి వరకూ టిఎ, డిఎ బిల్లులు, ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. నాణ్యమైన సరుకులు లబ్ధిదారులకు సరిపోయేలా కచ్చితమైన కొలతతో ప్రతినెలా 5వ తేదీలోగా సకాలంలో అంగన్‌వాడీ సెంటర్లకు చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ మూడు సంఘాల ఆధ్వర్యాన విజయవాడలో ధర్నా చౌక్‌లో ధర్నా చేపడతామని తెలిపారు.

ఇకపై తానా అంటే తందానా...!

- పాలకుల చెప్పుచేతల్లో ఎన్నికల కమిషన్
- సంస్థ స్వతంత్రతను దెబ్బతీస్తున్న మోడీ ప్రభుత్వం
- సుప్రీం ఆదేశాలూ బేఖాతరు

న్యూఢిల్లీ : దేశంలో స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా ఎన్నికలు నిర్వహించడంలో కీలకపాత్ర పోషించాల్సిన ఎన్నికల కమిషన్ స్వయం ప్రతిపత్తిని దెబ్బతీసి, తన అదుపాజ్ఞల్లో ఉంచుకునేందుకు నరేంద్రమోడీ ప్రభుత్వం చేయని ప్రయత్నమంటూ లేదు. తాజాగా ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర అధికారుల నియామకాలు, వారి సర్వీసు నిబంధనల విషయంలో పార్లమెంటులో మోడీ ప్రభుత్వం ప్రతిపాదించిన మార్పులు ప్రజాస్వామ్యవాదులందరికీ ఆందోళన కలిగిస్తున్నాయి. ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియ నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్‌ను తప్పించడంపై ప్రతిపక్షాలు ఆగ్రహావేశాలు వ్యక్తం చేస్తున్నాయి. గతంలో నియామక కమిటీలో ప్రధాన న్యాయమూర్తి, ప్రధాని, ప్రతిపక్ష నేత సభ్యులుగా ఉండేవారు. ఇప్పుడు ప్రధాన న్యాయమూర్తిని తొలగించగా ఏర్పడిన ఖాళీని ప్రధాని నామినేట్ చేసే కేంద్ర మంత్రితో భర్తీ చేస్తారు. అంటే త్రిసభ్య కమిటీలో ప్రతిపక్ష నాయకుడు కేవలం ప్రేక్షక పాత్రకే పరిమితమవుతాడు.

ఎన్నికల కమిషన్‌లో ఒక కమిషనర్ పదవి ఫిబ్రవరిలో ఖాళీ అవుతుంది. ఆ స్థానంలో ప్రభుత్వం తనకు ఇష్టుడైన వ్యక్తిని నియమించుకునే అవకాశం ఇప్పుడు ఏర్పడింది. గతంలో అనూప్ బరన్వాల్, కేంద్రం మధ్య నెలకొన్న వివాదంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని చేర్చారు. ఇప్పుడు కేంద్రం తీసుకున్న నిర్ణయం సుప్రీం తీర్పును కాలరాస్తోంది. అసలు ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర కమిషనర్ల నియామకంపై రాజ్యాంగం, న్యాయస్థానాలు ఏం చెబుతున్నాయి?

పారదర్శకత కోసం పిటిషన్లు

రాజ్యాంగంలోని 324(2) అధికరణ ప్రకారం పార్లమెంట్ చట్టాలకు అనుగుణంగా ఎన్నికల కమిషనర్లను రాష్ట్రపతి నియమిస్తారు. ఇప్పటి వరకూ వీరి నియామకాలపై ఎలాంటి చట్టాలు చేయలేదు. ఎన్నికల కమిషనర్ల నియామకం మరింత పారదర్శకంగా ఉండేలా చూడాలంటూ దాఖలైన పలు పిటిషన్లపై గతంలో సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఎన్నికల కమిషనర్ల నియామకం కోసం కొలీజియం వ్యవస్థ లేదా కమిటీని ఏర్పాటు చేయాలని, ప్రత్యేక సచివాలయాన్ని ఏర్పాటు చేసి సుప్రీంకోర్టు తరహాలో అధికారాలు కల్పించాలని పిటిషనర్లు కోరారు. ఎన్నికల కమిషనర్ల నియామకంలో ప్రభుత్వ పాత్ర ఉండరాదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. కమిషనర్ల నియామకం విషయంలో విధివిధానాలను రూపొందిస్తూ పార్లమెంట్ చట్టం చేయాలని సూచించింది. ఆ పని ఇప్పటి వరకూ జరగలేదు.

శేషన్, లింగ్డోల హయాంలో...

టిఎన్ శేషన్ హయాంలో ఎన్నికల కమిషన్ స్వతంత్రంగా వ్యవహరించింది. ప్రజాస్వామ్య పరిరక్షణకు పలు చర్యలు తీసుకుంది. ఓటర్లకు గుర్తింపు కార్డులు జారీ చేయకపోతే 1995 జనవరి తర్వాత ఎన్నికలు నిర్వహించే ప్రసక్తే లేదని ఆయన తెగేసి చెప్పడంతో ప్రభుత్వం ఒత్తిడికి గురైంది. చివరికి సుప్రీంకోర్టు జోక్యంతో ప్రతిష్టంభన తొలగింది. ఎన్నికల పరిశీలకుల నియామకం కూడా ఆయన హయాంలోనే జరిగింది. ఆ విధంగా శేషన్ ఎన్నో ఎన్నికల సంస్కరణలు ప్రవేశపెట్టారు. ఆ తర్వాత వచ్చిన జెఎం లింగ్డో శేషన్ దారిలోనే పయనించినప్పటికీ అనేక అవరోధాలు ఎదురయ్యాయి.

తాబేదార్లతో నింపుతారా?

ఇప్పుడు శేషన్, లింగ్డో వంటి నిష్పాక్షిక ఎన్నికల అధికారులు మోడీ ప్రభుత్వానికి అవసరం లేదు. లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడేందుకు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించే వారిని పాలకులు భరించలేకపోతున్నారు. తాము చెప్పినట్లు నడుచుకుంటూ, తాబేదార్లుగా వ్యవహరించే వారితో ఎన్నికల కమిషన్‌ను నింపేయాలని చూస్తున్నారు. అందుకే కమిషన్ స్వతంత్రతను నీరుకార్చే ప్రయత్నాలు సాగిస్తున్నారు. కమిషనర్ల నియామక ప్రక్రియలో మాత్రమే కాదు... వారి సర్వీసు నిబంధనల్లో కూడా ప్రభుత్వం మార్పులు చేస్తోంది. ఎన్నికల కమిషనర్లకు ఇంతకుముందు సుప్రీంకోర్టు న్యాయమూర్తి హోదా ఉండేది. ఇప్పుడది క్యాబినెట్ కార్యదర్శి స్థాయికి పడిపోయింది.

మణిపూర్‌లో ఇంటర్నెట్ సేవల పునరుద్ధరణ

ఇంఫాల్ : మణిపూర్‌లో ఎట్టకేలకు ఇంర్నెట్ సేవలు పునరుద్ధరించబడ్డాయి. మే 3 నుంచి ఆ రాష్ట్రంలో మైతీలు, కుకీల మధ్య హింసాకాండ చెలరేగడంతో 200 మందికిపైగా ప్రాణాలు కోల్పోగా, అనేకమంది తీవ్ర గాయాల పాలైన సంగతి తెలిసిందే. కొండ ప్రాంతాలకు కుకీలు, మైదాన ప్రాంతాలకు మైతీలు పరిమితమయ్యారు. నేటికీ దాడులు జరుగుతూనే ఉన్నాయి. శనివారం నుంచి మొబైల్ ఇంటర్నెట్ సేవలను పునరుద్ధరిస్తున్నట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి బీరెన్ సింగ్ చెప్పారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ద్వేషపూరిత ప్రసంగాల వ్యాప్తి, అబద్ధపు ప్రచారాలను అరికట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం మే 3 నుంచి మొబైల్ ఇంటర్నెట్ సేవలను నిలిపివేసిందన్నారు. పరిస్థితి మెరుగుపడడంతో రాష్ట్రవ్యాప్తంగా మొబైల్, ఇంటర్నెట్ సేవలు పునరుద్ధరిస్తున్నామని చెప్పారు. మణిపూర్‌కి అక్రమ వలసలు కొనసాగుతున్నాయని, వాటిని అరికట్టేందుకు మణిపూర్‌లోని అంతర్జాతీయ సరిహద్దులో 60 కిలోమీటర్ల మేర కంచె వేయడానికి కేంద్ర హోంమంత్రిత్వశాఖ చర్యలు చేపట్టిందని తెలిపారు. అక్రమ వలసదారుల చొరబాటును అడ్డుకోవడం, ప్రజల కోసం సంక్షేమ కార్యక్రమాలను చేపట్టడం, నల్లమందు సాగుకు వ్యతిరేకంగా చర్యలు చేపట్టడంపై దృష్టి సారించినట్లు ఈ సందర్భంగా మణిపూర్ సిఎం బీరెన్‌సింగ్ చెప్పారు.

ఇంఫాల్‌లో మళ్లీ ఘర్షణలు

మణిపూర్ రాజధాని ఇంఫాల్‌లో మళ్లీ ఘర్షణలు చెలరేగాయి. బెయిలుపై విడుదలైన ఐదుగురు విలేజ్ డిఫెన్స్ వలంటీర్లలో ఒకరిని కేంద్ర భద్రతా సంస్థ తిరిగి అరెస్ట్ చేయడంతో శుక్రవారం రాత్రి అల్లర్లు చెలరేగాయి. సెక్యూరిటీ దళాలు, నిరసనకారుల మధ్య ఇంఫాల్ పశ్చిమ ప్రాంతంలోని కొన్ని ప్రాంతాల్లో ఘర్షణలు జరిగాయి. బెయిలు విడుదలైన తర్వాత మిగతా నలుగురిని అధికారులు వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. నిషేధిత పీపుల్స్ లిబరేషన్ ఆర్మీకి చెందిన మెయిరంగ్‌థెమ్ ఆనంద్‌ను తిరిగి అరెస్ట్ చేశారు. పదేళ్ల క్రితం నాటి కేసులో తన భర్తను అరెస్ట్ చేసినట్టు పోలీసులు తమతో చెప్పారంటూ ఇంఫాల్ పోలీస్ స్టేషన్ బయట ఆనంద్ భార్య విలపిస్తూ చెప్పారు.

డ్రగ్స్ తీసుకోలేదు : నవదీప్

ప్రజాశక్తి– హైదరాబాద్ బ్యూరో

తానెప్పుడూ డ్రగ్స్ తీసుకోలేదని, ఎవరి వద్దా కొనుగోలు చేయలేదని నటుడు నవదీప్ తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు శనివారం ఆయన హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని నార్కోటిక్ బ్యూరో కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. డ్రగ్స్ విక్రయదారుడు రామ్‌చంద్‌తో పరిచయం ఉంది కానీ, డ్రగ్స్ కొనుగోలు చేయలేదని విచారణాధికారులకు ఆయన తెలిపారు. విచారణ అనంతరం నవదీప్ మీడియాతో మాట్లాడుతూ, నార్కోటిక్ బ్యూరో అధికారులు నోటీసు ఇస్తే వచ్చానని చెప్పారు. టిఎస్ నార్కోటిక్ అధికారులు ఏడేళ్ల క్రితం కాల్ లిస్ట్ ఆధారంగా తనను విచారించారని చెప్పారు. బిపిఎం క్లబ్‌తో ఉన్న సంబంధాలపై ఆరా తీశారని తెలిపారు. గతంలో కూడా సిట్, ఇడి విచారించిందని గుర్తు చేశారు. మాదాపూర్ డ్రగ్స్ కేసులో సినీనటుడు నవదీప్‌ను విచారించామని, అన్ని ప్రశ్నలకూ ఆయన సమాధానాలిచ్చారని యాంటీ నార్కోటిక్ బ్యూరో ఎస్‌పి సునీతారెడ్డి తెలిపారు. 'మాదాపూర్ డ్రగ్స్ కేసులో 81 లింకులు గుర్తించాం. 41 లింకుల వివరాలను నవదీప్ తెలిపారు. డ్రగ్స్ కొనుగోలు చేసినట్టు సిట్, ఇడి విచారణలో నవదీప్ అంగీకరించారు. ఇప్పుడు మాత్రం డ్రగ్స్ వాడలేదని సమాధానమిస్తున్నారు. రామ్‌చంద్‌తో కలిసి నవదీప్ గతంలో బిపిఎం పబ్ నిర్వహించారు. సెల్‌ఫోన్‌లో ఉన్న డేటాను డిలీట్ చేశారు. నవదీప్ ఫక్షన్ రీట్రైవ్ చేసి మళ్లీ విచారిస్తాం. నవదీప్ ఫోన్ డేటా పూర్తిగా వచ్చిన తర్వాతే మళ్లీ విచారణ ఉంటుంది' అని ఎస్‌పి తెలిపారు.

సరళంగా, సామాన్య భాషల్లో చట్టాల రూపకల్పన

- అంతర్జాతీయ న్యాయవాదుల సమావేశాన్ని ప్రారంభిస్తూ మోడీ

సిజెఐతో ముచ్చటిస్తున్న ప్రధాని

న్యూఢిల్లీ : సులభంగా, సరళంగా చట్టాలు రూపొందించేందుకు, గరిష్టంగా భారతీయ భాషల్లో వుండేలా చూసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. అంతర్జాతీయ న్యాయవాదుల సమావేశాన్ని శనివారం ప్రారంభిస్తూ ఆయన మాట్లాడారు. చట్టాలను రూపొందించడంలో, న్యాయ క్రమంలో ఉపయోగించే భాష ప్రజలకు న్యాయాన్ని అందించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తుందని అన్నారు. "చట్టమనేది రెండు విధాలుగా రూపొందించాలని భారత ప్రభుత్వం ఆలోచిస్తోంది. మీరు ఉపయోగించే భాషలో ఒక ముసాయిదా వుంటుంది. రెండోది దేశంలో ప్రతి సామాన్యుడికి అర్ధమయ్యే భాషలో వుంటుంది. అతడు చట్టాన్ని తనదిగా పరిగణించాలి." అని మోడీ పేర్కొన్నారు. చట్టాలను సంక్లిష్టమైన రూపంలో రూపొందించే పద్ధతి మనకు వుందని అన్నారు.

భారత న్యాయ వ్యవస్థ పరిరక్షకులుగా న్యాయ వ్యవస్థ, బార్ వున్నాయని అన్నారు. భారత స్వాతంత్ర్యంలో అవి కీలక పాత్ర పోషించాయన్నారు. భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ఎనలేని సేవలందించిన మహాత్మా గాంధీ, అంబేద్కర్, నెహ్రూ, వల్లభాయ్ పటేల్ వంటి వారందరూ న్యాయవాదులేనని అన్నారు. భారత్‌లో అనేక చారిత్రక ఘట్టాలు చోటు చేసుకున్నపుడు ఈ సమావేశం జరుగుతోందని మోడీ అన్నారు.

మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించడాన్ని ప్రస్తావిస్తూ, మహిళల నేతృత్వంలో అభివృద్ధికి కొత్త దిశ, వూపు వస్తుందన్నారు. జి–20 సదస్సు నిర్వహణను, చంద్రయాన్ విజయాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. 2047కల్లా అభివృద్ధి చెందిన దేశంగా మారాలన్న లక్ష్యాన్ని సాధించేందుకు భారత్ గట్టిగా కృషి చేస్తోందన్నారు. అందుకోసం పటిష్టమైన, నిష్పాక్షికమైన న్యాయ వ్యవస్థ పునాది వుండాల్సిన అవసరం వుందన్నారు. భారతదేశంపై ప్రపంచానికి పెరుగుతున్న విశ్వాసంలో నిష్పాక్షికమైన న్యాయం పెద్ద పాత్ర పోషిస్తుందని మోడీ చెప్పారు.

జర్నలిస్టుల విధుల బహిష్కరణ

- నేషనల్ వరల్డ్ యాజమాన్యవైఖరికి నిరసన
- ఆస్ట్రేలియా, బ్రిటన్‌తో సహా పలు దేశాల జర్నలిస్టుల సంఘీభావం

లండన్ : వేతనాల పెంపు, ఉద్యోగాలు కోల్పోవడం వంటి సమస్యలపై నేషనల్ వరల్డ్ ప్రచురణ సంస్థకి చెందిన 300మందికి పైగా జర్నలిస్టులు శనివారం తమ విధులను బహిష్కరించారు. నేషనల్ వరల్డ్‌కి చెందిన ప్రాంతీయ వార్తా పత్రికల్లో పనిచేసే వీరందరూ ఒక్కో రోజు చొప్పున మూడు రోజుల సమ్మెలకు పిలుపిచ్చారు. అందులో భాగంగా రెండవ సమ్మెలో శనివారం వీరు 24గంటల పాటు విధుల బహిష్కరణ చేశారు. తిరిగి సోమవారం మరోసారి జర్నలిస్టులు సమ్మె చేయనున్నారు. ఆస్ట్రేలియా, బ్రిటన్‌లతో సహా ప్రపంచవ్యాప్తంగా జర్నలిస్టుల నుండి ఈ సమ్మెకు సంఘీభావం తెలుపుతూ సందేశాలు వచ్చాయని నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఎన్‌యుజె) తెలిపింది. 4.5శాతం వేతన పెంపునకు వ్యతిరేకంగా జర్నలిస్టులు ఈ నిరసన కార్యచరణ చేపట్టారు. "ఈ ఉద్యోగాలతో బతకలేమని భావించిన నేషనల్ వరల్డ్ సిబ్బందిలో కొంతమంది రెండో ఉద్యోగం చేయాల్సి వస్తోందని, మరికొంతమంది దీన్నుండే బయటకు వెళ్లిపోవాలని భావిస్తున్నారని, ఇది సిగ్గుచేటైన విషయం" అని జర్నలిస్టులకు వచ్చిన ఒక సంఘీభావ సందేశం పేర్కొంది. ఎన్‌యుజె జాతీయ నిర్వాహకులు లారా డేవిసన్ మాట్లాడుతూ, సిబ్బందికి సవరించిన వేతన ప్యాకేజీని అమలు చేయగల సామర్ధ్యం నేషనల్ వరల్డ్‌కి వుందని అన్నారు. నేషనల్ వరల్డ్ ప్రచురణ సంస్థకి వందకి పైగా వార్తాపత్రికలు వున్నాయి.

సెంట్రల్ సోమాలియాలో భారీ పేలుడు

- 15మంది మృతి
- మరో 20 మంది పరిస్థితి విషమం

మొగదిషు : సెంట్రల్ సోమాలియా నగరమైన బెలెద్వెనెలో సెక్యూరిటీ చెక్‌పాయింట్ వద్ద పేలుడు పదార్థాలతో నిండిన వాహనాన్ని శనివారం పేల్చివేయడంతో 15మంది మరణించగా, మరో 40మంది తీవ్రంగా గాయపడ్డారని అధికారులు తెలిపారు. వారిలో 20మంది పరిస్థితి విషమంగా వుందని, వారిని అధునాతన వైద్య చికిత్సల కోసం మొగదిషుకు విమానంలో పంపాలని భావిస్తున్నట్లు హిర్షాబెల్లె మానవతా వ్యవహారాల మంత్రిత్వ శాఖ డైరెక్టర్ జనరల్ మహ్మద్ యూసుఫ్ తెలిపారు. హిరాన్ ప్రాంత రాజధాని అయిన బెలెద్వెనె నగరం ఇటీవల అల్‌ఖైదా అనుబంధ సంస్థ అయిన అల్ షాబాబ్ తీవ్రవాదులపై సోమాలియా ప్రభుత్వ తాజా మిలటరీ దాడులకు కేంద్రంగా మారింది. దాడి జరిగిన ప్రాంతం నుండి దట్టంగా నల్ల పొగ కమ్ముడం, పక్కనే మంటల్లో ధ్వంసమవుతున్న ట్రక్కు కనిపిస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ దాడికి కారకులెవరనేది ఇంతవరకు ఎలాంటి ప్రకటన వెలువడలేదు. సాధారణంగా అల్ షాబాబ్ ఇటువంటి దాడులకు తెగబడుతూ వుంటుంది.

కొన్ని వారాల ముందే భారత్‌కు చెప్పాం

- నిజ్జార్ హత్యపై కెనడా ప్రధాని ట్రుడో
- తీవ్రంగా ఆందోళన చెందుతున్నాం : అమెరికా

ఒట్టావా : సిక్కు వేర్పాటువాద నేత హర్దీప్ సింగ్ నిజ్జార్ హత్యలో భారత ప్రభుత్వ ఏజెంట్ల పాత్ర వుందనడానికి సంబంధించిన నిఘా సమాచారాన్ని కొన్ని వారాల క్రితమే భారత్‌తో పంచుకున్నామని కెనడా ప్రధాని జస్టిన్ ట్రుడో తెలిపారు. సోమవారం భారత్ గురించి తాను చేసిన విశ్వసనీయమైన ఆరోపణల వ్యవహారాన్ని చాలా వారాల క్రితమే భారత్‌కు తెలియజేశామని చెప్పారు. ఒట్టావాలో పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. భారత్‌తో కలిసి నిర్మాణాత్మకంగా పనిచేయడానికి ఎదురుచూస్తున్నామన్నారు. ఈ నిఘా సమాచారం ఏ గూడచారి సంస్థ ఇచ్చిందన్న వివరాలు ఆయన వెల్లడించడం లేదు.

దర్యాప్తు పూర్తికావడమే ముఖ్యమైన అంశం : అమెరికా

నిజ్జార్ హత్యలో భారత్ పాత్ర వుందంటూ వచ్చిన ఆరోపణలపై తాము తీవ్రంగా ఆందోళన చెందుతున్నామని అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ చెప్పారు. ఈ సంఘటనకు సంబంధించి జవాబుదారీతనం కోసం ఎదురుచూస్తున్నామన్నారు. ఈ దర్యాప్తులో కెనడాతో భారత్ కలిసి పనిచేయడం కీలకంగా వుంటుందని బ్లింకెన్ విలేకర్లతో వ్యాఖ్యానించారు. దర్యాప్తు విషయంలో కెనడాకు సహకరిస్తామని చెప్పారు. ఈ దర్యాప్తు ముందుకు సాగి, పూర్తి కావడమే జరగాల్సిన అత్యంత ముఖ్యమైన అంశంగా వుందని తెలిపారు.

కెనడియన్లకు వీసాల జారీ నిలుపుదల

భారత్, కెనడాల మధ్య వివాదం ముదురుతున్న నేపథ్యంలో కెనడియన్లకు వీసాలను భారత్ నిలుపుచేసింది. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ వున్నప్పటికీ కెనడియన్లకు భారత్ వీసాలను జారీ చేసేది లేదని భారత ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ వారం నుంచే ఇది అమల్లోకి వస్తోంది. కెనడాలోని భారత్ ఎంబసీ, కాన్సులేట్ కార్యాలయాలకు బెదిరింపులు వస్తున్నాయని విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతినిధి తెలిపారు. అందువల్ల తాత్కాలికంగా వీసాల జారీని నిలిపివేస్తున్నామని చెప్పారు. ఇ వీసాలు కూడా సస్పెన్షన్ పరిధిలోకే వస్తాయని తెలిపారు.

రూ.7.5 లక్షల కోట్ల అక్రమాలపై నోరువిప్పండి

- కాగ్ నివేదికపై ప్రధాని మౌనాన్ని ప్రశ్నించిన తమిళనాడు సిఎం స్టాలిన్

చెన్నై : మోడీ ప్రభుత్వ హయాంలో సుమారు 7.5 లక్షల అక్రమాలు జరిగినట్లు కాగ్ తన నివేదికలో పేర్కొందని, దీనిపై ప్రధాని మౌనం వీడాలని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ డిమాండ్ చేశారు. 2024 ఎన్నికల్లో బిజెపిని ఓడించాలని ఆయన పిలుపునిచ్చారు. కాషాయ పార్టీ ఆగడాలను ఆపేందుకు ప్రజలంతా ఏకం కావాలన్నారు. మత, విభజన, నిరంకుశ, కార్పొరేట్ రాజకీయాలను తరిమికొట్టాలన్నారు. 'స్పీకింగ్ ఫర్ ఇండియా' పేరుతో కేంద్రప్రభుత్వ తీరును నిరసిస్తూ డిఎంకె ఆధ్వర్యాన స్టాలిన్ ప్రసంగ వీడియోలను ఎక్స్‌లో పోస్ట్ చేస్తున్న సంగతి తెలిసిందే. కాగ్ ఇచ్చిన నివేదికపై మోడీ ఎందుకు మౌనంగా ఉన్నారని తాజా కార్యక్రమంలో సిఎం ప్రశ్నించారు. ఇండియా కూటమి అవినీతికి పాల్పడుతున్నట్లు మోడీ ఆరోపిస్తున్నారని, కానీ మోడీ పాలనలో దాగిన అవినీతిని కాగ్ ఎత్తిచూపిందని తెలిపారు. ఆ రిపోర్టును మీరు చదివారా? ప్రత్యేక పార్లమెంట్ సెషన్‌లో దాని గురించి చర్చించారా? అని స్టాలిన్ ప్రధానిని ప్రశ్నించారు. బిజెపి ప్రభుత్వంలో అయిదు సీలు ఉన్నాయని, కమ్యూనలిజం (మతతత్వం), కరప్షన్ (అవినీతి), కార్పొరేట్ పెట్టుబడిదారులు (కార్పొరేట్ క్యాపిటలిజం), చీటింగ్, వ్యక్తిత్వ హననం (క్యారెక్టర్ అసాసినేషన్)లకు పాల్పడుతోందని స్టాలిన్ విమర్శించారు.

కృష్ణా జిల్లా అనుమంచిపల్లి వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు

'చలో రాజమహేంద్రవరం' నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు వద్ద విస్తృత పోలీసు బందోబస్తు

ప్రజాశక్తి– జగ్గయ్యపేట (ఎన్‌టిఆర్ జిల్లా)

స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న టిడిపి అధినేత నారా చంద్రబాబునాయుడుకు సంఘీభావంగా హైదరాబాద్‌లోని కొందరు ఐటి ఉద్యోగులు 'చలో రాజమహేంద్రవరం'నకు ఆదివారం పిలుపునిచ్చిన నేపథ్యంలో రాష్ట్ర సరిహద్దు ప్రాంతంలో పోలీసులు విస్తృత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం అనుమంచిపల్లి గ్రామం సమీపంలోని సరిహద్దు వద్ద డిసిపి నేతృత్వంలో ఇద్దరు ఎసిపిలు, ఆరుగురు సిఐలు, పది మంది ఎస్ఐలు, 200 మంది పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా డిసిపి రజిత మీడియాతో మాట్లాడుతూ అనుమతి లేకుండా జాతీయ రహదారిపై 'చలో రాజమహేంద్రవరం'నకు వెళ్లే వారిపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. 'చలో రాజమహేంద్రవరం'నకు ఎటువంటి అనుమతీలేదని, విజయవాడలో సెక్షన్ 30, సెక్షన్ 144 అమలులో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో మొత్తం ఆరు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతి ఒక్క వాహనాన్నీ క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తర్వాతే పంపుతామని తెలిపారు. నిబంధనలను అతిక్రమించి వెళ్లే వారిపై జాతీయ రహదారుల దిగ్బంధం కింద 149, 341 సెక్షన్ల కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

తొలి రోజు 50కిపైగా ప్రశ్నలు?

- రాజమహేంద్రవరం జైల్‌లో బాబును ప్రశ్నించిన సిఐడి

ప్రజాశక్తి– రాజమహేంద్రవరం ప్రతినిధి

చంద్రబాబును ప్రశ్నించేందుకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు వచ్చిన సిఐడి అధికారులు దాదాపు 120 ప్రశ్నలను సిద్ధం చేసుకున్నట్లు తెలిసింది. వీటిలో తొలిరోజు 50కిపైగా ప్రశ్నలు వేసినట్లు సమాచారం. అత్యధిక ప్రశ్నలకు చంద్రబాబు కాదు, తెలియదు, గుర్తులేదు అని సమాధానం చెప్పినట్లు తెలుస్తోంది. కుట్రకోణం, నిధుల విడుదల, షెల్ కంపెనీల సాక్షాధారాల మాయంపై ప్రశ్నలు వేసినట్లు తెలిసింది. కేంద్ర దర్యాప్తు సంస్థలు సేకరించిన ఆధారాలకు అనుగుణంగా ప్రశ్నలు వేసినట్టు సమాచారం. చంద్రబాబు పిఎ శ్రీనివాస్ ఎందుకు అమెరికా పారిపోయారు? ఆదాయ పన్ను శాఖ ఇచ్చిన రిపోర్టులు, షెల్ కంపెనీల వెనుక ఎవరెవరున్నారు? స్కిల్ డెవలప్‌మెంట్ నిధుల విడుదలలో ఎందుకు తొందరపడ్డారు? అనే వాటిపై అంశాల వారీగా విచారణ చేసినట్లు సమాచారం. గత ప్రభుత్వ హయాంలో నిధుల విడుదలలో అధికారులపై ఎందుకు ఒత్తిడి తెచ్చారు? కీలకమైన ఫైళ్లు ఎందుకు మాయమయ్యాయి? అనే విషయాలపై కూడా ప్రశ్నించినట్లు తెలిసింది. సుమన్ బోస్‌తో రహస్య ఒప్పందం జరిగిందా? డిపిఆర్ లేకుండా ప్రాజెక్టు ఎందుకు ఫైనల్ చేయించారు అంటూ ప్రశ్నించినట్లు తెలిసింది. నిధులు విడుదల చేసేప్పుడు ప్రొసీజర్స్ ఎందుకు ఫాలో కాలేదు? ఫైనాన్స్ సెక్రటరీ వద్దన్నా నిధులు ఎందుకు విడుదల చేశారు? అని ప్రశ్నించినట్లు సమాచారం. యుపి కేడర్ ఐఎఎస్ ఆఫీసర్‌ను డిప్యూటీ సిఇఒగా ఎందుకు చేశారు? రూ.3 వేల కోట్ల గురించి అడగొద్దని అధికారులను ఎందుకు దబాయించారు? ఈ స్కామ్‌లో అచ్చెన్నాయుడు పాత్రపై వివరాలు కోరడంతోపాటు రూ.3 వేల కోట్లు గ్రాంట్ ఇన్ ఎయిడ్ డిస్కౌంట్‌గా ఎందుకు మారిందని ప్రశ్నించినట్లు తెలిసింది. సుమన్ బోస్‌తో సుబ్బారావుకు జరిగిన ఇ–మెయిల్స్ వివరాల గురించి అడిగినట్టు సమాచారం.

ప్రతిపక్షాన్ని సస్పెండ్ చేసి... ఏకపక్ష నిర్ణయాలు సరికాదు

(మొదటి పేజీ తరువాయి)

అప్పగించిందని ఆగ్రహించారు. మోడీ చెబితేనే సిఎం వైఎస్ జగన్ రాష్ట్రంలో విద్యుత్ ఛార్జీలు పెంచారని, దీనిపై ప్రతిపక్షం మాట్లాడకపోతే వైసిపికి మేలు కలుగుతుందన్నారు. రాష్ట్ర పరువు తీసిన బిజెపి నాయకులను కలవడం కోసం ఒకరోజు సిఎం జగన్, ఇంకోరోజు నారా లోకేష్ ఢిల్లీకి పోతున్నారని, వారికి సిగ్గు లేదా? అని ప్రశ్నించారు. జమిలి ఎన్నికలు ఎవరు కోరారని ప్రశ్నించారు. అన్నీ తన చేతుల్లో ఉండాలనే ధోరణిలో ప్రధాని నరేంద్ర మోడీ ఉన్నారని విమర్శించారు. పార్లమెంటరీ వ్యవస్థ లేకుండా తాను అధ్యక్షుడిగా ఉండాలని మోడీ భావిస్తున్నారన్నారు. విద్యుత్ భారాలకు వ్యతిరేకంగా పోరాటానికి ప్రజలు సిద్ధం కావాలని శ్రీనివాసరావు కోరారు. ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు, పాదయాత్ర బృంద నాయకులు జివి కొండారెడ్డి, ధర్నాకు సంఘీభావం తెలిపిన సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ తదితరులు ప్రసంగించారు. తొలుత ప్రజానాట్యమండలి రాష్ట్ర కార్యదర్శి అనిల్ ఆధ్వర్యంలో కళాకారులు ఆలపించిన చైతన్య గీతాలు ప్రజలను ఆలోచింపజేశాయి. ధర్నాకు సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ అధ్యక్షత వహించారు. సిపిఎం రాష్ట్ర నాయకులు పూనాటి ఆంజనేయులు, వై.సిద్ధయ్య, జాలా అంజయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు, ఎస్‌కె మాబు, వెల్లంపల్లి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం డిఆర్ఒ ఆర్.శ్రీలతను కలసి వినతిపత్రం అందజేశారు.

అబ్బురపరచిన ఆసియా క్రీడల ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

ఛాంపియన్ టైటిల్‌ను సాధించింది. అప్పటి నుంచి వరుసగా పది సార్లు ఈ టైటిల్‌ను నిలబెట్టుకుంటూ వస్తోంది. పతకాల పట్టికలో చైనా తరువాతి స్థానం కోసం జపాన్, దక్షిణ కొరియా పోటీ పడుతుంటాయి. భారత్ టాప్10లో ఒకటిగా ఉంటూవస్తోంది. గత రెండు పర్యాయాలు 8వ స్థానంలో నిలిచింది. ఈసారి వంద పతకాలు లక్ష్యంగా భారత్ బరిలోకి దిగుతోంది. పురుషుల వాలీబాల్ ఈవెంట్‌లో భారత జట్టు ఇప్పటికే క్వార్టర్ ఫైనల్స్‌లో అడుగుపెట్టింది. డిఫెండింగ్ ఛాంపియన్ జపాన్‌తో అది ఇప్పుడు తలపడనుంది. ఉత్తర కొరియా ఈ సారి రంగ ప్రవేశం చేస్తోంది.

భారత పతాక ధారులుగా హర్మన్, లవ్లీనా..

ప్రారంభ వేడుకల్లో భాగంగా నిర్వహించిన మార్చ్ పాస్ట్‌లో భారత బృందానికి హర్మన్, లవ్లీనా బోర్గోహైన్ నాయకత్వం వహించారు. త్రివర్ణ పతాకాన్ని చేబూని వారు ముందు నడవగా, ఇతర భారత అథ్లెట్లు వారిని అనుసరించారు. ఆసియా ఒలింపిక్ కౌన్సిల్ తాత్కాలికి అధ్యక్షుడు రణధీర్ సింగ్ భారత అథ్లెట్లతో కలసి నడిచారు. ఈసారి ఆసియా క్రీడల్లో భారత్ నుంచి 655మంది అథ్లెట్లతో కూడిన భారీ బృందం పాల్గొంటోంది. 61 క్రీడాంశాలకు గాను 41 విభాగాల్లో భారత్ పతకాల కోసం పోటీ పడుతోంది. 2018లో ఇండోనేషియాలోని జకార్తా వేదికగా జరిగిన 18వ ఆసియా క్రీడల్లో భారత్ 70 పతకాలు (16స్వర్ణాలు, 23రజతాలు, 31కాంస్యాలు) సాధించి ఎనిమిదో స్థానంలో నిలిచింది. బాక్సింగ్‌లో రెండుసార్లు ప్రపంచ చాంపియన్ నిఖత్ జరీన్, జావెలిన్‌లో నీరజ్ చోప్రా, టేబుల్ టెన్నిస్‌లో ఆకుల శ్రీజ పతకాలు గెలిచే సత్తా ఉన్నవాళ్లే. పురుషుల, మహిళల క్రికెట్‌కు ఈసారి ఆసియా క్రీడల్లో చోటు దక్కాయి.

చిన్నారి

మీకోసం

ఇంట్లో, వంటగదిలో బొద్దింకలు సమస్యలు తొలగిపోవాలంటే ఆ ప్రదేశాల్లో కొన్ని బిర్యానీ ఆకులను ఉంచాలి.

జీవన సౌరభం

నిన్ను నువ్వు పొగుడుకోనవసరం లేదు. తిట్టుకోనవసరం లేదు. నువ్వేంటనేది నీ పనులే చెబుతాయి.

తప్పు తెలుసుకున్న ఇందు

సింగారం అనే గ్రామంలో సిరి, ఇందు మంచి స్నేహితులు ఉన్నారు. సిరి బాగా చదివేది. ఇందు కూడా తెలివైనదే కానీ, చదువుపై అంతగా శ్రద్ధ పెట్టేది కాదు. బాగా బద్ధకం. ప్రతిదానికీ సిరిపైనే ఆధారపడుతుంది.

'పరీక్షలు దగ్గర కొస్తున్నాయి. చదువుకోవచ్చు కదా?' అని సిరి చెబితే వినేది కాదు. 'నువ్వు ఉన్నావ్ కదా! నీ దాంట్లో చూసి రాస్తాను లే' అని నవ్వుతూ బదులిచ్చింది ఇందు. 'ఎంత చెప్పినా వినదు. దాని మంకు దానిదే' అని మనసులోనే అనుకుంది సిరి.

పరీక్ష రోజు రానే వచ్చింది. జ్వరంగా ఉండటం వల్ల సిరి రెండు రోజులు పాఠశాలకు హాజరు కాలేదు. ఇందు చాలా బాధపడింది. 'అయ్యో సిరి ఉంది కదా అని నేను సరిగ్గా చదవలేదు. ఇప్పుడు నాకు తెలియని ప్రశ్నలు ఎవరు చెబుతారు? అనుకుంటూ బడికి బయలుదేరింది.

పరీక్షలు రాసింది కానీ మార్కులు తక్కువ వస్తాయని భయపడింది. మరుసటి రోజు కూడా సిరి పరీక్షకు హాజరు కాదని తెలిసి ఆ సాయంత్రం ఇంటికి వెళ్లగానే పుస్తకాలు తీసి శ్రద్ధగా చదివింది. మరుసటిరోజు పరీక్షకు సంతోషంగా బయలుదేరింది ఇందు. ఆ రోజు సిరి కూడా పరీక్షకు వచ్చింది. కానీ సిరిని ఏమీ అడక్కుండానే సొంతగా రాసింది.

పరీక్ష ముగిసిన తర్వాత 'ఏంటి ఇందు. పరీక్ష ఎలా రాసావు? ఒక్కసారి కూడా నన్ను అడగలేదు' అని అడిగింది సిరి.

'నువ్వు రావు అనుకొని నిన్న బాగా చదివాను. అన్నీ గుర్తున్నాయి. పరీక్ష కూడా బాగా రాశాను. చాలా సంతోషంగా ఉంది' అని బదులిచ్చింది ఇందు.

'చూసావా ఇందు. ఈరోజు నువ్వు ఎంత ఆనందంగా ఉన్నావో! నీకు చదువు బాగా వచ్చు. కానీ నేను చూపిస్తాను అని ఇన్ని రోజులు చదవడమే మానేసావు' అన్నది సిరి.

'అవును సొంతంగా చదివి రాస్తే వచ్చే ఆనందమే వేరు. ఇక నుండి కష్టపడి చదివి రాస్తాను.' అన్నది ఇందు. తన స్నేహితురాలిలో మార్పు వచ్చినందుకు సిరి చాలా సంతోషించింది.

– మొర్రిమేకల నాగేశ్వరి
7వ తరగతి, జెడ్‌పిహెచ్ మేళ్ళ చెరువు,
సూర్యాపేట జిల్లా.

పదాలు రాయండి

పిల్లలూ, ఇక్కడ ఉన్న పదాలకు వేరే అర్థాలు కూడా ఉన్నాయి. అవన్నీ 'కం' అక్షరంతో ముగుస్తాయి. ఇచ్చిన క్లూ ద్వారా మిగిలిన పదాలు మీరు రాయండి.

ముల్లు	కం ట	కం
పురుగు	___ ___	కం
అవరోధం	___ ___	కం
ఎలుక	___ ___	కం
ఎక్కువ	___ ___	కం
బంగారం	___ ___	కం

నేను గీసిన బొమ్మ

డొంక మనీష,
7వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ముత్యాలపేట,
కవిటి మండలం,
శ్రీకాకుళం జిల్లా.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ప్రెషర్ కుక్కర్ పేలినట్లు చెల్లాచెదురౌతున్న కలలు

పిల్లలు బాగా చదువుకోవాలని, మంచి స్థితిలో ఉండాలని తల్లిదండ్రులు కోరుకుంటారు. కష్టంగా ఉన్నా, ఇబ్బందులు పడుతున్నా శక్తికి మించి చదివిస్తారు. 'ఒత్తిడి పెట్టుకోవద్దు' అంటూనే మంచి ర్యాంకు తెచ్చుకోవాలని చాలామంది తల్లిదండ్రులు కలలు కంటారు. కానీ ప్రస్తుతం కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలు తల్లిదండ్రులకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. ప్రతిసారీ ఇలాగే జరుగుతున్నా ఈసారి మాత్రం తెగ కంగారు పడుతున్నారు. రాజస్థాన్ కోటాలో 20 మందికి పైగా విద్యార్థులు ఒత్తిడికి తట్టుకోలేక ప్రాణాలు తీసుకోవడం, ప్రముఖ తమిళ నటుడు, విజయ్ ఆంటోని పెద్ద కుమార్తె ఒత్తిడి తట్టుకోలేక ఇటీవల బలవన్మరణం చెందడం వంటి సంఘటనలు చాలామందిని కదిలిస్తున్నాయి.

చంద్రయాన్ ప్రయోగం విజయవంతమై చంద్రుని చేరిన మనం విజ్ఞానప్రయాణంలో నక్షత్ర తీరాలను తాకామని తెగ సంబరపడిపోయాం. అయితే మన కలలు, ఆకాంక్షలు ఆవైపు అడుగులు వేయడం ఎప్పుడో ప్రారంభమైపోయింది. ఆ ప్రభావంతోనే ఈ పోటీ ప్రపంచంలో తమ పిల్లలే ముందుండాలని, మంచి ర్యాంకులు సాధించాలని బిడ్డలు పుట్టిన దగ్గర నుండి మనకు తెలియకుండానే వాళ్లపై ఒత్తిడి పెంచేస్తున్నాం. 'జెఇఇ, ఐఐటి కోచింగ్ ఇవ్వాలని మేము పాప/ బాబు పుట్టినప్పుడే నిర్ణయించుకున్నాం' అనే తల్లిదండ్రులను ఎంతో మందిని చూశాను' అంటున్నారు ఢిల్లీలో జెఇఇ, ఐఐటి కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు ఆయిన్ అహ్మద్ సిద్ధిఖీ. '7,8 తరగతులు చదువుతున్నప్పుడే పిల్లలకు ఇక్కడికి పంపించే తల్లిదండ్రులు ఉన్నారు. కొంతమందైతే 5వ తరగతి నుండి శిక్షణ ఇస్తే కచ్చితంగా తమ పిల్లలు పోటీలో ముందుంటారని చెబుతారు' అని వివరించారాయన. ఊయల నుండే పిల్లలపై చదువు ఒత్తిడి పెట్టడం మధ్యతరగతి జీవితాల్లో సాధారణమని ఆయన చెబుతున్నారు.

ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశ పరీక్షలు

ఇంజినీరింగ్, వైద్య విద్య, సాంకేతిక రంగాల్లో అత్యున్నత స్థాయి అందుకోవాలంటే జెఇఇ, నీట్, ఐఐటి కోచింగ్ తప్పనిసరిగా తీసుకోవాల్సిందే. ఈ ప్రవేశపరీక్షలు విద్యార్థుల జీవితంలో అత్యంత ప్రతిష్టాత్మకమైనవి.. ప్రభావవంతమైనవి. అందుకే ప్రతి ఏటా రాజస్థాన్ కోటాలో ప్రవేశ పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థుల సంఖ్య రెండు లక్షలకు పైగా ఉంటోంది. ఇంకా అనేక వేల మంది తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాలకు కూడా తరలి వెళుతున్నారు.

ఒత్తిడి సర్వసాధారణం

కోటాలో సంభవిస్తున్న మరణాలు కొత్తవి కాదు. ఈ పరిణామం తీవ్ర రుగ్మతలో ఉన్న విద్యావ్యవస్థకు ప్రతిబింబం. కోచింగ్ సెంటర్లు కర్మాగారాల్లా పనిచేయడం ప్రారంభించిన నాటి నుండే ఇది మొదలైంది. శిక్షణ తీసుకుంటున్న విద్యార్థుల్లో మాదకద్రవ్యాల వినియోగం, నిద్రలేమి సమస్యలు, ఆందోళన సర్వసాధారణంగా ఉన్నాయని కొన్ని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అంటే భవిష్యత్తుపై ఎన్నో కలలు కంటున్న విద్యార్థులు, తల్లిదండ్రుల ఆశలు ఎప్పుడో ఒకప్పుడు ప్రెషర్ కుక్కర్ పేలినట్లు చెల్లాచెదురైపోతాయి.

పదేళ్లలో 70 శాతం పెరిగిన మరణాలు

జాతీయ నేర గణాంకాల నివేదిక(ఎన్‌సిఆర్‌బి) ప్రకారం 2021లో జరిగిన ఆత్మహత్యల్లో 8 శాతం అంటే 13 వేలకు పైగా మరణాల్లో విద్యార్థులే ఉన్నారు. 'పరీక్షల్లో వైఫల్యమే' కారణమని నివేదికలో తేలింది. దశాబ్దంనాటి గణాంకాలతో పోల్చినప్పుడు 2011లో ఈ మరణాలు 7 వేలకు పైచిలుకు ఉన్నాయి. అంటే పదేళ్లల్లో విద్యార్థుల ఆత్మహత్యలు 70 శాతం పెరిగాయి. 2023లో జెఇఇ కోసం సిద్ధమైన 1.95 లక్షల మంది విద్యార్థుల్లో 22 శాతం మంది మాత్రమే అర్హత సాధించారు. దీన్నిబట్టే పోటీ తీవ్రత, విద్యార్థులపై పెరుగుతున్న ఒత్తిడి ఎంతలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు.

ఐఐటి మద్రాస్‌లో వెల్‌నెస్ సెంటర్, నలుగురు క్లినికల్ సైకాలజిస్టులు, ఒక కౌన్సిలింగ్ సైకాలజిస్టు ఉన్నప్పటికీ ఈ ఏడాది నలుగురు విద్యార్థులు బలవన్మరణానికి పాల్పడ్డారు. 'తమ శక్తి సామర్థ్యాలు, ఏ రంగంలో నైపుణ్యత సాధించగలమన్న స్వీయ స్పృహ ప్రతి విద్యార్థి కలిగి ఉండాలి. శిక్షణ తీసుకుని ర్యాంకు వచ్చాక కూడా చదువు కొనసాగించడంలో ఒత్తిడి కొనసాగుతుంది. పరిస్థితి ఇలానే ఉంటే రాబోయే రోజుల్లో మరిన్ని ఆత్మహత్యలు చూడబోతాం' అని హెచ్చరిస్తున్నారు కేరళ షిప్పింగ్ ఇన్‌లాండ్ నావిగేషన్ కార్పొరేషన్ ఎండి ప్రశాంత్ నాయర్.

శ్రామిక జనాభాలో 6 శాతమే!

మన దేశ శ్రామిక జనాభాలో 6 శాతం మాత్రమే సంఘటిత రంగంలో ఉపాధి పొందుతున్నారు. ఈ శతాబ్దపు మొదటి దశాబ్దంలో జనాభా పెరుగుదల కారణంగా ప్రస్తుతం ప్రతి సంవత్సరం 24 మిలియన్లు అంటే రెండు కోట్ల 40 లక్షల మంది ఉద్యోగార్థులు సిద్ధమవుతున్నారు. అయితే ఐదు లక్షల మందికి మాత్రమే కొంత ఆర్థిక భద్రత ఇచ్చే వ్యవస్థీకృత రంగ ఉద్యోగాలు లభిస్తున్నాయి' అని ఆర్థికవేత్త, విశ్రాంత ప్రొఫెసర్ అరుణ్ కుమార్ అంటున్నారు.

పిల్లలపై ఒత్తిడికి అనేక కారణాలు

పిల్లలందరికీ పోటీపరీక్షలకు సిద్ధమయ్యే సామర్థ్యం ఉండదు. కేవలం తల్లిదండ్రుల ఇష్టానుసారం పరీక్షల్లో కూర్చొనే పిల్లలు చాలామంది. అందుకే పిల్లల శక్తి, సామర్థ్యాలను తల్లిదండ్రులే అంచనా వేయాలి. అప్పుడే వారిపై ఒత్తిడి తగ్గుతుంది. కానీ 'నీ కోసం లక్షల రూపాయలు ఖర్చు పెడుతున్నాం. నీకు ర్యాంకు రాకపోతే పరువు పోతుంది. నీ తోటి పిల్లలను చూసి నేర్చుకో' అని తల్లిదండ్రులు పిల్లలపై పదే పదే ఒత్తిడి తెస్తున్నారు. అలాగే ఏ పోటీ పరీక్షలోనైనా, చదివిన చదువుకు సరితూగే ప్రశ్నలు ఉండడం లేదు. అంతకుమించి ఉంటుంది. దీంతో ఇంటర్ తరువాత పోటీ పరీక్షలకు హాజరయ్యే పిల్లలు అదనంగా మరో కోర్సు నేర్చుకోవాల్సివస్తోంది. ఇక ఇన్‌స్టిట్యూట్లలో మార్కుల ఆధారంగా పిల్లల గ్రేడ్‌లు మార్చేస్తుంటారు. ఈ ప్రభావం వారిని తీవ్ర ఒత్తిడికి గురిచేస్తుంది. ఈమధ్య ఒత్తిడితో ఉన్న పిల్లలను తల్లిదండ్రులు మోటివేషన్ తరగతులకు పంపుతున్నారు. అది పిల్లల ఒత్తిడిని మరింత పెంచుతుంది. టీనేజ్ పిల్లల్లో భావోద్వేగాలు ఎక్కువగా ఉంటాయి. హార్మోన్ల హెచ్చు తగ్గులు, శరీరంలో మార్పులు, కొత్త కొత్త ఆలోచనలతో నిరంతరం వారు సతమతమవుతూ ఉంటారు. ఎప్పుడైతే పిల్లలు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని తెలిసిందో వారిని తల్లిదండ్రులు సైకాలిజికల్ కౌన్సిలింగ్ ఇప్పించాలి. స్వయంగా విద్యార్థులే తాము ఒత్తిడికి గురవుతున్నామని గమనించినా కౌన్సిలింగ్‌కు హాజరవ్వాలి. స్నేహితులు కూడా తమ ఫ్రెండ్స్ ఒత్తిడిని తగ్గించేలా కౌన్సిలింగ్‌ను సూచించాలి. సమాజంలో ఈరకమైన మార్పు వచ్చినప్పుడు పిల్లల్లో ఒత్తిడి తగ్గుతుంది. ఫలితంగా బలవన్మరణాలు నివారించబడతాయి.

– పి.విశేష్, సైకాలజిస్ట్,
8019 000066

కోచింగ్ సెంటర్లలో పడుతున్న ఒత్తిడి కంటే తల్లిదండ్రుల నుండే అధిక ఒత్తిడి ఉంటుందని కేరళ కొచ్చి కేంద్రంగా నడిచే కోచింగ్ సెంటర్ విద్యార్థులు అంటున్నారు. ' తల్లిదండ్రుల ఒత్తిడితోనే ప్రొఫెషన్ కోర్సులకు అత్యధిక మంది విద్యార్థులు వస్తున్నారు' అంటున్నారు కొచ్చికి చెందిన విశ్లేషకులు జయరామ్. 'సమాజంలో గౌరవం పొందాలంటే చదువు, ఉద్యోగం తప్పనిసరి అని భావించే మధ్య తరగతి కుటుంబాల నుండే కోచింగ్ సెంటర్లకు విద్యార్థులు బారులు తీరుతున్నారు' అని ఆవేదన చెందుతున్నారు జయరామ్.

తల్లిదండ్రుల ఆశలు, కలలే కోచింగ్ సెంటర్ల ప్రధాన ఆదాయ వనరుగా మారిపోయాయి. పిల్లలను బలి పశువులను చేస్తున్న తల్లిదండ్రులు, కోచింగ్ సెంటర్లు, ఇన్‌స్టిట్యూట్లు తమ ధోరణులను మార్చుకోనంత కాలం, చదువు పిల్లలకు, పెద్దలకు గుదిబండగానే ఉంటుంది. విజ్ఞానం స్థానంలో ఒత్తిడి చేరుతుంది. పిల్లల భవిష్యత్తు ఆశలను చిదిమేసే మరణశాసనాలు మళ్లీ మళ్లీ రాకుండా ప్రతి ఒక్కరూ మేల్కొనాలి.

చిరంజీవిని సరికొత్తగా చూపిస్తా : వశిష్ఠ

'బింబిసార' దర్శకుడు వశిష్ఠ మెగాస్టార్ చిరంజీవి 157వ సినిమా ప్రీ ప్రొడక్షన్ పనులను పర్యవేక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 'జగదేక వీరుడు అతిలోక సుందరి (1990) తర్వాత చిరంజీవిని మనం ఫాంటసీ చిత్రాల్లో చూడలేదు. ఈ సినిమా అప్పటి పిల్లలను బాగా ఆకట్టుకుంది. ఈతరం పిల్లలకు చిరంజీవిని అదే తరహాలో చూపించాలనుకుంటున్నా. ఫాంటసీ సినిమాలు, కార్టూన్లు చూస్తూ, చందమామ కథలు చదువుతూ పెరిగాను. మార్వెల్, డీసీ సూపర్‌హీరోల స్టోరీలు, విఠలాచార్య చిత్రాలను బాగా ఇష్టపడతా. ఓరోజు పాత మిక్కీ మౌస్ కార్టూన్ చూస్తున్న సమయంలో 'బింబిసార' సినిమా కథాలోచన వచ్చింది. ఇలాంటి కొత్త ప్రపంచాన్ని సృష్టించడంలో స్వేచ్ఛ తీసుకోవచ్చు. గుర్రాలు, ఏనుగులు గాల్లో ఎరగడంలాంటి ఎన్నో మ్యాజిక్స్‌ను జోడించొచ్చు. 'అవతార్'లా కొత్త ప్రపంచాన్ని రూపొందించడం, ప్రేక్షకులను అందులో లీనమయ్యేలా చేయడంలో ఆనందం ఉంది. అయితే అన్నింటికీ మించి స్టోరీ, స్క్రీన్‌ప్లేనే సినిమాకు బలమనేది నా అభిప్రాయం" అని పేర్కొన్నారు. నవంబరులో ఈ సినిమా చిత్రీకరణ ప్రారంభం కానుందని సమాచారం. చిరుకు జోడీగా అనుష్క, నయనతార పేర్లు ప్రచారంలో ఉన్నాయి.

గీతాంజలి మళ్లీ వచ్చింది!

అంజలి నటించిన 'గీతాంజలి' చిత్రానికి సీక్వెల్ తీసుకురావాలని మేకర్స్ ఎప్పటి నుంచో ప్లాన్ చేస్తున్నారు. తాజాగా దీని గురించి చిత్రబృందం ఓ ప్రకటన చేసింది. 'ప్రతీకార జ్వాలతో మళ్లీ వచ్చేస్తోంది గీతాంజలి' అంటూ సీక్వెల్ గురించి ప్రకటించారు. ఈ చిత్రానికి 'గీతాంజలి మళ్లీ వచ్చింది' అనే పేరు ఖరారు చేశారు. ఈ చిత్ర షూటింగ్ శనివారం నుంచి మొదలైంది. కోన వెంకట్ సమర్పణలో ఎంవీవీ సినిమా, కోన ఫిల్మ్ కార్పొరేషన్ సంస్థలు నిర్మిస్తున్నాయి. అంజలి కథానాయికగా నటిస్తున్న 50వ సినిమా ఇది. ఎంవీవీ సత్యనారాయణ, జీవీ నిర్మిస్తున్నారు.

అమ్మమ్మ పాత్రకైనా సిద్ధమే : అనసూయ



'ఇప్పటివరకూ అనసూయ అనగానే రంగమ్మత్త పాత్రనే గుర్తు చేసుకుంటున్నారు. 'పెదకాపు 1' విడుదల తర్వాత ఇందులోని పాత్ర పేరుతోనే నన్ను పిలుస్తారని' చెప్పారు అనసూయ. శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వం వహించిన ఈ చిత్రం ఈ నెల 29న రానుంది. ఈ సందర్భంగా అనసూయ హైదరాబాద్‌లో విలేకర్లతో ముచ్చటించారు. 'రంగమ్మత్త పాత్ర తర్వాత అందుకు ధీటైన పాత్రల్నే ఎంచుకుంటూ ప్రయాణం చేస్తున్నా. కానీ నుదుటిపై అలా ఓ పెద్ద బొట్టు పెట్టుకుని కనిపించేసరికి మళ్లీ రంగమ్మత్త అనే అంటున్నారు. 'పెదకాపు 1' నన్ను ఆశ్చర్యానికి గురిచేసిన మరో కథ. శ్రీకాంత్ అడ్డాల అనగానే ఆయన తరహా కథల్నే ఊహించుకుంటాం. కానీ ఓ కొత్త తరహా కథని ఈ సినిమాతో చెప్పారు. పాత్రలన్నీ కూడా చాలా బలంగా ఉంటాయి. నా వేషం, సంభాషణలు సినిమాకి హైలైట్‌గా నిలుస్తాయి." అని అన్నారు. 'అన్ని రకాల పాత్రలూ చేయాలనుకుంటాను. అమ్మమ్మ పాత్రకైనా నేను సిద్ధమే. కాకపోతే సినిమా విడుదల తర్వాత అమ్మమ్మ గురించి మాట్లాడుకునేలా ఉండాలి." అని ఒక ప్రశ్నకు జవాబుగా అన్నారు.

'చంద్రముఖి-2' సెన్సార్‌పూర్తి

రాఘవ లారెన్స్, కంగనా రనౌత్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'చంద్రముఖి 2'. పి.వాసు ఈ సినిమాను తెరకెక్కించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఈనెల 28న ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా దీని సెన్సార్ పనులు పూర్తయ్యాయి. ఈ మేరకు నిర్మాణ సంస్థ ట్వీట్ చేసింది. 2.37 గంటలపాటు సినిమా నిడివి ఉంటుందని నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ ట్వీట్ చేసింది. ఆదివారం ఈ చిత్రం ప్రీరిలీజ్ ఈవెంట్ హైదరాబాద్‌లో జరగనున్నట్లు తెలిపింది.

నయనతార పాత్ర అద్భుతం

షారూక్‌ఖాన్ హీరోగా నటించిన 'జవాన్'లో నయనతార నర్మద పాత్రలో నటించిన సంగతి తెలిసిందే. ఈ పాత్రపై షారూక్ ఆసక్తికర కామెంట్ చేశారు. తాజాగా ఆయన 'షారూక్‌ఖాన్‌తో మాట్లాడండి (ఆస్క్ ఎస్‌ఆర్‌కె)' అనే పేరుతో ఎక్స్‌లో అభిమానులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా ఓ అభిమాని 'జవాన్'లో నయనతార చేసిన నర్మద పాత్రను ప్రస్తావించారు. ఆ పాత్ర సన్నివేశాలు సినిమాలో అద్భుతంగా ఉన్నాయని ప్రశంసించారు. ఈ ట్వీట్‌కు షారుక్ సమాధానం ఇస్తూ 'నర్మద పాత్ర చాలా గొప్పగా ఉంది. దురదృష్టవశాత్తూ సినిమాలో ఆ పాత్ర నిడివి చాలా తక్కువ. కానీ, కనిపించిన కొంతసేపు అద్భుతంగా ఉంది' అని పేర్కొన్నారు. ఇక 'జవాన్'లో షారూక్ తన డైలాగుల గురించి చెబుతూ..దర్శకులు చెప్పినట్లు తాను చేస్తానని అన్నారు. వాటి కోసం సాధ్యమైనంత ఎక్కువ సమయం తీసుకుని

'యానిమల్' రష్మిక

టాలీవుడ్ దర్శకుడు సంజీవ్ రెడ్డి వంగ హిందీలో చేస్తున్న రెండో సినిమా 'యానిమల్'. ఇందులో రణబీర్ కపూర్, రష్మిక మందన్నా హీరో హీరోయిన్లు. తాజాగా ఈ చిత్రం నుండి రష్మిక లుక్‌ను చిత్రబృందం విడుదల చేసింది. హర్షవర్ధన్ రామేశ్వర్ ఈ సినిమాకి సంగీతం అందిస్తున్నారు. టి సిరీస్ భద్రకాళి పిక్చర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. డిసెంబర్ 1న ఈ చిత్రం విడుదల కానుంది.

29 నుంచి 'పాపం పసివాడు'

గాయకుడు శ్రీరామచంద్ర, గాయత్రి చాగంటి ప్రధాన పాత్రల్లో నటించిన వెబ్ సిరీస్ 'పాపం పసివాడు'. వీకెండ్ షో బ్యానర్‌పై ఇది తెరకెక్కింది. దీని ట్రైలర్‌ను దర్శకుడు సందీప్ రాజ్ విడుదల చేశారు. ఆహా వేదికగా ఈనెల 29 నుంచి ఇది స్ట్రీమింగ్ కానుంది. ట్రైలర్ విడుదలలో దర్శకుడు సందీప్ రాజ్ మాట్లాడారు. ప్రేమ, వినోదం ప్రధానాంశాలుగా తెరకెక్కిన ఈ సిరీస్ ప్రేక్షకులకు ఓ కొత్త అనుభూతినిస్తుందని అన్నారు. ఆహాతోనే తన కెరీర్ ప్రారంభమైందని శ్రీరామచంద్ర తెలిపారు. 'ఆహాతో కలిసి పనిచేయడం ఇది మూడోసారి. ఇక్కడే యాంకర్‌గా నా జర్నీ మొదలు పెట్టిన నేను.. ఇప్పుడు 'పాపం పసివాడు'తో యాక్టర్‌గా మారాను. ఈ కామెడీ ఎంటర్‌టైనర్‌ను అందరూ ఎంజాయ్ చేస్తారని ఆశిస్తున్నా' అని అన్నారు.

చిరస్థాయిగా నిలిచిపోయేలా ఆసియాడ్

క్రీడలను ప్రారంభిస్తూ జిన్‌పింగ్

త్రివర్ణ పతాకంతో భారత బృందం ముందు నడుస్తున్న హర్మన్, లవ్లీనా

ఆసియాడ్ చరిత్రలోనే చిరస్థాయిగా నిలిచిపోయేలా హాంగ్‌జౌ ఆసియన్‌గేమ్స్‌ను అద్భుతమైన రీతిలో నిర్వహించబోతున్నామని చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ తెలిపారు. పందొమ్మిదో ఆసియాడ్ క్రీడా సంబరాల ప్రారంభానికి ముందు ఏర్పాటు చేసిన స్వాగత విందులో ఆయన మాట్లాడారు. పందొమ్మిదో ఆసియా క్రీడలకు ఆతిథ్యమిస్తున్న హాంగ్‌జౌ నగరం గురించి ప్రస్తావిస్తూ, ఇటాలియన్ యాత్రికుడు మార్కో పోలో ఒకప్పుడు దీనిని 'సిటీ ఆఫ్ హెవెన్'గా అభివర్ణించిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రపంచంలోనే అత్యంత సుందరమైన నగరాల్లో హాంగ్‌జౌ ఒకటని కూడా ఇటాలియన్ యాత్రికుడు పేర్కొన్నారని జిన్‌పింగ్ చెప్పారు. కొన్నేళ్లుగా ఆసియా మొత్తంగా సుస్థిరమైన, వేగవంతమైన ఆర్థికాభివృద్ధిని కొనసాగిస్తున్నదని ఆయన అన్నారు. శాంతి, సంఘీభావం, సమ్మిళితతత్వం అనేవి ఆసియన్ ప్రజల ఆకాంక్ష, దీనికి ప్రతిరూపమే ఈ ఆసియా క్రీడలు అని ఆయన పేర్కొన్నారు.

ప్రారంభోత్సవానికి భారత్ దూరం

ఆసియాడ్ అక్రిడిటేషన్ ఉన్నప్పటికీ అరుణాచల్ ప్రదేశ్ అథ్లెట్లకు చైనా వీసాలు నిరాకరించినందుకు నిరసనగా ఈ క్రీడల ప్రారంభోత్సవానికి భారత్ దూరంగా ఉంది. శుక్రవారమే హాంగ్‌జౌకు వెళ్లాల్సిన కేంద్ర క్రీడా మంత్రి అనురాగ్ ఠాకూర్ చివరి నిమిషంలో తన పర్యటనను రద్దు చేసుకున్నారు. అలాగే భారత ఒలింపిక్ అసోసియేషన్(ఐఓఏ) అధ్యక్షురాలు పిటి ఉష కూడా ఆసియా క్రీడల ప్రారంభోత్సవ వేడుకలకు దూరంగా ఉన్నారు.

హాంగ్‌జౌలో ఏర్పాట్లు అద్భుతం

అంతర్జాతీయ క్రీడా విలేకరుల ప్రశంసలు

హాంగ్‌జౌ: చైనాలో అత్యంత సుందరమైన నగరాల్లో ఒకటైన హాంగ్‌జౌ ఆసియాడ్ కోసం సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యింది. అక్కడి ఏర్పాట్లు అదిరిపోయాయని పలు అంతర్జాతీయ క్రీడా ఈవెంట్లను కవర్ చేసిన విలేకరులు ప్రశంసించారు. పాకిస్తానీ జర్నలిస్టు, ఎక్స్‌ప్రెస్ న్యూస్ రిపోర్టర్ అయిన మహ్మద్ యూసఫ్ సిన్హువా వార్తా సంస్థతో మాట్లాడుతూ, తాను ఇంతవరకు మూడు అంతర్జాతీయ క్రీడా పోటీలను కవర్ చేశాను, వాటన్నిటికన్నా హాంగ్‌జౌ ఆసియాడ్ ఏర్పాట్లు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని ఆయన చెప్పారు. 2018 ఆసియాడ్‌లో తమ దేశం నాలుగు స్వర్ణాలు సాధించింది. ఈ సారి మరిన్ని స్వర్ణాలతో ఇంటికి తిరిగి వెళ్తామని ఈ పాకిస్తానీ జర్నలిస్టు పేర్కొన్నారు.

హాంగ్‌జౌ ఆసియాడ్‌ను స్మార్ట్‌గా, గ్రీనరీపరంగా, నైతికంగా, పర్యావరణ పరంగా అత్యున్నతమైన రీతిలో నిర్వహిస్తుండడం చాలా ఆనందంగా ఉందని హాంకాంగ్‌కు చెందిన జర్నలిస్టు హీదర్ డెవార్ పేర్కొన్నారు. హాంగ్‌జౌలో ఎటు చూసినా ఎలక్ట్రికల్ వెహికల్స్, సైకిళ్లే కనిపిస్తున్నాయి. ఆ సైకిళ్లపై హాయిగా తొక్కుకుంటూ వెళ్తున్నామని ఆమె అన్నారు.

ఖతార్‌కు చెందిన ఐఎన్‌ఎస్ స్పోర్ట్స్ విలేకరి అబ్దుల్ అజీజ్ మాట్లాడుతూ, హాంగ్‌జౌలో ఏర్పాటు భేషుగ్గా ఉన్నాయని కితాబిచ్చారు. ఎక్కడా ట్రాఫిక్ స్తంభించడం వంటిది లేదు. సిటీ, స్టేడియం, అధునాతన వసతులతో చూపరుల దృష్టిని ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. ఇక్కడి ప్రజలు మంచి సహకారాన్ని అందిస్తున్నారని అజీజ్ పేర్కొన్నారు. చైనా ఒలింపిక్స్ వంటి అతి పెద్ద క్రీడా సంబరాలను అద్భుతంగా నిర్వహించిందని అన్నారు.

సిరియన్ జర్నలిస్టు వెస్ట్ లేక్‌ను సందర్శించిన అనంతరం మాట్లాడుతూ, ఇక్కడి ప్రజలు చూపే ఆదరణ ముందు భాష ఒక సమస్యే కాదని అనిపించిందని అన్నారు. ఆసియన్ గేమ్స్ ముగిసిన తరువాత తన కుటుంబంతో సహా వచ్చి ఇక్కడ కొన్ని రోజులు గడపాలని అనుకుంటున్నానని చెప్పారు.

సిరీస్‌పై భారత్ గురి

నేడు ఆస్ట్రేలియాతో రెండో వన్డే

మ. 1.30గం॥ల నుంచి

ఇండోర్: తొలి వన్డేలో ఘన విజయం సాధించిన భారతజట్టు ఇక సిరీస్‌పై గురిపెట్టింది. ఇండోర్‌లోని హోల్కర్ స్టేడియంలో ఆస్ట్రేలియాతో ఆదివారం జరిగే రెండో వన్డేలోనూ నెగ్గి మరో మ్యాచ్ మిగిలి ఉండగానే సిరీస్‌ను కైవసం చేసుకోవాలని టీమిండియా భావిస్తోంది. వన్డే ప్రపంచకప్‌కు ముందు జరిగే చివరి సన్నాహక సిరీస్ ఇదే కావడం, పటిష్ట ఆస్ట్రేలియా సిరీస్ నెగ్గిన ఉత్సాహంతో బరిలోకి దిగాలని భావిస్తోంది. తొలి వన్డేలో నెగ్గిన భారత్ ఐసిసి వన్డే ర్యాంకింగ్స్‌లోనూ అగ్రస్థానానికి ఎగబాకిన విషయం తెలిసిందే. ఇక ఆస్ట్రేలియాజట్టు దక్షిణాఫ్రికా టూర్‌లో చివరి మూడు వన్డేల్లో, భారత్‌తో తొలి వన్డేలోనూ ఓటమితో వరుసగా నాలుగు వన్డేల్లో ఓడినట్లైంది. గత ఆరేళ్లలో ఆసీస్ ఇలా ఓడిన దాఖలాలు లేవు.

PM GatiShakti National Master Plan for Multi-Modal Connectivity | आज़ादी का अमृत महोत्सव | G20 भारत 2023 INDIA | Indian Railways

మన దేశానికి లభించిన బహుమతి

ఒకేసారి 9 వందే భారత్ రైళ్లు

01 ఉదయ్‌పూర్ - జైపూర్
02 తిరునెల్వేలి - మదురై - చెన్నై
03 కాసరగోడ్ - తిరువనంతపురం
04 జామ్‌నగర్ - అహ్మదాబాద్
05 రాంచీ - హౌరా
06 పాట్నా - హౌరా
07 రూర్కెలా - పూరి

ఆంధ్ర ప్రదేశ్‌కు కూడా లభించనున్న 2 వందే భారత్‌లు

విజయవాడ - చెన్నై & హైదరాబాద్ - బెంగళూరు

వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైళ్ళు

జెండా ఊపి ప్రారంభం

ప్రయోజనాలు

- విజయవాడ - చెన్నై వందేభారత్: ఈ మార్గంలో నడవనున్న మొదటి రైలు
  హైదరాబాద్ - బెంగళూరు వందేభారత్: ఈ మార్గంలో నడుస్తున్న వేగవంతమైన రైలు కన్నా 150 నిముషముల పైగా వేగవంతం.
- విజయవాడ, గుంటూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, తిరుపతి,కర్నూల్, అనంతపూర్, సత్య సాయి, చెన్నై, బెంగళూరు మరియు చుట్టుపక్కల నున్న జిల్లాలకు మెరుగైన అనుసంధానం
- మతపరమైన పర్యాటక అభివృద్ధితో పాటు వ్యాపారవేత్తలు, విద్యార్థులు, తరచుగా ప్రయాణించే వారికి మరియు అన్ని వృత్తులవారికి ప్రయోజనం.
- ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, తెలంగాణ & కర్ణాటక రాష్ట్రాలలో వ్యాపార అవకాశాల అభివృద్ధి తో పాటు సామాజిక ఆర్థిక అభివృద్ధికి ఊతం.

శ్రీ నరేంద్ర మోదీ

ప్రధాన మంత్రి

గారిచే

(వీడియో కాన్ఫరెన్స్ ద్వారా)

24 సెప్టెంబర్ 2023, ఆదివారం మధ్యాహ్నం 12.30 గంటలకు

విజయవాడ- చెన్నై - సమయ సూచిక

MAS-BZA	⬇ స్టేషన్ ⬆	BZA-MAS
Dep. 05:30	ఎమ్.జి.ఆర్ చెన్నై సెంట్రల్	Arr. 22:00
07:05/07:10	రేణిగుంట జంక్షన్	20:05/20:10
08:39/08:40	నెల్లూరు	18:19/18:20
10:09/10:10	ఒంగోలు	17:03/17:04
11:21/11:22	తెనాలి జంక్షన్	15:49/15:50
Arr. 12:10	విజయవాడ	Dep. 15:20

వందే భారత్ రైలు ముఖ్య విశిష్టతలు

- దేశీయంగా నిర్మించిన వందే భారత్ రైలు గరిష్ట వేగ పరిమితి గంటకు. 160 కి.మీ.
- ప్రతి సీటు కింద ఛార్జింగ్ పాయింట్‌లకు మెరుగైన అందుబాటుతో పాటు 360 డిగ్రీల సీట్ రొటేషన్ మరియు సీట్ వాలుకోణం పెంపుదల
- సీటు హ్యాండిల్ పై బ్రెయిలీ లిపిలో సీట్ నంబర్‌లు మరియు దివ్యాంగుల కోసం ప్రత్యేక లావేటరీ.
- ఏరోసోల్ ఆధారిత మెరుగైన అగ్నిమాపక భద్రతా వ్యవస్థ వ్యవస్థాపించబడింది.
- రైలు ఢీ కొనకుండా నివారించే భద్రతా వ్యవస్థ "కవచ్" పొందుపర్చబడింది.
- ప్రతి కోచ్లో సీ సీ టి వి కెమెరాలు మరియు ఇన్ఫోటైన్‌మెంట్ సౌకర్యాలతో అమర్చబడి ఉంటుంది
- పరిశుభ్రమైన గాలి కోసం బాక్టీరియా రహిత యూ.వి. లైట్ల ఏర్పాటు మంచి వెలుతురు మరియు ఎయిర్ కండిషనింగ్ సౌకర్యం.

హైదరాబాద్-బెంగళూరు - సమయ సూచిక

KCG-YPR	⬇ స్టేషన్ ⬆	YPR-KCG
Dep. 05:30	కాచిగూడ	Arr. 23:15
06:49/06:50	మహబూబ్ నగర్	21:34/21:35
08:24/08:25	కర్నూలు నగరం	19:50/19:51
10:44/10:45	అనంతపురం	17:29/17:30
11:14/11:15	ధర్మవరం	16:59/17:00
Arr. 14:00	యశ్వంతపూర్	Dep. 14:45

A1495 / PUB1083

DD NEWS DD News లో ఈ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించండి

భారతీయ రైల్వే

Follow us on /RailMinIndia

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68